

డిసెంబరు 26 నుంచి విశాఖ ఉత్సవ్
» నవంబరు 30న భీమిలి ఉత్సవ్
» పర్యాటకంపై విస్తృత ప్రచారం చేయండి
» సోషల్ మీడియా ఆర్గనైజర్ల సమావేశంలో కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్
-8లో



పట్టాలెక్కనున్న మెట్రో రైలు ప్రాజెక్టు

టెండర్ల ఆహ్వానం
డబుల్ డెక్కర్ మోడల్... నాలుగు వరుసల ఫ్లైఓవర్

» 3 కారిడార్లు... 46.23 కి.మీ. పొడవు
» 42 ఎలివేటెడ్ స్టేషన్లు
» అంచనా వ్యయం రూ.6,250 కోట్లు
» 30 నెలల్లో మొత్తం పూర్తి...
» 24 నెలల్లో 20.16 కి.మీ. డబుల్ డెక్కర్ నిర్మాణం పూర్తి చేయాలని షరతు
» సెప్టెంబరు 12న బిడ్లు ఓపెన్



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

విశాఖపట్నంలో మెట్రో రైలు ప్రాజెక్టు మొదటి దశ నిర్మాణానికి ఏపీ మెట్రో రైలు కార్పొరేషన్ శుక్రవారం టెండర్ విడుదల చేసింది. దీనికి అంతర్జాతీయ స్థాయిలో బిడ్డర్లను ఆహ్వానించింది. కాంట్రాక్టు దక్కించుకునే సంస్థే దీనికి ఇంజనీరింగ్, డిజైన్, నిర్మాణ బాధ్యతలు చూసుకోవలసి ఉంటుంది. ముందు నుంచి అనుకుంటున్నట్టుగానే తొలి దశలో స్టీల్ ప్లాంటు నుంచి కొమ్మాది వరకు మెట్రో కారిడార్‌ను 46.23 కి.మీ. పొడవున నిర్మించాల్సి ఉంటుంది. ఇందులో మూడు కారిడార్లు ఉంటాయి. అందులో 20.16 కి.మీ. మేర డబుల్ డెక్కర్ విధానంలో నాలుగు వరుసల ఫ్లైఓవర్ నిర్మాణం వస్తుంది. వీటన్నింటికి అంచనా వ్యయం రూ.6,250 కోట్లు. దీనికి జీఎస్టీ అదనం. కాంట్రాక్టు దక్కించుకున్న సంస్థ పనులు ప్రారంభించిన తేదీ నుంచి 24 నెలల్లో డబుల్ డెక్కర్ ఫ్లైఓవర్ నిర్మాణం పూర్తి చేయాల్సి ఉంటుంది. 30 నెలల్లో మొత్తం కారిడార్లు పూర్తిచేసి ఇవ్వాలి. ఈ మూడు కారిడార్లలో 42 ఎలివేటెడ్ మెట్రో స్టేషన్లను నిర్మిస్తారు. ఈ నెల 28వ తేదీ నుంచే వెబ్‌సైట్‌లో టెండర్ దరఖాస్తులను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఆగస్టు 12వ తేదీన టెండర్లు వేసిన వారితో ఆన్‌లైన్ సమావేశం నిర్వహించి, సందేహాలు నివృత్తి చేస్తారు. సెప్టెంబరు 5వ తేదీ నుంచి పూర్తిచేసిన టెండర్ల స్వీకారం మొదలవుతుంది. అదే నెల 12వ తేదీ మధ్యాహ్నం 3 గంటల వరకూ టెండర్లను స్వీకరించి, 3.30 గంటలకు టెండర్లను తెరిచి కాంట్రాక్టు ఎవరికి దక్కిందో ప్రకటిస్తారని ఏపీ మెట్రో రైలు కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు.

ఇదీ కారిడార్ల తీరు

మొత్తం మెట్రో రైలు కారిడార్ పొడవు 46.23 కి.మీ.

స్టీల్ ప్లాంటు నుంచి కొమ్మాది వరకు 34.41 కి.మీ. ఒక కారిడార్ వస్తుంది. ఇందులోనే డబుల్ డెక్కర్ ఫ్లైఓవర్ ఉంటుంది. దీని పరిధిలో 29 స్టేషన్లు వస్తాయి.

గురుద్వారా నుంచి పాత పోస్టాఫీస్ వరకు 5.07 కి.మీ. పొడవున రెండో కారిడార్ వస్తుంది. ఈ మార్గంలో ఆరు స్టేషన్లు ఉంటాయి.

తాటిచెట్లపాలెం నుంచి చిన్నవాల్తేరు వరకు 6.75 కి.మీ. మూడో కారిడార్ ఉంటుంది. ఇందులో ఏడు స్టేషన్లు వస్తాయి.

నేడు జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశాలు

విశాఖపట్నం, జూలై 25 (ఆంధ్రజ్యోతి):



జిల్లా ప్రజాపరిషత్ స్టాండింగ్ కమిటీ సమావేశాలు శనివారం జరగనున్నాయి. స్టాండింగ్ కమిటీ సమావేశాలు, సర్వసభ్య సమావేశం ఒకే రోజు (ఈ నెల తొమ్మిదో తేదీన) ఏర్పాటుచేయగా సభ్యులు అభ్యంతరం తెలిపారు. దాంతో స్టాండింగ్ కమిటీ సమావేశాలను 26వ తేదీకి వాయిదావేశారు. ఇదిలావుండగా జడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర (వైసీపీ)తో విభేదాల కారణంగా ఆరోజు సర్వసభ్య సమావేశానికి కూడా సొంత పక్షానికి చెందిన సభ్యులు సగానికిపైగా హాజరుకాలేదు. ఆ తరువాత శాసన మండలి విపక్ష నేత బొత్స సత్యనారాయణ వద్ద పంచాయితీ జరిగింది. వివాదానికి తెరదించాలని నేతలు సూచించ డంతో జడ్పీటీసీ సభ్యులు తాత్కాలికంగా అంగీకరించారు. ఈ నేపథ్యంలో శనివారం జరిగే స్టాండింగ్ కమిటీ సమావేశాల కు సభ్యులు హాజర య్యే అవకాశం ఉం దని కొందరు వెల్లడించారు. అయితే జడ్పీలో కొందరు ఉద్యోగుల అవినీతిని ప్రశ్నించాలని నిర్ణయించినట్టు తెలిసింది. ఏమి జరుగుతుందో చూడాలి.

గంజాయిపై ఉక్కుపాదం

సిటీలోకి రాకుండా నియంత్రించేందుకు చెక్‌పోస్టులు

» ఎనిమిది చోట్ల ఏర్పాటు
» మూడు షిఫ్టుల్లో నిరంతర తనిఖీలు
» వాటికి అనుబంధంగా రెండు మొబైల్ చెక్‌పోస్టులు
» గంజాయి రహిత నగరంగా తీర్చిదిద్దేందుకు మరికొన్ని చెక్‌పోస్టులను ఏర్పాటుచేసే ఆలోచన ఉందన్న పోలీస్ కమిషనర్



గంజాయి తనిఖీల కోసం శివారు ప్రాంతంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

నగరంలోకి గంజాయి రాకుండా అడ్డుకట్ట వేయడంపై పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ దృష్టిసారించారు. అందుకోసం శివారు ప్రాంతాలతో పాటు సిటీలో చెక్‌పోస్టులు ఏర్పాటుచేయించారు. అక్కడ నిరంతర తనిఖీలు నిర్వహించేలా మూడు షిఫ్టుల్లో (ముగ్గురు నుంచి నలుగురు) సిబ్బందిని నియమించారు. ఒకవేళ వారి నుంచి ఎవరైనా తప్పించుకున్నా వెంటపడి పట్టుకునేలా రెండు ప్రత్యేక లార్కింగ్ (మొబైల్) చెక్‌పోస్టులను ఏర్పాటుచేశారు.

నగరంలో గంజాయి వినియోగం పెరిగిపోయింది. ఆ మత్తులో కొందరు దాడులు, హత్యలు, అఘాయిత్యాలకు పాల్పడుతున్నారు. దీనివల్ల నగరంలో శాంతి భద్రతలకు విఘాతం కలుగుతోంది. నగరంలో గంజాయి దొరకుండా చేయగలిగితే నేరాలు గణనీయంగా తగ్గుతాయని సీపీ భావిస్తున్నారు. ఏజెన్సీతోపాటు ఒడిశా నుంచి నగరానికి గంజాయి చేరుతున్నందున ఆయా మార్గాల్లో చెక్‌పోస్టులు ఏర్పాటుచేయాలనే నిర్ణయించారు. వాహనాలను నగర శివార్లలో ఆపి క్షుణ్ణంగా తనిఖీ చేయగలిగితే 80 శాతం గంజాయిని నగరంలోకి రాకుండా నియంత్రించవచ్చునని అంచనా వేశారు. అనుకున్నదే తడవుగా నగరశివారు ప్రాంతాలైన ఆనందపురం, భీమిలి వద్ద ఉన్న చెక్‌పోస్టులను బలోపేతం చేయడంతోపాటు కొత్తగా మరికొన్ని చెక్‌పోస్టులను ఏర్పాటుచేయాల్సిన అవసరం ఉందని గుర్తించి వెంటనే వాటిని ప్రారంభించారు. అరకు వైపు నుంచి నగరంలోకి గంజాయి రవాణా జరుగుతున్నందున పెందుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలో సరిపల్లి వద్ద చెక్‌పోస్ట్‌ను ఏర్పాటు చేశారు. అలాగే పాడేరు నుంచి సబ్బవరం మీదుగా నగరంలోకి గంజాయి రవాణా అవుతుండడంతో పినగాడి వద్ద చెక్‌పోస్ట్ ఏర్పాటుచేశారు. కూర్మన్నపాలెం, స్టీల్‌ప్లాంటు, ఆనందపురం, తగరపువలస, రైల్వేస్టేషన్, ద్వారకా బస్‌స్టేషన్ ... మిగతా 6వ పేజీలో



విమానాశ్రయం వద్ద అశోక్‌గజపతిరాజుకు స్వాగతం పలుకుతున్న ప్రొటోకాల్ అధికారులు

గోవా బయలుదేరిన అశోక్‌గజపతిరాజు

గోపాలపట్నం, జూలై 25 (ఆంధ్రజ్యోతి):

గవర్నర్‌గా నియమితులైన కేంద్ర మాజీ మంత్రి పూసపాటి అశోక్‌గజపతిరాజు శుక్రవారం గోవా బయలుదేరి వెళ్లారు. సతీసమేతంగా మధ్యాహ్నం విశాఖ విమానాశ్రయానికి చేరుకున్న ఆయనకు విమానాశ్రయంలో ప్రొటోకాల్ అధికారులు పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. అనంతరం ఆయన విమానంలో హైదరాబాద్ బయలుదేరివెళ్లారు. అక్కడి నుంచి గోవా చేరుకుంటారు. శనివారం గవర్నర్‌గా ప్రమాణ స్వీకారం చేయనున్నారు.

ఉక్కు ఉద్యోగులకు శిథిల క్వార్టర్లు!

మూడు నెలల్లో రిటైర్ కాబోతున్న వారికి కేటాయింపు

» హెచ్‌ఆర్‌ఏకు కోత పెట్టేందుకే...
» ఖాళీగా ఉన్న క్వార్టర్లకు డబ్బులు వసూలు చేసే కుట్ర
» కోర్టును ఆశ్రయించిన స్టీల్ ఎగ్జిక్యూటివ్స్ అసోసియేషన్

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

ఉక్కు కర్మాగారం యాజమాన్యం శిథిలమైన ఖాళీ క్వార్టర్లను ఉద్యోగులకు బలవంతంగా కట్టబెట్టాలని చూస్తోంది. తీసుకోని వారికి ఇంటి అద్దె భత్యం (హెచ్‌ఆర్‌ఏ) నిలిపివేస్తామని చెబుతోంది. ఇంకో మూడు నెలల్లో పదవీ విరమణ చేసేవారికే ముందు క్వార్టర్లు కేటాయిస్తామని మెమోలు ఇచ్చింది. ఈ తీరును నిరసిస్తూ స్టీల్ ఎగ్జిక్యూటివ్స్ అసోసియేషన్ హైకోర్టు గుమ్మం ఎక్కింది.



శిథిలావస్థలో క్వార్టర్లు

ఉక్కు యాజమాన్యం 1980-90 మధ్యలో ఉద్యోగుల కోసం క్వార్టర్లు నిర్మించింది. అప్పటి పరిస్థితులను బట్టి సింగిల్ కామన్ వాష్‌రూమ్‌ను మాత్రమే నిర్మించారు. అయితే 24/7 విద్యుత్, తాగునీటి సదుపాయం, చుట్టూ పార్కులు, గ్రీనరీ, ప్లే గ్రౌండ్ వంటివి ఉండడంతో అప్పట్లో చాలా మంది మక్కువ చూపేవారు. వాటిని నిర్మించి 30 ఏళ్లు దాటిపోయింది. చాలావరకు శిథిలావస్థకు చేరుకున్నాయి. మరమ్మతులు కూడా లేవు. మరోవైపు స్టీల్ ప్లాంటు పరిసరాలు బాగా అభివృద్ధి చెందడంతో ఉద్యోగులు కూర్మన్నపాలెం, తదితర ప్రాంతాల్లో ఇళ్లు, ఫ్లాట్లు కొనుక్కొని వెళ్లిపోయారు. ఇప్పుడు ఆ క్వార్టర్ల కంటే బయట నివాసమే సౌకర్యవంతంగా ఉంది. విద్యుత్ బిల్లు కూడా శ్లాబుల ప్రకారం కట్టుకోవచ్చు. అదే ప్లాంటులో అయితే ప్రతి యూనిట్‌కు ఎనిమిది రూపాయలు కట్టాలి.

టౌన్‌షిప్‌లో సుమారు వేయి క్వార్టర్లు చాలా కాలంగా ఖాళీగా ఉన్నాయి. ఆర్థిక పరిస్థితి బాగా లేదని ఏడాది కాలంగా ఉద్యోగులకు ఇచ్చే హెచ్‌ఆర్‌ఏపై యాజమాన్యం 'డిఫర్' చేసింది. అంటే ఆర్థిక పరిస్థితి బాగుంటే ఇస్తామని, లేదంటే ఇవ్వబోమని అర్థం. ఇప్పుడు గత మూడు నెలల నుంచి నగదు లాభాలు చూపిస్తున్నారు. ఉద్యోగులకు బేసిక్‌లో 20 శాతం హెచ్‌ఆర్‌ఏ ఇవ్వాలి. అది యాజమాన్యానికి ఇష్టం లేదు. అందుకని మూడు నెలల్లో రిటైరయ్యే వారికి క్వార్టర్లు కేటాయిస్తామని, అంతా వాటిలో ఉండాలని ఉత్తర్వులు జారీ చేసింది. ఇంకో ... మిగతా 6వ పేజీలో

500 కోట్లతో ఆలయాల పునర్నిర్మాణం

» దేవస్థానాలన్నింటికీ పాలక మండళ్లను నియమిస్తాం
» ఇన్‌చార్జుల పాలనకు త్వరలో స్వస్తి
» దేవాలయాల భద్రతకు త్వరలో ప్రత్యేక విభాగం ఏర్పాటు
» మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

సింహాచలం, జూలై 25 (ఆంధ్రజ్యోతి):

రాష్ట్రవ్యాప్తంగా రూ.500 కోట్లతో పలు దేవాలయాల పునర్నిర్మాణం చేపడుతున్నామని దేవదాయ శాఖా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. ఆయన శుక్రవారం సింహాచలం వరాహ లక్ష్మీనృసింహస్వామిని దర్శించుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఆలయాల పరిమాణాన్ని బట్టి 18 నుంచి 24 నెలలు వ్యవధిని నిర్ణయించి, తగిన ప్రణాళికలు సిద్ధం చేసి, పనులు చేపడుతున్నామన్నారు. త్వరలోనే అన్ని దేవాలయాలకు పాలకమండళ్లను నియమిస్తామన్నారు. దీనికి సంబంధించిన నోటిఫికేషన్‌ను కమిషనర్ విడుదల చేశారన్నారు. గత ప్రభుత్వం కొన్ని ఆలయాలకు నియమించిన పాలకమండళ్ల కాలం ఈ ఏడాది ఆఖరువరకు ఉందని, వాటి గడువు ముగిసిన తరువాత మాత్రమే నూతన పాలక మండళ్లను నియమిస్తామన్నారు. దేవదాయ శాఖలో ఇన్‌చార్జిల పాలనకు త్వరలోనే ముగింపు పలుకుతామని మంత్రి పేర్కొన్నారు. దానికి అనుగుణంగా శాఖలో ఖాళీలు, పదోన్నతులు, రూల్ పొజిషన్, కేడర్ స్ట్రెంగ్త్ వంటి అంశాలపై అధ్యయనం జరుగుతోందన్నారు. దేవదాయ శాఖ కమిషనర్, కార్యదర్శుల నివేదికల ఆధారంగా ధార్మిక పరిషత్ ఆధ్వర్యంలో ... మిగతా 6వ పేజీలో



కప్పస్తంభం వద్ద మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

పంచ గ్రామాల భూ సమస్యకు త్వరలో పరిష్కారం

సింహాచలం దేవస్థానానికి సంబంధించి పంచగ్రామాల భూవివాదానికి త్వరలో పరిష్కారం లభిస్తుందని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అన్నారు. గత నివేదికల ఆధారంగా 12,149 మంది నివాసితులకు తక్షణ ఉపశమనం కలిగించేందుకు కృషిచేస్తున్నామన్నారు. ప్రత్యామ్నాయంగా దేవస్థానానికి స్థలాన్ని బదలాయించేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని, ఈ విషయాన్ని అడ్వకేట్ జనరల్ ద్వారా న్యాయస్థానానికి నివేదించామన్నారు. దీనిపై త్వరలోనే సానుకూలంగా తీర్పు వస్తుందని ఆశిస్తున్నామని, ఆ వెంటనే ఇళ్ల నిర్మాణాల క్రమబద్ధీకరణ చేపడతామన్నారు.

రూ.1.29 కోట్ల బంగారం, వజ్రాలతో ఇద్దరి అరెస్టు

» అందులో ఒకరు ఓ డైమండ్ కంపెనీ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్



స్వాధీనం చేసుకున్న ఆభరణాలు చూపుతున్న పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి

మహారాణిపేట, జూలై 25 (ఆంధ్రజ్యోతి): సుమారు రూ.1.29 కోట్ల విలువైన బంగారు ఆభరణాలు, వజ్రాల (డైమండ్స్)తో పరారైన ఓ డైమండ్ షోరూమ్ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్‌తో పాటు మరొకరిని అరెస్టు చేసినట్టు నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రతబాగ్చి తెలిపారు. శుక్రవారం కమిషనరేట్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. డాక్టర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం ప్రాంతానికి చెందిన ముదపాక జేజి (49) హైదరాబాద్‌కు చెందిన క్రిష్ డైమండ్ షోరూమ్‌లో ఆరు నెలల క్రితం ... మిగతా 6వ పేజీలో

హెల్త్‌సిటీ సమీపాన ఎంఎస్ఎంఈ పార్క్

» భీమిలి నియోజకవర్గంలో ఒకటి ఏర్పాటు చేస్తున్నాం
» మలి దశలో విజయనగరం వరకూ మెట్రో రైలు
» ఎంఎస్ఎంఈ శాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్



జ్యోతి వెలిగించి సదస్సు ప్రారంభిస్తున్న ఎంఎస్ఎంఈ శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్. చిత్రంలో వేమూరు రవి, సురేశ్ బాతా, కొసరాజు శ్రీధర్, విశాల్ ధూపర్ ఉన్నారు

విశాఖపట్నం, జూలై 25 (ఆంధ్రజ్యోతి):

నగరంలోని ఆరిలోవ హెల్త్ సిటీ సమీపాన రెండు ఎకరాల విస్తీర్ణంలో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల పార్క్ ఏర్పాటు చేయనున్నట్టు ఎంఎస్ఎంఈ శాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. సిరిపురంలోని వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్ ఎరీనాలో శుక్రవారం నిర్వహించిన ఏఐ సదస్సులో పాల్గొన్న ఆయన అనంతరం విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో నియోజకవర్గానికొకటి చొప్పున ఎంఎస్ఎంఈ పార్కులు ఏర్పాటుచేస్తామన్నారని, అది ఎంతవరకూ వచ్చిందని 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధి ప్రశ్నించగా...తొలి దశలో 50 పార్కులను అందుబాటులోకి తీసుకువస్తున్నామన్నారు. ఇప్పటికే 11 పార్కులు ప్రారంభమయ్యాయని, వాటిలో 300 ప్లాట్లు వివిధ పరిశ్రమలకు కేటాయించామన్నారు. మరో 30 పార్కుల పనులు ప్రారంభమయ్యాయన్నారు. వచ్చే నెలలో మరో 40 పార్కులు గ్రౌండింగ్ చేస్తామన్నారు.

విశాఖ జిల్లాకు సంబంధించి భీమిలి నియోజకవర్గంలో ఒక పార్క్ ఏర్పాటు చేస్తున్నామని, విశాఖ తూర్పు నియోజకవర్గానికి సంబంధించి హెల్త్ సిటీ సమీపాన ... మిగతా 6వ పేజీలో

ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌తో ఉజ్వల భవిష్యత్తు
» మంత్రి కొండపల్లి శ్రీనివాస్
... 8వ పేజీలో

సెప్టెంబరు 12 నుంచి పలు రైళ్ల మళ్లింపు

విశాఖపట్నం, జూలై 25 (ఆంధ్రజ్యోతి):

అరక్కోణం జంక్షన్‌లో నాన్ ఇంటర్ లాకింగ్ పనులు చేపట్టనున్న నేపథ్యంలో పలు రైళ్లను దారిమళ్లించనున్నట్టు విశాఖపట్నం సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. సెప్టెంబరు 12, 19, 26 తేదీల్లో జసిదిహ్-బెంగళూరు ఎక్స్‌ప్రెస్ (22306), 13, 20, 27 తేదీల్లో బెంగళూరు-కామాఖ్య ఏసీ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ (12551), 16, 20, 23 తేదీల్లో అగర్తల-బెంగళూరు హంసఫర్ ఎక్స్‌ప్రెస్ (12504), 16, 19, 26న బెంగళూరు-అగర్తల హంసఫర్ ఎక్స్‌ప్రెస్ (12503) రైళ్లు గూడూరు, రేణిగుంట జంక్షన్, తిరుత్తణి, మెల్పాక్కం, కాట్పాడి జంక్షన్ మీదుగా రాకపోకలు సాగిస్తాయని డీసీఎం ఆ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రయాణికుల సౌకర్యార్థం ఈ రైళ్లకు తిరుత్తణి వద్ద అదనంగా స్టాపేజ్ కల్పిస్తూ, పెరంబూర్ స్టేషన్‌లో హాల్ట్ తొలగించామన్నారు.

నేడు బదిలీ ఉపాధ్యాయుల నిరసన

భీమునిపట్నం (రూరల్),జూలై 25 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల బదిలీ అయిన ఉపాధ్యాయులకు తక్షణమే జీతాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ శనివారం సాయంత్రం డీఈఓ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేయనున్నట్టు యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నాగేశ్వరరావు, అంబేడ్కర్ తెలిపారు. శుక్రవారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. ఉపాధ్యాయులకు బదిలీ జరిగి వేరే పాఠశాలల్లో చేరి రెండు నెలలు కావస్తున్నా.. ప్రభుత్వం జీతాలు చెల్లించలేదన్నారు. దీనివల్ల వారు ఆర్థికంగా ఇబ్బందులకు గురవుతున్నారని చెప్పారు.

అనుమానితులకు సహకరించొద్దు : సీఐ



డ్రైవర్లతో మాట్లాడుతున్న సీఐ సురేశ్

సింహాచలం, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : ప్రయాణికుల మాదిరి ఆటోల్లో రాకపోకలు సాగించే సంఘ విద్రోహ శక్తులకు ఎట్టి పరిస్థితుల్లోనూ సహకరించొద్దని గోపాలపట్నం ట్రాఫిక్ సీఐ కె. సురేశ్ సూచించారు. శుక్రవారం ఆయన ఆటో డ్రైవర్లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇటీవల గంజాయి ముఠాలు ఇష్టానుసారం ఆటోల్లో సాధారణ ప్రయాణికుల్లా రాకపోకలు చేయడానికి ఆటో డ్రైవర్లు సహకరిస్తున్నారన్నారు. అధిక సొమ్ముకు ఆశపడి అనుమానితులకు సహకరించవద్దని సూచించారు. గంజాయి ముఠాలకు చెందిన సమాచారం తెలిస్తే పోలీసులకు తెలియజేయాలని కోరారు.

నగరపాలెం అభివృద్ధికి దివీస్ చేయూత

తగరపువలస, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : నగరపాలెం గ్రామాభివృద్ధికి దివీస్ యాజమాన్యం రూ.3,67,088 లక్షలు వితరణగా అందించింది. ఈమేరకు సచివాలయ సిబ్బందికి కంపెనీ ప్రతినిధులు శుక్రవారం చెక్కు అందజేశారు. గ్రామంలో పార్కు నుంచి పాఠశాల వరకు వీధి లైట్లు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరడంతో విద్యుత్ శాఖాధికారులు స్తంభాలు, వైర్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు తయారు చేశారు. అందుకు అయ్యే వ్యయాన్ని దివీస్ కంపెనీ సమకూర్చింది. ఈ సందర్భంగా కంపెనీ మేనేజర్ కోటేశ్వరరావు మాట్లాడుతూ గ్రామంలో వీధి లైట్లతో పాటు కాలువలు, పిల్లల పార్కు అభివృద్ధి, పుష్కర ఘాట్‌కు, సామాజిక భవనానికి మరమ్మతుకు కూడా నిధులు కేటాయిస్తామని చెప్పారు. అనంతరం సచివాలయానికి కంప్యూటర్, ప్రింటరు అందించారు. ఈ కార్యక్రమంలో దివీస్ అధికారులు శ్రీనివాస్, శేఖర్ బాబు, పైడినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ఆలిండియా ఫుట్‌బాల్ టోర్నీకి భాగ్యేష్

తగరపువలస, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : తగరపువలస ఫుట్‌బాల్ మైదానంలో రాష్ట్ర ఫుట్‌బాల్ అసోసియేషన్ తరఫున పది రోజులుగా జరిగిన అండర్ 16 జట్టు ఎంపికలో స్థానిక క్రీడాకారుడు కోలా భాగ్యేష్ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఈనెల 26 నుంచి మధ్యప్రదేశ్‌లోని బాలాఘాట్‌లో జరిగే టోర్నీలో (జూనియర్ విభాగం) రాష్ట్రం తరఫున పాల్గొనున్నట్టు కోచ్ చినబాబు తెలిపారు.

గుడివాడలో 27 మద్యం బాటిళ్లు పట్టివేత

భీమునిపట్నం (రూరల్) : మండలంలో అక్రమంగా మద్యం అమ్మకాలు చేస్తున్న చిల్ల తోగులురెడ్డిని భీమిలి పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. గుడివాడ గ్రామానికి చెందిన రెడ్డి మద్యం దుకాణాల్లో బాటిళ్లు కొనుగోలు చేసి వాటిని అదనపు ధరలకు విక్రయిస్తున్నాడని అందిన సమాచారం మేరకు అవంతి కళాశాల రోడ్డులో పట్టుకున్నామని ఎస్ఐ హరీష్ తెలిపారు. అతని నుంచి 27 బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు.

చోరీ కేసులో వ్యక్తి అరెస్టు

పద్మనాభం, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : దొంగతనానికి పాల్పడిన వ్యక్తిని శుక్రవారం అరెస్టు చేసినట్లు పద్మనాభం క్రైం పోలీసులు చెప్పారు. వారు తెలిపిన వివరాలు ప్రకారం.. మండలంలోని శేరిఖండంలో ఈనెల 21న సంగు అమ్మాజీ, వెంకన్న ఇంట్లో దొంగతనం జరిగింది. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మధురవాడ నార్త్ జోన్ క్రైం సీఐ సత్యప్రకాష్ ఆదేశాల మేరకు ఎస్సై శ్రీకాంత్ ఆధ్వర్యంలో రెండు బృందాలు నిందితుల కోసం గాలించాయి. ఈమేరకు మద్ది జంక్షన్‌లో ఈ బృందం చోడవరం మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన పి. నూకరాజును అదుపులోకి తీసుకుని అరెస్టు చేశారు.

కిడ్నీ బాధితులకు వైసీపీ నాయకుల పరామర్శ

పద్మనాభం, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : భద్రయ్యపేట కిడ్నీ బాధితుల సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తామని విజయనగరం జెడ్పీ ఛైర్మన్, భీమిలి వైసీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి మజ్జి శ్రీనివాసరావు చెప్పారు. శుక్రవారం ఆయన భద్రయ్యపేట గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రోగులకు మెరుగైన వైద్యం అందించాలని ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు.ఈ కార్యక్రమంలో ఎంపీపీ రాంబాబు, జెడ్పీ వైస్ ఛైర్మన్ గిరిబాబు, ఎంపీటీసీ సభ్యుడు సూరప్పడు, ఆదిబాబు, బంగారప్పడు, ఈశ్వరరావు పాల్గొన్నారు.

రోడ్లపై ఆక్రమణలను తొలగించండి

అధికారులకు జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ ఆదేశం



అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న కమిషనర్ కేతన్ గార్గ్

ఎండాడ, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : ఎండాడ - రుషికొండ డబుల్ రోడ్డులో రహదారులను ఆక్రమించి వ్యాపా రాలు చేస్తున్న వారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ పట్టణ ప్రణాళికా అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన 8వ వార్డు పరిధిలోని ఎండాడలో అధికారులతో కలిసి పర్యటించారు. ఎండాడ- రుషికొండ డబుల్ రోడ్డులో పలుచోట్ల రహదారులపై వ్యాపారాలు నిర్వహిస్తున్న వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మార్గంలో పలుచోట్ల బీటీ రోడ్డు లేకపోవడం వల్ల కొన్నిచోట్ల ఆక్రమణలు పెరిగాయని, వెంటనే బీటీ రోడ్డుతో పాటు కాలువల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ ప్రాంతంలో జరుగుతున్న నిర్మాణాల్లో గ్రీన్ మ్యాట్స్ ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలానే రహదారులపై భవన నిర్మాణ సామగ్రి వేస్తుండడంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారని, ఈ విషయమై చర్యలు తీసుకోవాలని జీవీఎంసీ ఏసీపీ తిరుపతిరావు, టౌన్‌ప్లానింగ్ కార్యదర్శులను ఆదేశించారు. విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని పట్టణ ముఖ్య ప్రణాళిక అధికారి ఎం. ప్రభాకరరావుకు సూచించారు. ఎండాడలో టీడీఆర్ సమస్య ఉంటే పూర్తి సమాచారంతో స్థలాలను పరిశీలించి ఆస్తులు కోల్పోయిన వారికి టీడీఆర్ రూపంలో ఇవ్వాలని ఆదేశించారు. అనంతరం ఎండాడలో ఉన్న ట్రిబుల్‌ఆర్ సెంటర్‌ను పరిశీలించారు. ఈ పర్యటనలో ఆయనతో పాటు జడ్పీ కనక మహాలక్ష్మి, సీపీ ధనుంజయ రెడ్డి, డీసీపీ హరిదాసు, తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు



కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, తదితరులు

భీమునిపట్నం, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలో అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తామని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం 4వ వార్డు జేవీ అగ్రహారంలో నిర్వహించిన సుపరిపాలనకు తొలిఅడుగు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఇంటింటికి వెళ్లి ఏడాది పాలనలో ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులు, అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. అర్హులైన వారు ఇళ్ల పట్టాలు, పింఛన్లకు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. గ్రామీణ ప్రాంతంలో 3 సెంట్లు, పట్టణ ప్రాంతంలో 2 సెంట్లు నివాస స్థలాలు అందిస్తామన్నారు. అనంతరం, రూ. 77.55 లక్షలతో ప్రతిపాదించిన రహదారులు, కాలువలకు, కె. నగరపాలెం, నరసింహనగర్‌లో కల్యాణ మండపాల నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు టీడీపీ అధ్యక్షుడు పాసి నరసింగరావు, జడ్పీ అయ్యప్పనాయుడు, తహశీల్దార్ రామారావు, నాయకులు బోర బంగారు రెడ్డి, రాధాకుమారి, గరికిన ఎల్లయ్య (కింగ్), పాసి త్రినాథరావు, దంతులూరి అప్పలనరసింహరాజు, మరుపిళ్ల రాజేంద్రప్రసాద్, చీపుళ్ళ శ్రీనివాసరావు, శీరపు రమణ, మైలపల్లి రాము, గంటా నూకరాజు, గాడు అప్పలనాయుడు, గొలగాని నరేంద్రకుమార్, అనిల్ ప్రసాద్ పాల్గొన్నారు.

క్లాప్ వాహన డ్రైవర్ల నిరసన



మారికవలస కల్యాణ మండపం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న డ్రైవర్లు

కొమ్మాది, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : చెత్తను తరలించే క్లాప్ వాహనాలకు పార్కింగ్ స్థలం కేటాయించాలని డిమాండ్ చేస్తూ డ్రైవర్లు శుక్రవారం మారికవలస కల్యాణ మండపం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాహనాలను తొలుత సాయి ప్రియా లేఅవుట్‌లో రహదారి పక్కన నిలుపుదల చేసేవారమని, అధికారులు అక్కడి నుంచి ద్రోణంరాజు కల్యాణ మండపం ఆవరణలోకి మార్చారని చెప్పారు. ప్రస్తుతం మారికవలస కల్యాణ మండపం ఆవరణలో నిలుపుదల చేస్తున్నామని తెలిపారు. కల్యాణ మండపాలు అద్దెకు ఇస్తుండడంతో అక్కడ వాహనాలు పార్కింగ్ చేయవద్దని జడ్పీ గేట్లకు తాళాలు వేయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.రాజీవ్ గృహకల్ప వద్ద పార్కింగ్ స్థలం చూపించినా... స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. వాహనాల నిలుపుదలకు శాశ్వత పరిష్కారం చూపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు అప్పలరాజు, పి. రాజ్‌కుమార్, బి. అప్పలరెడ్డి, పి. అశోక్‌ప్రసాద్, రాము పాల్గొన్నారు.

పీఏసీఎస్ పాలకవర్గం ప్రమాణ స్వీకారం



మజ్జివలస పీఏసీఎస్ నూతన పాలవర్గాన్ని అభినందిస్తున్న నాయకులు

భీమునిపట్నం (రూరల్), జూలై 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మజ్జివలస ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం (పీఏసీఎస్) నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారం శుక్రవారం జరిగింది. ఛైర్మన్‌గా గుడ్డాల ఎల్లయ్య, డైరెక్టర్లుగా కాగితాల రమణ, కాళ్ల సత్యనారాయణ ప్రమాణ స్వీకారం చేసి, బాధ్యతలు చేపట్టారు. తొలుత సొసైటీ పరిధిలో ఉన్న మజ్జిపేట,మజ్జివలస, లక్ష్మీపురం, సింగనబంద, నారాయణరాజుపేట, దాకమర్రి గ్రామాలకు చెందిన పార్టీ కార్యకర్తలు, సర్పంచులు ఎంపీ టీసీ సభ్యులు మజ్జివలస కూడలి నుంచి రాసపోలమ్మ గుడి వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు గాడు వెంకటప్పడు, టీడీపీ మండల అధ్యక్షుడు రాజు, జడ్పీటీసీ మాజీ సభ్యుడు అప్పారావు, నాయకులు నరసింహమూర్తిరాజు, సింగనబంద సర్పంచ్ నారాయణ, నీటి సంఘం అధ్యక్షుడు పాయల మహేశ్, గాడు తాతినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

తోటవీధిలో పారిశుధ్యం పనులు

భీమునిపట్నం, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని తోటవీధి వార్డు సచివాలయం పరిధిలో శుక్రవారం పారిశుధ్య కార్మికులు గ్యాంగ్ వర్క్ నిర్వహించారు. రహదారులు, కాలువలను శుభ్రం చేశారు. జోనల్ కమిషనరు ఆదేశాల మేరకు శానిటరీ ఇన్‌స్పెక్టర్ బి. మహాలక్ష్మీనాయుడు పర్యవేక్షణలో మేస్త్రి రేగాని రవి ఆధ్వర్యంలో ఈ పనులు జరిగాయి.. ఈ కార్యక్రమంలో శానిటరీ సెక్రటరీలు శివ, సురేష్, మనోజ్, త్రివేణి, వరప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాలపై దృష్టి

ఆనందపురం, జూలై 25 (ఆంధ్రజ్యోతి) :పంచాయతీలో మౌలిక సదుపాయల కల్పనే ధ్యేయమని తర్లువాడ సర్పంచ్ నాయుడు అన్నారు. శుక్రవారం పంచాయతీ పరిధిలోని నగరపాలెం రామాలయం వీధిలో కొత్తగా ఏర్పాటు చేసిన బోరును ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామస్తులకు కనీస సౌకర్యాలైన తాగునీరు, రోడ్లు, కాలువలు, పారిశుధ్యం వంటి వాటికి ప్రాధాన్యతా క్రమంలో నిధులు కేటాయిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ప్రతినిధి, మాజీ సర్పంచ్ మజ్జి వెంకటరావు, టీడీపీ మండల అధ్యక్షుడు తాత్రాజు అప్పారావు, నాయకులు బంకు రాజు, ఉప సర్పంచ్ పిల్లా సూరిబాబు, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

అప్పన్నను దర్శించుకున్న వీఎంఆర్‌డీఏ ఛైర్మన్



ప్రణవ్‌గోపాల్‌ను సత్కరిస్తున్న ఏఈఓ తిరుమలేశ్వరరావు

సింహాచలం, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహ స్వామిని వీఎంఆర్‌డీఏ ఛైర్మన్ ప్రణవ్‌గోపాల్ శుక్రవారం దర్శించుకున్నారు. ఆయనకు ఏఈఓ తిరుమలేశ్వరరావు స్వాగతం పలికారు. కప్ప స్తంభాన్ని ఆలింగనం చేసుకున్న ప్రణవ్ గోత్రనామాలతో అంతరాలయంలో అర్చకులు పూజలు చేశారు. గోదాదేవి దర్శనం తరువాత పండితులు ఆశీర్వచనాలీయగా ఏఈఓ శాలువతో సత్కరించి, స్వామివారి ప్రసాదాలు, ఫొటోను అందజేశారు.



కొలువు సాధించిన వారికి ధ్రువీకరణ పత్రాలు అందిస్తున్న అతిథులు

గీతంలో విజేతల దినోత్సవం

సాగర్‌నగర్, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో శుక్రవారం ఎచీవర్స్ డే (విజేతల దినోత్సవం) ఘనంగా నిర్వహించారు. రికార్డు స్థాయిలో 1507 మందికి పైగా విద్యార్థులు ఉద్యోగాలు సాధించడంతో పాటు ప్రముఖ విదేశీ వర్సిటీల్లో ఉన్నత విద్యాభ్యాసానికి ప్రవేశాలు సాధించడంతో ఈ కార్యక్రమాన్ని జరిపారు. 300కు పైగా జాతీయ, అంతర్జాతీయ కంపెనీలు నిర్వహించిన ఇంటర్వ్యూల్లో పలువురు విద్యార్థులు ఉద్యోగాలు సాధించారు. ఇంజనీరింగ్‌లో అత్యధిక వార్షిక వేతనం రూ. 34 లక్షలు కాగా ఎంబీఏలో రూ. 11 లక్షల వార్షిక వేతనాన్ని, సైన్స్‌లో రూ 7.3 లక్షల వార్షిక వేతనం, ఫార్మశీలో రూ 4 లక్షల వార్షిక వేతనంతో విద్యార్థులు కొలువులు సాధించారు. తొలుత ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఏటీఅండ్‌ఎన్‌టీ మానవ వనరుల విభాగం డైరెక్టర్ ప్రగతికుమార్ అచంట మాట్లాడుతూ గీతం సాధిస్తున్న విజయాలను ప్రతిఒక్కరూ గమనిస్తున్నారని, నాణ్యత ప్రమాణాలను పాటిస్తున్న ఉన్నత విద్యాలయంగా గీతం ప్రగతి స్ఫూర్తిదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ వీసీ ప్రొఫెసర్ ఎరోల్‌డిసౌజా, ప్రో వీసీ ప్రొఫెసర్ వై. గౌతమ్‌రావు, కెరీర్ గైడెన్స్ సెంటర్ అధిపతి ఉమాదేవి, విశాఖ కెరీర్ గైడెన్స్ సెంటర్ డైరెక్టర్ వంశీ కిరణ్ సోమయాజులు, తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో శ్రావణ సందడి



పూజలు చేస్తున్న అర్చకులు

సింహాచలం, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలోని అన్ని మండలాల్లోనూ శ్రావణ శుక్రవారం తొలి పూజ ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే అమ్మవార్ల ఆలయాలు భక్తులతో కిటకిలాడాయి. వరాహలక్ష్మీనృసింహ స్వామి దేవాలయంలో కుంకుమార్చనలతో శ్రావణ లక్ష్మికి పూజలు చేశారు. ప్రభాతారాధనలు తరువాత సింహవల్లీ తాయార్, చతుర్భుజి తాయార్ అమ్మవార్ల ఉత్సవమూర్తులను ప్రత్యేక వేదికపై ఉంచారు. దేవస్థానం నిర్ణయించిన రూ.2500 టికెట్లు తీసుకుని పాల్గొన్న 11 మంది భక్తుల గోత్రనామాలతో అర్చకులు సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం లక్ష్మీ సహస్రనామావళి పఠిస్తూ వైదికులు పూజలు చేశారు. సాయంత్రం సింహవల్లీ తాయారు సన్నిధిలో సహస్రనామ కుంకుమార్చనలు నిర్వహించారు.

కరెన్సీ నోట్లతో వాసవీ మాత అలంకరణ

భీమునిపట్నం : శ్రావణ మాసం మొదటి శుక్రవారం పురస్కరించి కన్యకాపరమేశ్వరి అమ్మవారిని కరెన్సీ నోట్లతో అలంకరించారు. అమ్మవారిని రూ. 3,80 లక్షల విలువైన నోట్లతో అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

పద్మనాభంలో..

పద్మనాభం : మండలంలోని పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పద్మనాభంలోని కుంతీమాధవస్వామి ఆలయ ఆవరణలో ఉన్న లక్ష్మీదేవికి ఆలయ అర్చకులు పంచామృతాభిషేకాలు నిర్వహించి పూజలు జరిపారు. గెద్దపేట సుబ్రహ్మణ్యేశ్వర సమేత లక్ష్మీగణపతి ఆలయంలో ఉమామహేశ్వరికి శ్రావణ మాస ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీసూక్త విధానంలో అమ్మవారికి అష్టోత్తర పూజలు, పంచామృతాభిషేకాలు, కుంకుమ పూజలు జరిపారు. పద్మనాభంలోని కన్యకా పరమేశ్వరి ఆలయంలో కూడా శ్రావణ మాసం పూజలు జరిగాయి.



అమ్మవారికి కరెన్సీ నోట్లతో అలంకరణ

2,631 వితంతు పింఛన్లు మంజూరు

విశాఖపట్నం, జూలై 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అందించే సామాజిక పింఛన్ తీసుకుంటూ మరణించిన వారి భార్యకు కొత్తగా వితంతు పింఛన్ మంజూరుచేశారు. జిల్లాలో 2,631 మందికి పెన్షన్ మంజూరైనట్లు అధికారులు తెలిపారు. 2023 నుంచి భర్త మరణించిన వారికి పింఛన్ల పంపిణీ నిలిపివేశారు. రెండేళ్ల నుంచి పింఛన్లు రాకపోవడంతో వారంతా ప్రభుత్వానికి పలు దఫాలుగా అర్జీలు పెట్టారు. ప్రభుత్వం స్పందించి రెండు నెలల క్రితం సర్వే చేసి జాబితాలు సిద్ధం చేసింది. ఈ నేపథ్యంలో వచ్చే నెల ఒకటో తేదీన వితంతు పింఛన్లు పంపిణీ చేయనున్నారు. దీనికి సంబంధించి సచివాలయాల వారీగా జాబితాలు అందాయి. కాగా ఆగస్టు నెలకు సంబంధించి జిల్లాలో 1,60,778 మందికి పింఛన్లు మంజూరుచేశారు. ఈ నెలాఖరున సచివాలయం వారీగా సొమ్ములు డ్రా చేసి ఆయా వర్గాలకు అందజేస్తారు.

రెవెన్యూ బదిలీల్లో మార్పులు

విశాఖపట్నం, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : రెవెన్యూ శాఖ బదిలీల్లో మార్పులు చోటుచేసుకున్నాయి. ముగ్గురు ఉద్యోగులకు గతంలో ఇచ్చినచోట కాకుండా మరోచోట పోస్టింగ్ ఇచ్చారు. అలాగే మరో ఆరుగురికి డిప్యూటేషన్‌పై ఇతర శాఖల్లో పోస్టింగ్ ఇస్తూ కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ శుక్రవారం ప్రొసీడింగ్స్ ఇచ్చారు. ఇటీవల చేపట్టిన బదిలీల్లో అనకాపల్లి జిల్లాకు బదిలీ చేసిన ముగ్గురికి విశాఖ జిల్లాలోనే పోస్టింగ్ ఇచ్చారు. విశాఖ జిల్లాలో పలుచోట్ల పని చేస్తున్న ఆరుగురు ఉద్యోగులను యూఎల్‌సీ, పౌర సరఫరాలు, భూసేకరణ విభాగాలకు డిప్యూటేషన్‌పై పంపుతూ ఆదేశించారు.

500 కోట్లతో ఆలయాల పునర్నిర్మాణం

... 5వ పేజీ తరువాయి

పదోన్నతులు కల్పిస్తామని, తద్వారా పూర్తిస్థాయి అధికారుల నియామకం జరుగుతుందన్నారు. దేవాలయాల భద్రతలో మార్పులు తీసుకువస్తున్నామని, త్వరలో ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. ప్రధాన ఉత్సవాల వేళ ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకుని, ప్రమాదాలు సంభవించకుండా తగిన వ్యవస్థను రూపొందిస్తున్నట్టు చెప్పారు. ఆయా ఆలయాల స్థితిగతులను అధ్యయనం చేసి భక్తులకు వసతి సౌకర్యాన్ని అభివృద్ధి చేసేందుకు మాస్టర్‌ప్లాన్ రూపొందించి, పనులు చేపడతామన్నారు. ఎన్ఎంఆర్‌ల క్రమబద్ధీకరణ సమస్య రాష్ట్రవ్యాప్తంగా ఉందని, ఏళ్లుగా పనిచేస్తున్న వారిని తొలగించే ప్రసక్తే లేదని, వారికి న్యాయం చేసేందుకు కట్టుబడి ఉన్నామన్నారు. అర్చకులు జీవితకాలం పనిచేసే విధంగా ప్రభుత్వం జారీచేసిన ఆదేశాలను సవరించాలని దేవాలయ స్థానాచార్యులు, ప్రధానార్చకులు మంత్రికి సూచించారు. దీనివల్ల భవిష్యత్తులో వైదిక వృత్తిలోకి యువత ప్రవేశించేందుకు దారులు మూసుకుపోతాయన్నారు. ఈ అంశంపై చర్చిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. చందనోత్సవం సమయంలో గోడ కూలిన ప్రాంతంలోని మెట్లను తక్షణమే పునరుద్ధరించాలని ఈఓను ఆదేశించారు. వరాహ లక్ష్మీనృసింహస్వామిని దర్శనానికి వచ్చిన మంత్రి ఆనం రామనారాయణరెడ్డికి పూర్తి అధికార లాంఛనాలతో ఈఓ వేంద్ర త్రినాథరావు ఆహ్వానం పలికారు. మంత్రి గోత్రనామాలతో అంతరాలయంలో అర్చకులు పూజలు చేసి శేషవస్త్రాన్ని పర్యవేట్టంగా చుట్టారు. అనంతరం కప్పస్తంభం ఆలింగనం, గోదాదేవి అమ్మవారి సన్నిధిలో పూజలు తరువాత పండితులు చతుర్వేద స్వస్తి వచనాలతో ఆశీర్వచనాలీయగా, ఈఓ శాలువాతో సత్కరించి స్వామి చిత్రపటాన్ని, ప్రసాదాలను అందజేశారు. మంత్రిని దేవదాయశాఖ డిప్యూటీ కమిషనర్ ఎన్.సుజాత, ఏసీ అన్నపూర్ణ, కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం ఈఓ శోభారాణి, తదితరులు మర్యాదపూర్వకంగా కలిశారు.

బంగారం, వజ్రాలతో ఇద్దరి అరెస్టు

... 5వ పేజీ తరువాయి

మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్‌గా చేరాడు. షోరూమ్‌లోని డైమండ్, బంగారు ఆభరణాల మోడల్స్‌ను విశాఖలోని వివిధ గోల్డ్ షోరూమ్‌లలో చూపించేందుకు అదే సంస్థలో పనిచేస్తున్న బొగ్గు వంశీ అనే మరో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్‌తో కలసి ఈనెల మూడో తేదీన విశాఖపట్నం వచ్చారు. ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదురుగా ఉన్న హోటల్‌లో గది తీసుకొని ఇద్దరూ బస చేశారు. ఆరోజు వివిధ షోరూమ్‌లలో ఆభరణాల మోడల్స్ చూపించి తిరిగి తీసుకువచ్చారు. మరుసటి రోజు తెల్లవారుజామున సుమారు ఐదు గంటల సమయంలో తనతో పాటు వచ్చిన వంశీ నిద్రిస్తున్న సమయంలో ముదపాక జేజి ఆభరణాల బ్యాగ్‌తో పరారయ్యాడు. నిద్ర నుంచి లేచి చూసిన వంశీకి జేజితో పాటు ఆభరణాల బ్యాగ్ కనిపించలేదు. సీసీ ఫుటేజీలు పరిశీలించి బ్యాగ్‌తో పరారైనట్టు గుర్తించి వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు సీఐ ఉమాకాంత్ ఆధ్వర్యంలో దర్యాప్తు చేపట్టారు. శుక్రవారం ఉదయం రైల్వే ట్రాక్ వద్ద అనుమానాస్పదంగా ఇద్దరు బ్యాగ్‌తో కనిపించడంతో వారిని అదుపులోకి తీసుకొని తనిఖీచేశారు. ఆభరణాలు కనిపించడంతో వాటిని స్వాధీనం చేసుకున్నారు. అందులో ఒకరు ముదపాక జేజి కాగా మరొకరి పేరు ఆకుల సత్యనారాయణ. ఇద్దరినీ అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వారి వద్ద నుంచి రూ. 1,29,48,154 విలువైన వజ్రాలు, బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్టు కమిషనర్ బాగ్చి పేర్కొన్నారు.

ఉక్కు ఉద్యోగులకు శిథిల క్వార్టర్లు!

... 5వ పేజీ తరువాయి

మూడు నెలల్లో రిటైరయ్యేవారు ఇప్పుడు కుటుంబాన్ని క్వార్టర్‌లోకి మార్చే అవకాశం లేదు. పైగా అక్కడ సదుపాయాలు లేవు. యాజమాన్యం చెప్పినట్టు క్వార్టర్‌లో ఉండలేరు. బయట ఉంటే హెచ్‌ఆర్ఏ ఇవ్వరు. స్టీల్ ప్లాంటుకు ఎనిమిది కి.మీ. దాటి ఉన్నవారికే క్వార్టర్లు ఇస్తారు. అంతకంటే తక్కువ దూరంలో ఉన్న వారికి ఇవ్వరు. గతంలో తప్పుడు సమాచారం ఇచ్చి క్వార్టర్‌లో చేరారని ఆరోపిస్తూ చాలామందిని బయటకు పంపించేశారు. ఇప్పుడు అలాంటి వారందరినీ క్వార్టర్లలోకి రమ్మంటున్నారు. కనీసం మరమ్మతులు కూడా చేపట్టకుండా వాటిని కేటాయిస్తున్నారు. టౌన్‌షిప్ నిర్వహణకు కూడా సరిగ్గా నిధులు ఇవ్వడం లేదు. వాస్తవానికి వాటిని కూల్చివేసి కొత్తవి నిర్మించాలి. వాటి పుస్తక విలువ కూడా జీరో అయిపోయి చాలా కాలమైంది. భారీవర్షాలు కురిసి ఏదైనా క్వార్టర్ కూలిపోతే కుటుంబం పరిస్థితి ఏమిటో యాజమాన్యమే చెప్పాలి. ఇటీవల ఓ ఉద్యోగి క్వార్టర్‌లో పాము కరిచి మరణించారు. దీంతో క్వార్టర్లలో ఉండడానికి అంతా భయపడుతున్నారు.

తప్పనిసరై ఆశ్రయించాం

- కేవీడీ ప్రసాద్, సెక్రటరీ, స్టీల్ ఎగ్జిక్యూటివ్స్ అసోసియేషన్

న్యాయం కోరుతూ హైకోర్టులో రిట్ పిటిషన్ వేసిన మాట వాస్తవమే. స్టే ఆర్డర్ ఇవ్వాలని కోరాము. అయితే ఈ విషయం న్యాయస్థానం పరిధిలో ఉన్నందున ఇంతకు మించి మాట్లాడలేము.

గంజాయిపై ఉక్కుపాదం

... 5వ పేజీ తరువాయి

వద్ద చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. ప్రతి చెక్‌పోస్టు వద్ద ముగ్గురు లేదా నలుగురు సిబ్బంది ఉంటూ అన్ని ఆర్టీసీ బస్సులు,ప్రైవేటు బస్సులు, కార్లు, వ్యాన్‌లు, బైక్‌లతోపాటు అన్ని రకాల వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేస్తారు. ఒకవేళ అక్కడ పోలీసులను చూసి ఎవరైనా వాహనం ఆపకుండా ముందుకువెళ్లిపోతే వారిని పట్టుకునేందుకు వీలుగా రెండు ప్రత్యేక లార్కింగ్ (మొబైల్) చెక్‌పోస్టులను ఏర్పాటుచేశారు. ఆయా చెక్‌పోస్టుల వద్ద మూడు షిఫ్టుల్లో నిరంతరం పని చేసేలా సిబ్బందిని నియమించారు. దీంతో నగరంలోకి గంజాయి రవాణా తగ్గుతుందని ఆశిస్తున్నట్టు సీపీ శంఖబ్రతబాగ్చి వివరించారు. గంజాయి రహిత నగరంగా విశాఖను తీర్చిదిద్దేందుకు మరికొన్ని చెక్‌పోస్టులు కూడా ఏర్పాటు చేసే ఆలోచన ఉందని, సిబ్బంది కొరత కారణంగా వేచిచూస్తున్నామన్నారు.

హెల్త్‌సిటీ సమీపాన ఎంఎస్ఎంఈ పార్క్

... 5వ పేజీ తరువాయి

రెండు ఎకరాలు తీసుకుంటున్నామన్నారు. అమెరికా పౌరులకే ఉద్యోగాల్లో ప్రాధాన్యం అంటూ ఆ దేశ అధ్యక్షుడు ట్రంప్ చేసిన వ్యాఖ్యల ప్రభావం ఏపీపై ఎంతవరకు ఉంటుందని ప్రశ్నించగా, దానిని పాజిటివ్‌గా తీసుకోవాలని మంత్రి సూచించారు. అమెరికా ఒక్కటే ఉద్యోగాలు ఇవ్వదని, ప్రపంచంలో అనేక దేశాలు ఉన్నాయని, టెక్నాలజీలో ఏపీ అగ్రస్థానాన ఉందని, ఏఐలో కూడా టాప్‌లో ఉన్నామని, ఆయా దేశాలే ఉద్యోగ అవకాశాలు ఇవ్వడానికి ముందుకు వస్తాయన్నారు. విశాఖ మెట్రో రైలు కారిడార్ తొలి దశ ఇప్పుడు ప్రారంభమవుతుందని, మలి దశలో భోగాపురం విమానాశ్రయం వరకూ వేస్తారన్నారు. అదేవిధంగా విజయనగరం వైపు కూడా కనెక్టివిటీ ఇవ్వాలని సీఎం చంద్రబాబునాయుడును కోరామని, రెండు నగరాలు దాదాపుగా కలిసి పోతున్నందున అది కూడా అవసరమన్నారు.

పైపులైన్ లీకేజీతో తాగునీరు వృథా



కేఆర్ఎం కాలనీ శివాలయం వద్ద పైపు లీక్ తో వృథాగా పోతున్న మంచినీరు

మద్దిలపాలెం, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 23వ వార్డు కేఆర్ఎం కాలనీ శివాలయం వీధిలో శుక్రవారం మున్సిపల్ వాటర్ పైప్‌లైన్ లీకైంది. దీంతో చాలా సమయం తాగునీరు వృథాగా పోయింది. స్థానికులు సంబంధిత

అధికారులకు సమాచారమివ్వగా, వాటర్ వర్క్ సిబ్బంది పైపులైన్ లీక్ అవుతున్న ప్రాంతానికి వచ్చారు. భూమిలో వేసిన పైప్‌లైన్ లీక్ అవడం గుర్తించి మరమ్మత్తులు చేశారు. అయితే ఉదయం నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు పైపులైన్ లీకవడంతో చాలా మొత్తం తాగునీరు వృథా అయింది.

భక్తిశ్రద్ధలతో శ్రావణలక్ష్మి పూజలు



వెంకోజీపాలెం, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ పరిధిలోని 16వ వార్డు సంజయ్ గాంధీ కాలనీ కనకదుర్గా అమ్మవారి ఆలయంలో శుక్రవారం శ్రావణలక్ష్మి పూజలు నిర్వహించారు. శ్రావణ మాసం మొదటి శుక్రవారాన్ని పురస్కరించుకుని మహిళలంతా తమ ఇళ్లల్లో పూజలు నిర్వహించుకొని, ఆలయానికి వచ్చి అమ్మవారికి పసుపు, కుంకుమలను సమర్పించారు. ఈ సందర్భంగా అమ్మవారిని వివిధ పుష్పాలతో అలంకరించారు. ఆలయ అర్చకుడు వెంకటరావుశర్మ భక్తుల గోత్రనామాలతో అభిషేకాలు, అర్చనలు జరిపారు. అనంతరం మహిళలతో సామూహిక కుంకుమార్చన జరిపారు. ఆలయ నిర్వాహకులు ఎస్.నారాయణరావు, మురళి, సూర్యనారాయణ, సుందరరావు పాల్గొన్నారు.

స.హ.చట్టం అవగాహనపై పోటీలు

మద్దిలపాలెం, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : సమాచారహక్కు చట్టంపై ప్రతి విద్యార్థికి అవగాహన కలిగిఉండాలని డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఐ.విజయబాబు పేర్కొన్నారు. సమాచార హక్కు చట్టం అమలు చేసి ఇరవై ఏళ్లు గడిచిన సందర్భంగా శుక్రవారం కళాశాలలో విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వం, క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రిన్సిపాల్ విజయబాబు మాట్లాడుతూ పోటీల్లో గెలిచిన విద్యార్థులు వచ్చే నెలలో నిర్వహించే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. అనంతరం సమాచార హక్కు చట్టం ప్రాధాన్యం గురించి వివరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ పి.జయ, ఎన్ఆర్సీ కో-ఆర్డినేటర్ రూపవాణి, స.హ.చట్టం కో-ఆర్డినేటర్ ఉమామహేశ్వరరావు, ఎన్.శారద పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **హరిహర వీరమల్లు** : జగదాంబ, శారద, రమాదేవి, మెలోడి, వెంకటేశ్వర, శ్రీవెంకటేశ్వర, లీలామహల్, సంగం, శ్రీరామా, కిన్నెర, కామేశ్వరి, శ్రీకన్య, గోకుల్, శ్రీకాంతి, ఊర్వశి (కంచరపాలెం), సౌజన్య సుకన్య (గోపాలపట్నం), మౌర్య, నరసింహ (గోపాలపట్నం), నటరాజ్ (పెందుర్తి), మోహిని, మినీ మోహిని (గాజువాక), శ్రీకన్య కన్య, శ్రీకన్య హెవెన్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ)
- **జూనియర్** : శరత్, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా),
- **తమ్ముడు** : లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 21, టమాటా 42, వంకాయలు (తెలుపు) 28, వంకాయలు (నలుపు) 32, బెండకాయలు 30, పచ్చిమిర్చి 76, కాకరకాయలు 28, బీరకాయలు 32, ఆనపకాయ 14, కాలీఫ్లవర్ 34, క్యాబేజి 24, క్యారెట్ 46, దొండకాయలు 26, బంగాళ దుంపలు 16, అరటికాయ (పె)10, మునక్కాడలు (కిలో) 42, అల్లం (పాతది) 62, బరబాటి 30, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 50, బద్దచిక్కుడు 50, దోస కాయలు 14, వెల్లుల్లి (పెద్దవి) 80, కొబ్బరికాయ (పెద్దది) 30, బీన్స్ (పెన్సిల్) 62, కీరదోస 30, కాప్సికమ్ 80, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 36, చిలగడదుంపలు 44, కంద 42, దేముడు చిక్కుడు 64, గోరుచిక్కుడు 42, కూర పెండలం 30, బ్రకోలి 45, పనస పొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 20, కర్రపెండలం 24, మామిడి అల్లం 56, బొప్పాయి 36, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)

విశాఖపట్నం	465
విజయనగరం	469
శ్రీకాకుళం	469

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	87
లైవ్ ధర	107
విత్ స్కిన్	184
స్కిన్‌లెస్	194

అందరికీ సంక్షేమం.. ప్రభుత్వ లక్ష్యం

» ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు



11వ వార్డులో పర్యటిస్తున్న ఎమ్మెల్యే రామకృష్ణబాబు

ఆరిలోవ, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : ఏడాది కూటమి ప్రభుత్వ పాలనలో ప్రజలకు అన్ని సంక్షేమ పథకాలు అందుతున్నాయా? లేదా ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా? అంటూ ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు 11వ వార్డు ప్రజలను ఆరా తీశారు. శుక్రవారం ఈ వార్డులో టీడీపీ ఇన్‌చార్జి రాగతి అచ్యుతరావు ఆధ్వర్యంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేతో పాటు కూటమి పార్టీల నేతలు ఇంటింటికీ వెళ్లి రాష్ట్రంలో చేపట్టిన అభివృద్ధి, అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. స్థానిక సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు మాట్లాడుతూ రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఆశాజనకంగా లేకున్నా ఎన్నికల హామీ మేరకు ఎన్నో సంక్షేమ పథకాలు, ఎంతగానో అభివృద్ధి పనులు చేట్టామన్నారు. సూపర్ సిక్స్ హామీలను అమలు చేసి తీరుతామని స్పష్టం చేశారు. ఇప్పటికీ తల్లికి వందనం డబ్బులు అందని వారు ఎవరైనా ఉంటే సచివాలయంలో కలిసి వారి వివరాలు అందించాలని సూచించారు. అభివృద్ధి, సంక్షేమానికి కూటమి ప్రభుత్వం సమ ప్రాధాన్యం ఇస్తుందన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఒమ్మి సన్యాసిరావు, 11వ వార్డు అధ్యక్షుడు ముగడ రాజారావు, కార్యదర్శి పేపరు నాయుడు. టీడీపీ జిల్లా నాయకులు కృష్ణంరాజు. మూది అప్పారావు, రేఖా జ్యోతి, రంగాల మంగరాజు, పచ్చి శ్రీనివాసరావ, క్యాటరింగ్ రాజు, ఆదినారాయణ రాజు, చందక లలిత, మంగ, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

సమస్య పరిష్కరించకుండా పలాయనం

» సచివాలయ సిబ్బంది తీరును తప్పుపట్టిన స్థానికులు



సచివాలయ ఉద్యోగులను నిలదీస్తున్న స్థానికులు

మద్దిలపాలెం, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 22వ వార్డు పిఠాపురంకాలనీలోని కాలువలు, కల్వర్టు నిర్మాణం జీవీఎంసీ అధికారులకు తలనొప్పిగా మారుతోంది. కల్వర్టు నిర్మాణం చేయాలని స్థానికులు పీజీఆర్ఎస్‌లో వినేతలు.., నిర్మాణం చేస్తే ఊరుకోనని వార్డు కార్పొరేటర్ పీతల మూర్తి బెదిరింపులు.. దీంతో ఏం చేయాలో పాలుపోక అధికారులు తలలు పట్టుకుంటున్నారు.

పిఠాపురం కాలనీ రజకవీధి రహదారిని డ్రైనేజీ, కల్వర్టు నిర్మాణం పేరుతో ఆరు వారాల కింద తవ్వేశారు. డ్రైనేజీ పక్కనే ఓ అరవై ఏళ్ల వృద్ధురాలు నిర్వహిస్తున్న దుకాణం తొలగించి కాలువ నిర్మాణం చేయాలని పీతల మూర్తి యాదవ్, టౌన్‌ప్లానింగ్ సిబ్బంది, కాంట్రాక్టర్‌కు ఆదేశించారు. కార్పొరేటర్ ఆదేశాలతో దుకాణం తొలగించాలని సిబ్బంది వృద్ధురాలిని ఒత్తిడి చేయగా తనక కోర్టు ఆర్డర్ ఉందని ఆమె తెలిపింది. అయితే దుకాణం తీస్తే కాని డ్రైనేజీ, కల్వర్టు పనులు చేయొద్దని పీతల మూర్తి పట్టుబట్టారు. దీంతో కాలువ, కల్వర్టు నిర్మాణ పనులు ఆగిపోయాయి. ఫలితంగా... 45 రోజులుగా స్థానికులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతూ పీజీఆర్ఎస్‌లో జీవీఎంసీ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు.

ఆ ఫిర్యాదుపై వాస్తవాలు తెలుసుకొని పరిష్కారం చేసేందుకు శుక్రవారం వచ్చిన సచివాలయ సిబ్బంది స్థానికులతో మాట్లాడారు. అయితే కాలువ నిర్మాణం కార్పొరేటర్ చేయొద్దన్నారు కనుక మీ ఫిర్యాదు పరిష్కరించినట్టుగా రాసుకుంటామని సిబ్బంది చెప్పడంతో స్థానికులు అవాక్కయ్యారు. కాలువ నిర్మాణం చేయనప్పుడు రోడ్డు ఎందుకు తవ్వారని ప్రశ్నించారు. ఫిర్యాదు పరిష్కరించినట్టు రాస్తే మళ్లీ ఫిర్యాదు చేస్తామని స్పష్టం చేశారు. దీంతో సచివాలయం సిబ్బంది తిరుగుముఖం పట్టారు.

అధ్వానంగా ఆర్టీసీ కాంప్లెక్స్ రహదారి

» తీవ్ర దుర్గంధంతో రాకపోకలకు ఇబ్బందులు



మద్దిలపాలెం ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద నిల్వ ఉన్న మురుగు

మద్దిలపాలెం, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : మద్దిలపాలెం ఆర్టీసీ కాంప్లెక్స్ జాతీయరహదారిపై కంపు కడుతోంది. ప్రయాణికులు వేచి ఉండే ప్రాంతంలో మురుగు నిల్వ ఉండడంతో దుర్గంధం వెదజల్లుతోంది. ప్రతి రోజూ ఈ రహదారిలో వేలాదిమంది రాకపోకలు సాగిస్తుంటారు. బస్సులు దిగి పాదచారులు వెళ్తుంటారు. ఇక్కడ నిల్వ ఉన్న మురుగు నీరు రోజుల తరబడి నిలిచిపోవడంతో తీవ్ర దుర్వాసన వ్యాపించి అటు వైపు రాకపోకలు సాగించే వారు ముక్కులు మూసుకోవాల్సిన పరిస్థితి నెలకొంటోంది.

అయితే ఏర్పాటు చేసిన డస్ట్‌బిన్ నిండిపోయి కొన్ని రోజులు గుస్తున్నా పారిశుధ్య సిబ్బంది చెత్తను తరలించడం లేదు. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో ఆ డస్ట్‌బిన్‌లో చెత్త కుళ్లిపోయి ఆ ప్రాంతమంతా దుర్గంధం వ్యాపిస్తోంది. ఈగలు, దోమలు ముసురుతూ పరిసరాలు అపరిశుభ్రంగా మారిపోయాయి. దీంతో ఆ పక్క నుంచి వెళ్లాలంటేనే ప్రయాణికులు హడలిపోతున్నారు. ఆర్టీసీ, జీవీఎంసీ అధికారులు మాత్రం ఏమీ పట్టనట్టు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఆర్టీసీ కాంప్లెక్స్‌లో నెలకొన్న చెత్త సమస్యను పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.

ఆసియా సైన్స్ క్యాంపునకు కృష్ణా కళాశాల విద్యార్థి ఎంపిక



వర్ధననాయుడుకి అభినందిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ విజయబాబు

మద్దిలపాలెం, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : థాయ్‌లాండ్‌లో నిర్వహించే ఆసియా సైన్స్ క్యాంప్-25కు డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థి ఎంపికయ్యాడు. జూలై 31 నుంచి ఆగస్టు 6 వరకు థాయ్‌లాండ్‌లో జరిగే ఈ క్యాంపునకు న్యూఢిల్లీలోని సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగం భారతదేశం నుంచి 20 మంది విద్యార్థులను నామినేట్ చేసింది. వీరిలో కృష్ణా కళాశాలలో బీఎస్సీ తృతీయ సంవత్సరం చదువుతున్న లెంకానంది వర్ధన నాయుడు ఉన్నాడు. ఈ సందర్భంగా వర్ధన నాయుడుకి కళాశాల ప్రిన్సిపాల్ విజయబాబు, అధ్యాపకులు అభినందించారు.

విశ్రాంత ప్రొఫెసర్ కృష్ణారావుకు వెటరన్ హైడ్రోజియాలజిస్టు అవార్డు

వెంకోజీపాలెం, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : ఏయూ విశ్రాంత ప్రొఫెసర్ జి.కృష్ణారావుకు వెటరన్ హైడ్రోజియాలజిస్టు అవార్డు లభించింది. జైపూర్, అమిటీ విశ్వవిద్యాలయంలో జరిగిన సెమినార్‌లో ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఆఫ్ హైడ్రోజియాలజిస్ట్సకి చెందిన ఇండియన్ నేషనల్ చాప్టర్ ద్వారా 'వెటరన్ హైడ్రోజియాలజిస్టు అవార్డు' ప్రదానం చేశారు. ఈ సెమినార్‌ను రాజస్థాన్ రాష్ట్ర భూగర్భ జల బోర్డు, అమిటీ విశ్వవిద్యాలయం (జైపూర్), ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఆఫ్ హైడ్రోజియాలజిస్ట్సకు చెందిన ఇండియన్ నేషనల్ చాప్టర్ సంయుక్తంగా నిర్వహించాయి. ఈ సందర్భంగా దేశంలోని ఐదుగురు అత్యంత సీనియర్ హైడ్రోజియాలజిస్ట్‌లను వారి సేవలు, పనితీరు ఆదారంగా గుర్తించి అవార్డులను ప్రదానం చేశారు. వీరిలో ఏయూ విశ్రాంత ప్రొఫెసర్ జి.కృష్ణారావు స్థానం సాధించారు. అలాగే ప్రచురించబడిన 99 పరిశోధన పత్రాలలో ప్రొఫెసర్ జి.కృష్ణారావు పరిశోధన పత్రానికి మొదటి స్థానం లభించడం విశేషం.

జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరానికి 8 వినతులు

వెంకోజీపాలెం, జూలై 25(ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ ప్రతి శుక్రవారం నిర్వహిస్తున్న టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్‌కు 8 వినతులు వచ్చినట్టు జీవీఎంసీ చీఫ్ సిటీ ప్లానరు ఎ.ప్రభాకరరావు తెలిపారు. శుక్రవారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో ఆయన చాంబర్‌లో సీపీలు, డీసీపీలు, ఏసీపీలుతో కలిసి ప్రత్యేకంగా టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ వినతులు/ ఫిర్యాదులను నిర్ణీత సమయంలో టౌన్ ప్లానింగ్ అధికారులు వెంటనే స్పందించి పరిష్కరించాలని సీసీపీ ఆదేశించారు.

మత్స్యకారులకు రాయితీపై వలలు, బోటు యంత్రాలు అందజేత



మత్స్యకారులకు వలలు, బోటు ఇంజిన్లు అందిస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు

ఎంవీపీ కాలనీ/ పెదవాల్తేరు, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : మత్స్యకారులకు రాయితీపై వలలు, బోటు ఇంజిన్లను ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు శుక్రవారం అందజేశారు. జీవీఎంసీ 18వ వార్డు పరిధిలోని అప్పుఘర్ వద్ద మత్స్యశాఖ ఆధ్వర్యంలో వాసవానిపాలెం, శివగణేష్ నగర్, జాలారి ఎండాడకు చెందిన మత్స్యకారులకు నిర్వహించిన కార్యక్రమంలో వీటిని ఎమ్మెల్యే చేతుల మీదుగా అందజేశారు. ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకంలో భాగంగా రాయితీపై వీటిని అందించారు. లబ్ధిదారులకు నలభై శాతం రాయితీపై సుమారు రూ.18 లక్షల ఆరు వలలు, 16 ఇంజిన్లను అందించారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటరు గొలగాని మంగవేణి, 19వ వార్డు కార్పొరేటరు నొల్లి నూకరత్నం, తెలుగుదేశం నాయకులు రామారావు, మసేను, గురునాథరావు, దాసు, పోలారావు, నూకరాజు, గురుమూర్తి, ఫిషరీస్ డిపార్టుమెంట్ అధికారులు పాల్గొన్నారు.

నివాస ప్రాంతాల్లో వ్యర్థ సామగ్రి నిల్వలేంటి?

» ఓ మహిళ నిర్వాకంతో ఏడు కొళాయిల జంక్షన్ వాసుల ఇబ్బందులు



ఓ గ్రూప్ హౌస్‌లో నిల్వ చేసిన ప్లాస్టిక్ వ్యర్థాలు

మద్దిలపాలెం, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ విశాఖ 22వ వార్డు ఆరు కొళాయిల జంక్షన్‌లోని ఓ నివాసంలో ప్లాస్టిక్ వ్యర్థాలు నిల్వ చేయడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ గ్రూప్ హౌస్‌లో అద్దెకు ఉంటున్న మహిళ ప్లాస్టిక్, చెత్త, వ్యర్థాలు, గాజు సీసాలు ఏరుకుని గోనె సంచుల్లో ఇంటి బయట నిల్వ చేస్తున్నారు. చెత్త కుప్పల నుంచి ఏరుకుని వచ్చిన వ్యర్థాలను నివాసాల మధ్య డంపింగ్ చేయడంతో దుర్వాసన వెదజల్లుతోంది. దోమలు విజృంభిస్తున్నాయి. దీంతో వ్యర్థాలు తొలగించాలని సదరు మహిళకు స్థానికులు కోరినా ఫలితం లేకుండా పోతోంది. దీనిపై జీవీఎంసీ పారిశుధ్య విభాగం అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

హిడెన్ స్ప్రౌట్స్ మానసిక దివ్యాంగుల ప్రత్యేక పాఠశాలలో అన్నదానం



దివ్యాంగులకు భోజనం వడ్డిస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి

పెదవాల్తేరు, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ 19వ వారు అధ్యక్షుడు చిరంజీవి ప్రథమ వర్ధంతి సందర్భంగా వారి కుటుంబసభ్యులు హిడెన్ స్ప్రౌట్స్ మానసిక దివ్యాంగుల ప్రత్యేక పాఠశాలలో 150 మంది పిల్లలకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శాసన సభ్యులు వెలగపూడి రామకృష్ణబాబు పాల్గొని చిరంజీవికి నివాళులు అర్పించారు. అనంతరం పిల్లలకు భోజనం వడ్డించారు. కార్యక్రమంలో ఎం.బాపిరాజు, తెడ్డు రాజు, వైఎంసీఏ శ్రీనివాస్, మానసిక దివ్యాంగుల పాఠశాల నిర్వాహకుడు కండిపిల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ధర్మస్థలి ఘటనల ఆరోపణలపై తక్షణమే ఉన్నతస్థాయి దర్యాప్తు

» ఎన్ఎఫ్ఐడబ్ల్యూ, పీవోడబ్ల్యూ సంఘాల డిమాండ్



నిరసన వ్యక్తంచేస్తున్న ఎన్ఎఫ్ఐడబ్ల్యూ, పీవోడబ్ల్యూ ప్రతినిధులు, మహిళలు

సిరిపురం, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : ధర్మస్థలి నేరాలపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జి పర్యవేక్షణలో తక్షణమే ఉన్నతస్థాయి దర్యాప్తు చేపట్టి, దోషులందరినీ కఠినంగా శిక్షించాలని ఎన్ఎఫ్ఐడబ్ల్యూ, పీవోడబ్ల్యూ ప్రతినిధులు డిమాండ్ చేశారు. శుక్రవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ఎన్ఎఫ్ఐడబ్ల్యూ, పీవోడబ్ల్యూ సంయుక్త ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా పీవోడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షురాలు ఎం.లక్ష్మీ, ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ.విమల మాట్లాడుతూ కర్ణాటక ధర్మస్థలి ఆలయంలో 1995 నుంచి 2014 వరకు పని చేసిన విశ్రాంత పారిశుధ్య కార్మికుడు.. అనేక మంది అత్యాచార ఆనవాళ్లు ఉన్న బాలికల శవాల్ని తాను నేత్రావతి నదీ పరివాహక ప్రాంతంలో పూడ్చిపెట్టానని చెప్పారని పేర్కొన్నారు. ఆలయ ట్రస్టీ రాజకీయ, అధికార, డబ్బు పలుకుబడి కలవారని, ఎన్ని ప్రభుత్వాలు మారినా అందరినీ మేనేజ్ చేయగలుగుతున్నారని వెల్లడించారని ఆయన చెప్పారన్నారు. ఈ విషయమై సదరు విశ్రాంత కార్మికుడు.. విశ్రాంత సుప్రీంకోర్టు జడి గోపాల్‌గౌడ్, పత్రికా ప్రతినిధుల సమక్షంలో చెప్పాడని వివరించారు. ఈ నేపథ్యంలో ధర్మస్థలిలో జరిగినట్టు చెబుతున్న నేరాల ఉదంతాలపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జి పర్యవేక్షణలో ఉన్నతస్థాయి దర్యాప్తు చేపట్టాలని డిమాండ్ చేశారు. దోషులకు శిక్ష పడే వరకు తాము పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎన్ఎఫ్ఐడబ్ల్యూ, పీవోడబ్ల్యూ ప్రతినిధులు, మహిళలు పాల్గొన్నారు.

విశాఖ డెయిరీలో తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి

» సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సింగరావు



మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నర్సింగరావు

సిరిపురం, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : విశాఖ డెయిరీలో తొలగించిన కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నర్సింగరావు డిమాండ్ చేశారు. విశాఖ డెయిరీలో ఆకారణంగా తొలగించిన కాంట్రాక్టు కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ శుక్రవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద విశాఖ డెయిరీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సింగరావు మాట్లాడుతూ 305 మందిని అన్యాయంగా, ఎలాంటి ముందస్తు నోటీసులు లేకుండా జూన్ 10న యాజమాన్యం తొలగించిందని, ఇది అన్యాయమన్నారు. దీనిపై కార్మిక శాఖ జాయింట్ కమిషనర్ స్పందిస్తూ అందరినీ విధుల్లోకి తీసుకోవానలి కాంట్రాక్టర్‌ను ఆదేశించారన్నారు. తక్షణమే తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్కేఎస్వీ కుమార్, యూనియన్ గౌరవాధ్యక్షుడు ఎం.రాంబాబు, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు జి.నాయుడుబాబు, పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు రెడ్డి వెంకట్రావు, యూనియన్ నాయకులు ఏ.నూకేశ్వరరావు, ఎ.రమణ, అనసూయ, పద్మజ, మధుబాబు, నాగేశ్వరరావు, కార్మికులు పాల్గొన్నారు.

విద్యుత్ స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించండి

» ఏఐటీయూసీ పిలుపు



కరపత్రాలను పంపిణీ చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

వెంకోజీపాలెం, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్తు స్మార్ట్ మీటర్లను ప్రజలు వ్యతిరేకించాలని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో 15వ వార్డు డాక్టర్స్ కాలనీ అపార్ట్మెంట్ ఏరియాలో శుక్రవారం కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి పడాల గోవింద్ మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యుత్ భారాలు ప్రజలపై వేయాలని ఆలోచలన చేస్తోందని, దీనివల్ల ఈ స్మార్ట్ మీటర్ల ఖరీదును వినియోగదారులు భరించాల్సి ఉంటుందన్నారు. సింగిల్ ఫేజ్ మీటర్ ఖరీదు రూ.8927, త్రీఫేస్ మీటరు ఖరీదు రూ.17,286 లు ఈ మొత్తాన్ని 93 నెలలు బిల్లుతో పాటు అదనంగా చెల్లించవలసి వస్తుందన్నారు. ప్రజలు విద్యుత్ ఎక్కువగా వాడే సమయంలో చార్జీలు ఎక్కువ వసూలు చేస్తారని, వేసవికాలంలో ఈ భారం ప్రజలపై మరింత ఎక్కువగా ఉంటుందన్నారు. దీని ప్రభావం బిల్లులపై పడుతుందన్నారు. ప్రస్తుతం వచ్చే బిల్లు రూ.500 అయితే ఈ స్మార్ట్ మీటర్ల వలన రూ.3000 వరకు పెరగవచ్చని ఆందోళన వ్యక్తం చేశారు. స్మార్ట్ మీటర్లన్నీ ప్రీపెయిడ్ మీటర్ అని ప్రజలు గుర్తించవలసిన అవసరం ఉందన్నారు. ఈ స్మార్ట్ మీటర్లను ప్రభుత్వం బిగించడం వలన సెల్‌ఫోన్ మాదిరిగానే రీచార్జ్ చేసుకోవాలన్నారు. ప్రస్తుత మీటర్లను తీసేసి ఈ స్మార్ట్ మీటర్లను బిగిస్తే రీచార్జ్ పూర్తవ్వగానే ఇంటి కరెంటు ఆగిపోతుందని, వాడుకున్న బిల్లు కనుమరుగై ముందుగానే డబ్బులు చెల్లించవలసి వస్తుందని వివరించారు. వీటివల్ల ఖరీదుతో పాటు దాని రిపేరుకు అయ్యే ఖర్చులు కూడా ప్రజలే భరించాలని, ఈ నేపథ్యంలో స్మార్ట్ మీటర్లు అమర్చడాన్ని ప్రజలు ఏకకంఠంతో వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు అవనాపు శ్రీను, బి.హరి, సూరిబాబు, నాయుడు, సోములు తదితరులు పాల్గొన్నారు.

షెడ్డు తొలగింపునకు చర్యలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



తొలగించిన షెడ్డు

ఆరిలోవ, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 10 వార్డులో గల ఆదర్శనగర్ పెట్రోలు బంకు సర్వీసు రోడ్డు నుంచి ఇందిరా గాంధీ నగర్ వైపు వెళ్లే సర్వీసు రోడ్డులో స్థలాన్ని ఆక్రమించి వేసిన షెడ్డును శుక్రవారం జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ సిబ్బంది తొలగించారు. ఈ విషయమై 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి స్పందించిన అధికారులు ఈ చర్యలు తీసుకున్నారు. ప్రభుత్వ స్థలాన్ని ఎవరు ఆక్రమించినా, నిర్మాణాలు చేపట్టినా చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు.

రెవెన్యూ బదిలీల్లో మార్పులు

విశాఖపట్నం, జూలై 25 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ శాఖ బదిలీల్లో మార్పులు చోటుచేసుకున్నాయి. ముగ్గురు ఉద్యోగులకు గతంలో ఇచ్చినచోట కాకుండా మరోచోట పోస్టింగ్ ఇచ్చారు. అలాగే మరో ఆరుగురికి డిప్యూటేషన్‌పై ఇతర శాఖల్లో పోస్టింగ్ ఇస్తూ కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ శుక్రవారం ప్రొసీడింగ్స్ ఇచ్చారు. ఇటీవల చేపట్టిన బదిలీల్లో అనకాపల్లి జిల్లాకు బదిలీ చేసిన ముగ్గురికి విశాఖ జిల్లాలోనే పోస్టింగ్ ఇచ్చారు. విశాఖ జిల్లాలో పలుచోట్ల పనిచేస్తున్న ఆరుగురు ఉద్యోగులను యూఎల్‌సీ, పౌర సరఫరాలు, భూసేకరణ విభాగాలకు డిప్యూటేషన్‌పై పంపుతూ ఆదేశించారు.

క్రికెట్ ఫైనల్స్‌లో సిటీ పోలీసు జట్టు

విశాఖపట్నం స్పోర్ట్స్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): విశాఖ జిల్లా క్రికెట్ అసోసియేషన్ (వీడీసీఏ) నిర్వహిస్తున్న ఇనిస్టిట్యూషనల్ వార్షిక క్రికెట్ లీగ్ టోర్నీలో సిటీ పోలీసు ఫైనల్స్‌కు చేరింది. ఏసీఏ వీడీసీఏ-బీ గ్రౌండ్‌లో శుక్రవారం ఎన్‌టీపీసీతో జరిగిన చివరి లీగ్ మ్యాచ్‌లో సిటీ పోలీసు 16 పరుగుల తేడాతో విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన సిటీ పోలీసు 19.4 ఓవర్లలో 153 పరుగులకు ఆలౌటైంది. కె.శివకేశవ 36 పరుగులు, విశ్రినాథ్ 34 పరుగులతో రాణించారు. ఎన్‌టీపీసీ బౌలర్లు ప్రిన్స్, ఉమేష్ చెరో మూడు వికెట్లు పడగొట్టారు. 154 పరుగుల విజయలక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన ఎన్‌టీపీసీ నిర్ణీత 20 ఓవర్లలో ఎనిమిది వికెట్లకు 137 పరుగులు మాత్రమే చేయగలిగింది. అవినాష్ (33) మినహా మిగిలినవారు విఫలమయ్యారు. సిటీ పోలీసు బౌలర్లలో టి.రాజు మూడు, అనీష్ రెండు వికెట్లు తీశారు.

ఓఆర్ఎస్ ద్రావణం ఆరోగ్యకరం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ రవికిరణ్

అక్కయ్యపాలెం, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ఓఆర్ఎస్ శరీరానికి అత్యవసరమైన ఖనిజ లవణాలతో కూడిన ద్రావణమని, దాన్ని ప్రతి ఒక్కరూ తాగాలని డాక్టర్ రవికిరణ్ విద్యార్థులకు సూచించారు. గ్రేటర్ 26వ వార్డు ఎన్‌జీజీఓస్ కాలనీలోని జీవీఎంసీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు శుక్రవారం ఓఆర్ఎస్ ఉపయోగంపై అవగాహన కల్పించారు. చిన్నారులు నీళ్ల విరోచనాలతో బాధపడినా, మూత్రం సరిగ్గా రాకపోయినా, పెదాలు, నాలుక ఎండిపోయినట్లు అనిపించినా, కళ్లు పొడిబారినా, నీరసంగా కనిపించినా వెంటనే ఓఆర్ఎస్ ద్రావణాన్ని తాగించాలన్నారు. ప్రభుత్వం, ప్రైవేట్ సంస్థలు తయారు చేసిన ఓఆర్ఎస్ ప్యాకెట్లపై ఉన్న సూచనల ప్రకారం వేడి చేసి చల్లార్చిన నీళ్లలో కలిపి ద్రావణం తయారు చేసి తాగించాలని పేర్కొన్నారు. ప్రధానోపాధ్యాయిని జయంతి రాధాకుమారి పాల్గొన్నారు.

ప్రాథమిక పాఠశాలకు ఐడీబీఐ బ్యాంక్ వితరణ



కార్యక్రమంలో పాల్గొన్న దాతలు

అక్కయ్యపాలెం, జూలై 25 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 42వ వార్డు రైల్వే న్యూ కాలనీలోని జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలకు రూ.2 లక్షల విలువైన సామగ్రిని ఐడీబీఐ బ్యాంక్ సీతమ్మధార బ్రాంచ్ ప్రతినిధులు శుక్రవారం అందజేశారు. ఫ్యాన్లు, లైట్లు, కుర్చీలు, టేబుళ్లు, కంప్యూటర్, స్పీకర్లు, మైక్ సెట్ అందించినట్లు బ్యాంక్ రీజనల్ హెడ్ కన్వదీప్ దాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ హెడ్ అజయ్, మండల విద్యాశాఖాధికారులు రామారావు, బాలామణి, హెచ్‌ఎం పి.శంకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



వన్‌టౌన్‌లో ముత్యాల చీర అలంకరణతో వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారు



కన్యకాపరమేశ్వరి ఆలయంలో సామూహిక కుంకుమార్చన, లలిత సహస్రనామ పారాయణంలో పాల్గొన్న మహిళలు



కనకాంబరాలు, జాజు పూలతో ఉమాదేవి అమ్మవారికి అలంకరణ

భక్తిశ్రద్ధలతో శ్రావణ పూజలు

మహారాణిపేట, జూలై 25 (ఆంధ్రజ్యోతి): శ్రావణమాస ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. శుక్రవారంతోనే శ్రావణమాసం ప్రారంభం కావడంతో ఆలయాల్లో అమ్మవార్లను విశేషంగా అలంకరించారు. వన్‌టౌన్‌లోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో వాసవీమాత ముత్యాల చీర అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. తెల్లవారు జామున అమ్మవారి మూలవిరాట్‌కు శుద్ధజలం, పాలు పెరుగు, తేనె, గంధం, పసుపు, కుంకుమ, వివిధ రకాల పండ్ల రసాలు, 108 సుగంధ ద్రవ్యాలతో ప్రత్యేకంగా అభిషేకం నిర్వహించారు. అనంతరం 108 స్వర్ణ పుష్పాలతో నివేదన చేసి, ముత్యాలచీరతో అమ్మవారిని అలంకరించారు. దేవాలయ ప్రాంగణంలో సుమారు 300 మంది మహిళలు సామూహిక లలిత సహస్రనామ పారాయణం, కుంకుమ పూజలు నిర్వహించారు. దేవాలయం నిర్వాహక అధ్యక్షుడు ఆరిశెట్టి దినకర్ పర్యవేక్షణలో భక్తుల పూజలకు ఏర్పాట్లు చేసి, తీర్థప్రసాదాలు అందజేశారు. పెద్ద సంఖ్యలో మహిళలు అమ్మవారిని దర్శించుకున్నారు.

ప్రత్యేక అలంకరణలో ఉమాదేవి అమ్మవారు

డాబాగార్డెన్స్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): డాబాగార్డెన్స్‌లోని శివరామకృష్ణ దేవాలయ ప్రాంగణంలో వేంచేసి ఉన్న ఉమాదేవి అమ్మవారికి శ్రావణమాసం మొదటి శుక్రవారం సందర్భంగా కనకాంబరాలు, జాజు పూల మాలలతో శోభాయమానంగా అలంకరించారు. పూలతో అమ్మవారికి చీరకట్టు అలంకారం ప్రత్యేకతను సంతరించుకుంది. ఆలయ అర్చకులు జి.భార్గవశర్మ సంప్రదాయరీతిలో కుంకుమార్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. సన్నిధిలో మహిళలు సామూహికంగా లలితా సహస్రనామ పారాయణం చేశారు. ఈ కార్యక్రమంలో ఈవో జీవీ రమాభాయి, సిబ్బంది మన్మథరెడ్డి, గోపి, ఆధ్యాత్మికవేత్త ఎం.వి.రాజశేఖర్ పాల్గొన్నారు. అందరికీ తీర్థప్రసాదాలు అందజేశారు.

విశాఖ-నౌపడ సెక్షన్‌లో డీఆర్ఎం ఆకస్మిక తనిఖీలు



నౌపడ స్టేషన్‌లో సిబ్బందికి సూచనలు ఇస్తున్న డీఆర్ఎం లలిత్ బొహ్రా

విశాఖపట్నం, జూలై 25 (ఆంధ్రజ్యోతి): వాల్తేరు డివిజన్ పరిధిలోని విశాఖ-నౌపడ సెక్షన్‌లో డీఆర్ఎం లలిత్ బొహ్రా శుక్రవారం పర్యటించారు. ట్రాక్ పరిస్థితులు, వంతెనలు, పాయింట్లు, క్రాసింగ్‌లు, సిగ్నలింగ్, ఫుట్‌ప్లేట్స్ నిర్వహణలో చేపడుతున్న భద్రతా చర్యలను క్షుణ్ణంగా పరిశీలించారు. సురక్షిత రైల్వే కార్యకలాపాల నిర్వహణలో సిబ్బంది పాటిస్తున్న సమయపాలనపై తనిఖీలు నిర్వహించారు. నౌపడ స్టేషన్‌లో రిజిస్టర్, ఆపరేషన్ మాడ్యూల్స్‌తోపాటు భద్రతకు సంబంధించి డాక్యుమెంట్లను పరిశీలించి వాటిపై సమీక్షించారు. ట్రాలీమెన్ పాటించాల్సిన విధి విధానాలు, నిబంధనల ప్రాముఖ్యతపై సిబ్బందికి వివరిస్తూ రైల్వే బోర్డు మార్గదర్శకాల మేరకు ట్రాలీ కార్యకలాపాలు ప్రారంభించే ముందు బ్రేక్‌లు, టైం టేబుల్ పరికరాలను ఎప్పటికప్పుడు తనిఖీ చేసి భద్రతా నిబంధనలు పాటించాలని ఆపరేటర్లకు సూచించారు.

ఐటీఐల్లో ముగిసిన కౌన్సెలింగ్



అభ్యర్థుల ధ్రువపత్రాలు పరిశీలిస్తున్న అధికారులు

కంచరపాలెం, జూలై 25 (ఆంధ్రజ్యోతి): కంచరపాలెం ప్రభుత్వ పాత ఐటీఐలో మూడు రోజులు చేపట్టిన రెండో విడత కౌన్సెలింగ్ శుక్రవారం ముగిసింది. రెండో విడత ప్రవేశాల్లో భాగంగా జరిగిన కౌన్సెలింగ్‌లో సుమారు 350 మంది అభ్యర్థులకు వివిధ ట్రేడుల్లో సీట్లు కల్పించినట్టు ప్రిన్సిపాల్ జె.శ్రీకాంత్ పేర్కొన్నారు. ఎలక్ట్రికల్, ఫిట్టర్, డీజిల్ మెకానిక్, ఎంఎంటీఎం, కార్పెంటర్, ప్లంబర్, డ్రాఫ్ట్‌మెన్ సివిల్,మెకానికల్ తదితర ట్రేడుల్లో సీట్లు భర్తీచేశామన్నారు. ఈ నెల 26, 27 తేదీల్లో ప్రైవేటు ఐటీఐల్లో ప్రవేశాలకు రెండో విడత కౌన్సెలింగ్ జరుగుతుందన్నారు. సీటు కేటాయింపు ధ్రువపత్రాలు పొందిన అభ్యర్థులు ఆయా ట్రేడుల్లో తక్షణమే రిపోర్టు చేయకపోతే సీటు రద్దయ్యే ప్రమాదం ఉంటుంది. కౌన్సెలింగ్‌లో వైస్ ప్రిన్సిపాల్ డి.వెంకటేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసుల సహకారంతోనే పండుగలు విజయవంతం

ఏసీపీకి మాధవ యువజన సంఘం కృతజ్ఞతలు



వెస్ట్ ఏసీపీ పృథ్వీతేజకు జ్ఞాపిక అందిస్తున్న కమిటీ సభ్యులు

మాధవధార, జూలై 25 (ఆంధ్రజ్యోతి): మాధవధారలో పండుగ సంబరాలు విజయవంతం కావడానికి సహకరించిన విశాఖ వెస్ట్ జోన్ పోలీసు అసిస్టెంట్ కమిషనర్ పృథ్వీతేజను శుక్రవారం మాధవ యువజన సమాజం సభ్యులు అభినందించారు. మూడు మందిరాల పండుగల రోజుల్లో భక్తుల దర్శనాల నుంచి ట్రాఫిక్ విభాగం, నేరాలు జరగకుండా చూసిన పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు. మాధవధార గ్రామదేవత కుంచుమాంబ అమ్మవారు, సీతన్నగార్డెన్స్‌లోని కనకమహాలక్ష్మి ఆలయం, బిర్లా జంక్షన్ ఆరంభంలో గల కొత్త మహాలక్ష్మి అమ్మవారి పండుగల్ని పోలీసుల సంపూర్ణ సహకారంతో విజయవంతం చేయగలిగామని కమిటీ సభ్యులు పేర్కొన్నారు. తన కార్యాలయంలో ఏసీపీ పృథ్వీరాజ్‌ను కలిసి శాలువాతో సత్కరించి గ్రామ సంఘం తరఫున జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో మాధవ యువజన సమాజం సభ్యులు, 50వ వార్డు టీడీపీ అధ్యక్షుడు ఎస్.వరప్రసాద్, ఇతర గ్రామ పెద్దలు హాజరయ్యారు.

'బుద్ధునితో నా ప్రయాణం' నాటక ప్రదర్శన రేపు



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న బుద్దిస్ట్ సంఘం ప్రతినిధులు

సీతమ్మధార, జూలై 25 (ఆంధ్రజ్యోతి): బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా (బీఎస్ఐ) ఆధ్వర్యంలో 'బుద్ధునితో నా ప్రయాణం' తెలుగు నాటకాన్ని నగరంలోని బుల్లయ్య కళాశాల సమీపంలోని అంబేడ్కర్ భవన్‌లో ఈ నెల 27న సాయంత్రం ప్రదర్శించనున్నట్లు బీఎస్ఐ జిల్లా అధ్యక్షుడు బత్తుల గౌతంబాబు తెలిపారు. లతా రాజా ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.50 లక్షల ఖర్చుతో రూపొందించిన ఈ నాటకాన్ని విశాఖలో ఉచితంగా ప్రదర్శిస్తున్నామని పేర్కొన్నారు. శుక్రవారం జరిగిన మీడియా సమావేశంలో పోస్టర్‌ను ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ హైదరాబాద్‌కు చెందిన అభ్యుదయ ఆర్ట్స్ అకాడమీ 40 మంది కళాకారులతో ఈ నాటకాన్ని ప్రదర్శిస్తుందన్నారు. బుద్ధుని జీవిత చరిత్రతో పాటు బుద్ధియిజం భారతదేశానికి ఎందుకు అవసరమనే అంబేడ్కర్ ఆలోచనలను ఈ నాటకంలో చక్కగా ప్రదర్శిస్తున్నారని తెలిపారు. సామాజిక న్యాయం లక్ష్య సాధనలో భాగంగా ఈ కార్యక్రమం జరుగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు బొడ్డు కల్యాణరావు, ప్రధాన కార్యదర్శి జేవీ ప్రభాకర్, కె.సత్యనారాయణ, బి.ఉమామహేశ్వరి, కె.వేంకటేశ్వరరావు, పి.తిరుమల కుమార్, వేణుగోపాల్ పాల్గొన్నారు.

సత్యసాయినగర్‌లో కార్డన్ సెర్చ్

సీతమ్మధార, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ 45వ వార్డు సత్యసాయినగర్‌లో నాలుగో పట్టణ పోలీసులు శుక్రవారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఆ ప్రాంతంలోని ఇళ్లు, వాహనాలను తనిఖీ చేశారు. ద్విచక్ర వాహనాలను తనిఖీ చేసి ఎటువంటి పత్రాలు లేని 12 బైకులు, స్కూటీని సీజ్ చేశారు. కార్డన్ సెర్చ్‌లో 35 మంది పోలీసులు పాల్గొన్నారు.

హైవే సర్వీసు రోడ్డులో ప్రయాణ ఇబ్బందులు

మాధవధార, జూలై 25 (ఆంధ్రజ్యోతి): నగరంలోని హైవే సర్వీసు రోడ్లలో భారీ వాహనాల పార్కింగ్‌తో వాహనదారులు నిత్యం అవస్థల పాలవుతున్నారు. రోడ్డు సగానికి ఆక్రమిస్తూ వారి వ్యక్తిగత వ్యాపార కార్యకలాపాలు సాగిస్తుండటంతో ఆటోలు, ద్విచక్రవాహనాలు, కార్లు సైతం ఎదురెదురుగా వచ్చినపుడు వాహనాలు దారిపొడవునా నిలిచిపోతున్నాయి. ఉదయం స్కూళ్లు, కాలేజీలు, ఉద్యోగ విధుల్లోకి చేరేవారు ఆదరాబాదరాగా పోయే సమయంలో ఆర్టీఏ కార్యాలయం రోడ్డు, ఆర్అండ్‌బి సర్వీసు రోడ్డు, బిర్లా జంక్షన్ ప్రాంతాల్లో భారీ వాహనాలు ట్రాఫిక్ జామ్ సృష్టిస్తున్నాయి. ఈ ప్రాంతంలో ప్రధానంగా ఎక్కువగా ఉండే కార్ల షోరూమ్స్‌కి వాహనాల్ని తీసుకొచ్చే ఇతర రాష్ట్రాల భారీ ట్రక్కులు, పేరొందిన కంపెనీల షోరూమ్‌ల ఎదుటే హైవే సర్వీసు రోడ్ లో నిలిపేసి అన్‌లోడింగ్ కార్యకలాపాలు సాగిస్తున్నారు. మరో వైపు ఆర్టీఏ కార్యాలయ పనులపై వచ్చే వాహనాలు, ఆర్అండ్‌బి ఆఫీసు ప్రక్కనే ఉన్న ఎయిర్‌పోర్ట్ జోన్ పోలీసు స్టేషన్ వద్ద కేసుల నిమిత్తం నిలిచిపోతున్న వాహనాలు కలగలసి దారికి అడ్డంగా మారుతున్నాయి. వాహనాలు, పాదచారులు తిరిగే హైవే సర్వీసు రోడ్లను కుదించేస్తున్నాయి. ఈ సమస్యను ట్రాఫిక్ పోలీసులు చక్కదిద్దాలని ఈ ప్రాంతాల ప్రయాణికులు, నివాసితులు కోరుతున్నారు.

సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యే, కమిషనర్లకు వినతి



ఎమ్మెల్యే వంశీకృష్ణ, జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్‌లకు వినతిపత్రాలు అందజేస్తున్న జనసేన నాయకులు

మహారాణిపేట, జూలై 25 (ఆంధ్రజ్యోతి): మహారాణిపేటలోని 29వ వార్డులో అభివృద్ధి పనులు చేపట్టాలని జనసేన నాయకులు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం దక్షిణ నియోజకవర్గ శాసనసభ్యుడు వంశీకృష్ణ శ్రీనివాస్‌కు, జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్‌లకు వినతిపత్రాలు అందజేశారు. దండుబజారు, ఆంథోనీనగర్, అంగటిదిబ్బ, రామజోగిపేట తదితర ప్రాంతాలు అభివృద్ధి చేసి స్థానికుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. జనసేన ఇన్‌చార్జి డి.శివప్రసాద్‌రెడ్డి, వార్డు అధ్యక్షుడు అంగటి శ్రావణకుమార్, మాజీ కార్పొరేటర్ బుద్దల అనురాధ ఎమ్మెల్యేను కలిసినవారిలో ఉన్నారు.

ముస్లిం సమాజానికి పూర్తి మద్దతు

డాబాగార్డెన్స్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ముస్లిం సమాజ అభ్యున్నతికి తన పూర్తి మద్దతు ఉంటుందని దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే సీహెచ్ వంశీకృష్ణ శ్రీనివాస్ భరోసా ఇచ్చారు. 31వ వార్డులోని పోలీస్ బ్యారెక్స్‌లో మసీదు నిర్మాణానికి శుక్రవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మసీదు అధ్యక్షుడు మహ్మద్ సలీమ్, ఇమామ్ ముఫ్తీ ఉర్ రెహ్మాన్, మహ్మద్ సాదిక్, జనసేన నాయకులు శివప్రసాద్‌రెడ్డి, 31వ వార్డు నాయకులు రూప, ఎం.శ్రీనివాస్, వెంకటేష్, రాజేష్, సత్తిబాబు, గుణ, విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

పార్కు నిర్వహణ మూన్నాళ్ల ముచ్చటేనా?

▸ చాకలిపేటలో కళావిహీనంగా పార్కు



పార్కులోపల దుస్తులు ఆరబెట్టుకున్న దృశ్యం



26వ వార్డులోని పార్కు ప్రధాన ద్వారం

అక్కయ్యపాలెం, జూలై 25 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 26వ వార్డు చాకలిపేట, శంకువానిపాలెంలోని పార్కు నిరుపయోగంగా ఉంది. దీనిలో బెంచ్‌లు విరిగిపోయాయి. ఈ పార్కును గత ఏడాది మార్చి 14న రూ.16.3 లక్షలతో నిర్మించి అప్పటి మేయర్ గొలగాని హరి వెంకటకుమారి ప్రారంభించారు. ప్రారంభంలో స్థానికులు ప్రభాత నడకకు వినియోగించేవారు. కానీ ప్రస్తుతం పార్కులో కూర్చొని సేద తీర్చుకునేందుకు బెంచీలు విరిగిపోయి ఉన్నాయి. పార్కును ప్రారంభించడమే తప్ప నిర్వహణ గురించి పట్టించుకోలేదని స్థానికులు వాపోయారు. ఈ పార్కు ఉపయోగం లేకుండాపోయిందని, బెంచీలు విరిగిపోయినా ఎవరూ పట్టించుకోవడం లేదని స్థానికులు మండిపడుతున్నారు. ఈ పార్కులో కొందరు ఉతికిన దుస్తులు ఆరేస్తున్నారు. ఆకతాయిలు వచ్చి మద్యం తాగుతున్నారని స్థానికులు చెబుతున్నారు. ఈ పార్కును పరిరక్షించి నిర్వహణ చేపట్టాల్సిన జీవీఎంసీ అధికారులు పట్టించుకోవడం లేదని అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పార్కు ప్రారంభ సమయంలో విద్యుత్ దీపాలు, బెంచ్‌లు ఆకర్షణీయంగా కనిపించేవి. వాటిని పర్యవేక్షించాల్సిన అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని స్థానికులు పేర్కొంటున్నారు. బెంచ్‌లు విరిగి రోజులు గడిచినా జీవీఎంసీ అధికారులు పట్టించుకోకపోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా పార్కు వినియోగానికి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

2,631 మంది వితంతువులకు పింఛన్లు మంజూరు

▸ జిల్లాలో పెన్షన్‌దారులు 1,60,778 మంది...

విశాఖపట్నం, జూలై 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అందించే సామాజిక పింఛన్ తీసుకుంటూ మరణించిన వారి భార్యకు కొత్తగా వితంతు పింఛన్ మంజూరుచేశారు. జిల్లాలో 2,631 మందికి పెన్షన్ మంజూరైనట్టు అధికారులు తెలిపారు. 2023 నుంచి భర్త మరణించిన వారికి పింఛన్ల పంపిణీ నిలిపివేశారు. రెండేళ్ల నుంచి పింఛన్లు రాకపోవడంతో వారంతా ప్రభుత్వానికి పలు దఫాలుగా అర్జీలు పెట్టారు. ప్రభుత్వం స్పందించి రెండు నెలల క్రితం సర్వే చేసి జాబితాలు సిద్ధం చేసింది. ఈ నేపథ్యంలో వచ్చే నెల ఒకటో తేదీన వితంతు పింఛన్లు పంపిణీ చేయనున్నారు. దీనికి సంబంధించి సచివాలయాల వారీగా జాబితాలు అందాయి. కాగా ఆగస్టు నెలకు సంబంధించి జిల్లాలో 1,60,778 మందికి పింఛన్లు మంజూరుచేశారు. ఈ నెలాఖరున సచివాలయం వారీగా సొమ్ములు డ్రా చేసి ఆయా వర్గాలకు అందజేస్తారు.

అప్పన్నను దర్శించుకున్న వీఎంఆర్‌డీఏ చైర్మన్



ప్రణవ్‌గోపాల్‌ను సత్కరిస్తున్న తిరుమలేశ్వరరావు

సింహాచలం, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామిని వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్ శుక్రవారం దర్శించుకున్నారు. ఆయనకు ఏఈఓ తిరుమలేశ్వరరావు స్వాగతం పలికారు. కప్ప స్తంభాన్ని ఆలింగనం చేసుకున్న ప్రణవ్ గోత్రనామాలతో అంతరాలయంలో అర్చకులు పూజలు చేశారు. గోదాదేవి దర్శనం తరువాత పండితులు ఆశీర్వచనాలీయగా ఏఈఓ శాలువతో సత్కరించి, స్వామివారి ప్రసాదాలు, ఫొటోను అందజేశారు.

500 కోట్లతో ఆలయాల పునర్నిర్మాణం

... 5వ పేజీ తరువాయి

పదోన్నతులు కల్పిస్తామని, తద్వారా పూర్తిస్థాయి అధికారుల నియామకం జరుగుతుందన్నారు. దేవాలయాల భద్రతలో మార్పులు తీసుకువస్తున్నామని, త్వరలో ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. ప్రధాన ఉత్సవాల వేళ ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకుని, ప్రమాదాలు సంభవించకుండా తగిన వ్యవస్థను రూపొందిస్తున్నట్టు చెప్పారు. ఆయా ఆలయాల స్థితిగతులను అధ్యయనం చేసి భక్తులకు వసతి సౌకర్యాన్ని అభివృద్ధి చేసేందుకు మాస్టర్‌ప్లాన్ రూపొందించి, పనులు చేపడతామన్నారు. ఎన్ఎంఆర్‌ల క్రమబద్ధీకరణ సమస్య రాష్ట్రవ్యాప్తంగా ఉందని, ఏళ్లుగా పనిచేస్తున్న వారిని తొలగించే ప్రసక్తే లేదని, వారికి న్యాయం చేసేందుకు కట్టుబడి ఉన్నామన్నారు. అర్చకులు జీవితకాలం పనిచేసే విధంగా ప్రభుత్వం జారీచేసిన ఆదేశాలను సవరించాలని దేవాలయ స్థానాచార్యులు, ప్రధానార్చకులు మంత్రికి సూచించారు. దీనివల్ల భవిష్యత్తులో వైదిక వృత్తిలోకి యువత ప్రవేశించేందుకు దారులు మూసుకుపోతాయన్నారు. ఈ అంశంపై చర్చిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. చందనోత్సవం సమయంలో గోడ కూలిన ప్రాంతంలోని మెట్లను తక్షణమే పునరుద్ధరించాలని ఈఓను ఆదేశించారు. వరాహలక్ష్మీనృసింహస్వామిని దర్శనానికి వచ్చిన మంత్రి ఆనం రామనారాయణరెడ్డికి పూర్తి అధికార లాంఛనాలతో ఈఓ వేండ్ర త్రినాథరావు ఆహ్వానం పలికారు. మంత్రి గోత్రనామాలతో అంతరాలయంలో అర్చకులు పూజలు చేసి శేషవస్త్రాన్ని పర్యవేట్టంగా చుట్టారు. అనంతరం కప్పస్తంభం ఆలింగనం, గోదాదేవి అమ్మవారి సన్నిధిలో పూజలు తరువాత పండితులు చతుర్వేద స్వస్తి వచనాలతో ఆశీర్వచనాలీయగా, ఈఓ శాలువాతో సత్కరించి స్వామి చిత్రపటాన్ని, ప్రసాదాలను అందజేశారు. మంత్రిని దేవదాయ డిప్యూటీ కమిషనర్ ఎన్.సుజాత, ఏసీ అన్నపూర్ణ, కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం ఈఓ శోభారాణి మర్యాదపూర్వకంగా కలిశారు.

గంజాయిపై ఉక్కుపాదం

... 5వ పేజీ తరువాయి

వద్ద చెక్‌పోస్టులను ఏర్పాటుచేశారు. ప్రతి చెక్‌పోస్టు వద్ద ముగ్గురు లేదా నలుగురు సిబ్బంది ఉంటూ అన్ని ఆర్టీసీ బస్సులు, ప్రైవేటు బస్సులు, కార్లు, వ్యాన్‌లు, బైక్‌లతోపాటు అన్ని రకాల వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేస్తారు. ఒకవేళ అక్కడ పోలీసులను చూసి ఎవరైనా వాహనం ఆపకుండా ముందుకువెళ్లిపోతే వారిని పట్టుకునేందుకు వీలుగా రెండు ప్రత్యేక లార్కింగ్ (మొబైల్) చెక్‌పోస్టులను ఏర్పాటుచేశారు. ఆయా చెక్‌పోస్టుల వద్ద మూడు షిఫ్టుల్లో నిరంతరం పనిచేసేలా సిబ్బందిని నియమించారు. దీంతో నగరంలోకి గంజాయి రవాణా తగ్గుతుందని ఆశిస్తున్నట్టు సీపీ శంఖబ్రతబాగ్చి వివరించారు. గంజాయి రహిత నగరంగా విశాఖను తీర్చిదిద్దేందుకు మరికొన్ని చెక్‌పోస్టులను కూడా ఏర్పాటుచేసే ఆలోచన ఉందని, సిబ్బంది కొరత వల్ల ప్రస్తుతానికి వేచిచూస్తున్నామన్నారు.

ఉక్కు ఉద్యోగులకు శిథిల క్వార్టర్లు!

... 5వ పేజీ తరువాయి

మూడు నెలల్లో రిటైరయ్యేవారు ఇప్పుడు కుటుంబాన్ని క్వార్టర్‌లోకి మార్చే అవకాశం లేదు. పైగా అక్కడ సదుపాయాలు లేవు. యాజమాన్యం చెప్పినట్టు క్వార్టర్‌లో ఉండలేరు. బయట ఉంటే హెచ్ఆర్ఏ ఇవ్వరు.

స్టీల్ ప్లాంటుకు ఎనిమిది కి.మీ. దాటి ఉన్నవారికే క్వార్టర్లు ఇస్తారు. అంతకంటే తక్కువ దూరంలో ఉన్న వారికి ఇవ్వరు. గతంలో తప్పుడు సమాచారం ఇచ్చి క్వార్టర్‌లో చేరారని ఆరోపిస్తూ చాలామందిని బయటకు పంపించేశారు. ఇప్పుడు అలాంటి వారందరినీ క్వార్టర్లలోకి రమ్మంటున్నారు. కనీసం మరమ్మతులు కూడా చేపట్టకుండా వాటిని కేటాయిస్తున్నారు. టౌన్‌షిప్ నిర్వహణకు కూడా సరిగ్గా నిధులు ఇవ్వడం లేదు. వాస్తవానికి వాటిని కూల్చివేసి కొత్తవి నిర్మించాలి. వాటి పుస్తక విలువ కూడా జీరో అయిపోయి చాలా కాలమైంది. భారీవర్షాలు కురిసి ఏదైనా క్వార్టర్ కూలిపోతే కుటుంబం పరిస్థితి ఏమిటో యాజమాన్యమే చెప్పాలి. ఇటీవల ఓ ఉద్యోగి క్వార్టర్‌లో పాము కరిచి మరణించారు. దీంతో క్వార్టర్లలో ఉండడానికి అంతా భయపడుతున్నారు.

తప్పనిసరై ఆశ్రయించాం

న్యాయం కోరుతూ హైకోర్టులో రిట్ పిటిషన్ వేసిన మాట వాస్తవమే. స్టే ఆర్డర్ ఇవ్వాలని కోరాము. అయితే ఈ విషయం న్యాయస్థానం పరిధిలో ఉన్నందున ఇంతకు మించి మాట్లాడలేము.

\- కేవీడీ ప్రసాద్, సెక్రటరీ, స్టీల్ ఎగ్జిక్యూటివ్స్ అసోసియేషన్

రూ.1.29 కోట్ల బంగారం, వజ్రాలతో ఇద్దరి అరెస్టు

... 5వ పేజీ తరువాయి

మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్‌గా చేరాడు. షోరూమ్‌లోని డైమండ్, బంగారు ఆభరణాల మోడల్స్‌ను విశాఖలోని వివిధ గోల్డ్ షోరూమ్‌లలో చూపించేందుకు అదే సంస్థలో పనిచేస్తున్న బొగ్గు వంశీ అనే మరో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్‌తో కలసి ఈ నెల మూడో తేదీన విశాఖపట్నం వచ్చారు. ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదురుగా ఉన్న హోటల్‌లో గది తీసుకొని ఇద్దరూ బస చేశారు. ఆరోజు వివిధ షోరూమ్‌లలో ఆభరణాల మోడల్స్ చూపించి తిరిగి తీసుకువచ్చారు. మరుసటిరోజు తెల్లవారుజామున సుమారు ఐదు గంటల సమయంలో తనతో పాటు వచ్చిన వంశీ నిద్రిస్తున్న సమయంలో ముదపాక జేజి ఆభరణాల బ్యాగ్‌తో పరారయ్యాడు. నిద్ర నుంచి లేచి చూసిన వంశీకి జేజీతో పాటు ఆభరణాల బ్యాగ్ కనిపించలేదు. సీసీ ఫుటేజీలు పరిశీలించి బ్యాగ్‌తో పరారైనట్టు గుర్తించి వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు సీఐ ఉమాకాంత్ ఆధ్వర్యంలో దర్యాప్తు చేపట్టారు. శుక్రవారం ఉదయం రైల్వే ట్రాక్ వద్ద అనుమానాస్పదంగా ఇద్దరు బ్యాగ్‌తో కనిపించడంతో వారిని అదుపులోకి తీసుకొని తనిఖీచేశారు. ఆభరణాలు కనిపించడంతో వాటిని స్వాధీనం చేసుకున్నారు. అందులో ఒకరు ముదపాక జేజి కాగా మరొకరి పేరు ఆకుల సత్యనారాయణ. ఇద్దరినీ అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వారి వద్ద నుంచి రూ.1,29,48,154 విలువైన వజ్రాలు, బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్టు కమిషనర్ బాగ్చి పేర్కొన్నారు.

హెల్త్‌సిటీ సమీపాన ఎంఎస్ఎంఈ పార్క్

... 5వ పేజీ తరువాయి

రెండు ఎకరాలు తీసుకుంటున్నామన్నారు. అమెరికా పౌరులకే ఉద్యోగాల్లో ప్రాధాన్యం అంటూ ఆ దేశ అధ్యక్షుడు ట్రంప్ చేసిన వ్యాఖ్యల ప్రభావం ఏపీపై ఎంతవరకు ఉంటుందని ప్రశ్నించగా, దానిని పాజిటివ్‌గా తీసుకోవాలని మంత్రి సూచించారు. అమెరికా ఒక్కటే ఉద్యోగాలు ఇవ్వదని, ప్రపంచంలో అనేక దేశాలు ఉన్నాయని, టెక్నాలజీలో ఏపీ అగ్రస్థానాన ఉందని, ఏఐలో కూడా టాప్‌లో ఉన్నామని, ఆయా దేశాలే ఉద్యోగ అవకాశాలు ఇవ్వడానికి ముందుకు వస్తాయన్నారు. విశాఖ మెట్రో రైలు కారిడార్ తొలి దశ ఇప్పుడు ప్రారంభమవుతుందని, మలి దశలో భోగాపురం విమానాశ్రయం వరకూ వేస్తారన్నారు. అదేవిధంగా విజయనగరం వైపు కూడా కనెక్టివిటీ ఇవ్వాలని సీఎం చంద్రబాబునాయుడును కోరామని, రెండు నగరాలు దాదాపుగా కలిసి పోతున్నందున అది కూడా అవసరమన్నారు.

పైపులైన్ లీకేజీతో తాగునీరు వృథా



కేఆర్ఎం కాలనీ శివాలయం వద్ద పైపు లీక్ తో వృథాగా పోతున్న మంచినీరు

మద్దిలపాలెం, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 23వ వార్డు కేఆర్ఎం కాలనీ శివాలయం వీధిలో శుక్రవారం మున్సిపల్ వాటర్ పైప్‌లైన్ లీకైంది. దీంతో చాలా సమయం తాగునీరు వృథాగా పోయింది. స్థానికులు సంబంధిత

అధికారులకు సమాచారమివ్వగా, వాటర్ వర్క్ సిబ్బంది పైపులైన్ లీక్ అవుతున్న ప్రాంతానికి వచ్చారు. భూమిలో వేసిన పైప్‌లైన్ లీక్ అవడం గుర్తించి మరమ్మత్తులు చేశారు. అయితే ఉదయం నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు పైపులైన్ లీకవడంతో చాలా మొత్తం తాగునీరు వృథా అయింది.

భక్తిశ్రద్ధలతో శ్రావణలక్ష్మి పూజలు



వెంకోజీపాలెం, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ పరిధిలోని 16వ వార్డు సంజయ్ గాంధీ కాలనీ కనకదుర్గా అమ్మవారి ఆలయంలో శుక్రవారం శ్రావణలక్ష్మి పూజలు నిర్వహించారు. శ్రావణ మాసం మొదటి శుక్రవారాన్ని పురస్కరించుకుని మహిళలంతా తమ ఇళ్లల్లో పూజలు నిర్వహించుకొని, ఆలయానికి వచ్చి అమ్మవారికి పసుపు, కుంకుమలను సమర్పించారు. ఈ సందర్భంగా అమ్మవారిని వివిధ పుష్పాలతో అలంకరించారు. ఆలయ అర్చకుడు వెంకటరావుశర్మ భక్తుల గోత్ర నామాలతో అభిషేకాలు, అర్చనలు జరిపారు. అనంతరం మహిళలతో సామూహిక కుంకుమార్చన జరిపారు. ఆలయ నిర్వాహకులు ఎస్.నారాయణరావు, మురళి, సూర్యనారాయణ, సుందరరావు పాల్గొన్నారు.

స.హ.చట్టం అవగాహనపై పోటీలు

మద్దిలపాలెం, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : సమాచారహక్కు చట్టంపై ప్రతి విద్యార్థికి అవగాహన కలిగిఉండాలని డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఐ.విజయబాబు పేర్కొన్నారు. సమాచార హక్కు చట్టం అమలు చేసి ఇరవై ఏళ్లు గడిచిన సందర్భంగా శుక్రవారం కళాశాలలో విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వం, క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రిన్సిపాల్ విజయబాబు మాట్లాడుతూ పోటీల్లో గెలిచిన విద్యార్థులు వచ్చే నెలలో నిర్వహించే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. అనంతరం సమాచార హక్కు చట్టం ప్రాధాన్యం గురించి వివరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ పి.జయ, ఎన్ఆర్సీ కో-ఆర్డినేటర్ రూపవాణి, స.హ.చట్టం కో-ఆర్డినేటర్ ఉమామహేశ్వరరావు, ఎన్.శారద పాల్గొన్నారు.

సినిమా గైడ్

● **హరిహర వీరమల్లు** : జగదాంబ, శారద, రమాదేవి, మెలోడి, వెంకటేశ్వర, శ్రీవెంకటేశ్వర, లీలామహల్, సంగం, శ్రీరామా, కిన్నెర, కామేశ్వరి, శ్రీకన్య, గోకుల్, శ్రీకాంతి, ఊర్వశి (కంచరపాలెం), సౌజన్య సుకన్య (గోపాలపట్నం), మౌర్య, నరసింహ (గోపాలపట్నం), నటరాజ్ (పెందుర్తి). మోహిని, మినీ మోహిని (గాజువాక), శ్రీకన్య కన్య, శ్రీకన్య హెవెన్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ)

● **జూనియర్** : శరత్, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా),

● **తమ్ముడు** : లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 21, టమాటా 42, వంకాయలు (తెలుపు) 28, వంకాయలు (నలుపు) 32, బెండకాయలు 30, పచ్చిమిర్చి 76, కాకరకాయలు 28, బీరకాయలు 32, ఆనపకాయ 14, కాలీఫ్లవర్ 34, క్యాబేజి 24, క్యారెట్ 46, దొండకాయలు 26, బంగాళ దుంపలు 16, అరటికాయ (పె)10, మునక్కాడలు (కిలో) 42, అల్లం (పాతది) 62, బరబాటి 30, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 50, బద్దచిక్కుడు 50, దోస కాయలు 14, వెల్లుల్లి (పెద్దవి) 80, కొబ్బరికాయ (పెద్దది) 30, బీన్స్ (పెన్సిల్) 62, కీరదోస 30, కాప్సికమ్ 80, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 36, చిలగడదుంపలు 44, కంద 42, దేముడు చిక్కుడు 64, గోరుచిక్కుడు 42, కూర పెండలం 30, బ్రకోలి 45, పనస పొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 20, కర్రపెండలం 24, మామిడి అల్లం 56, బొప్పాయి 36, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	465
విజయనగరం	469
శ్రీకాకుళం	469

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	87
లైవ్ ధర	107
విత్ స్కిన్	184
స్కిన్‌లెస్	194

అందరికీ సంక్షేమం.. ప్రభుత్వ లక్ష్యం

» ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు



11వ వార్డులో పర్యటిస్తున్న ఎమ్మెల్యే రామకృష్ణబాబు

ఆరిలోవ, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : ఏడాది కూటమి ప్రభుత్వ పాలనలో ప్రజలకు అన్ని సంక్షేమ పథకాలు అందుతున్నాయా? లేదా ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా? అంటూ ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు 11వ వార్డు ప్రజలను ఆరా తీశారు. శుక్రవారం ఈ వార్డులో టీడీపీ ఇన్‌చార్జి రాగతి అచ్యుతరావు ఆధ్వర్యంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేతో పాటు కూటమి పార్టీల నేతలు ఇంటింటికీ వెళ్లి రాష్ట్రంలో చేపట్టిన అభివృద్ధి, అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. స్థానిక సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు మాట్లాడుతూ రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఆశాజనకంగా లేకున్నా ఎన్నికల హామీ మేరకు ఎన్నో సంక్షేమ పథకాలు, ఎంతగానో అభివృద్ధి పనులు చేట్టామన్నారు. సూపర్ సిక్స్ హామీలను అమలు చేసి తీరుతామని స్పష్టం చేశారు. ఇప్పటికీ తల్లికి వందనం డబ్బులు అందని వారు ఎవరైనా ఉంటే సచివాలయంలో కలిసి వారి వివరాలు అందించాలని సూచించారు. అభివృద్ధి, సంక్షేమానికి కూటమి ప్రభుత్వం సమప్రాధాన్యం ఇస్తుందన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు టీడీఈ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఒమ్మి సన్యాసిరావు, 11వ వార్డు అధ్యక్షుడు ముగడ రాజారావు, కార్యదర్శి పేపరు నాయుడు. టీడీపీ జిల్లా నాయకులు కృష్ణంరాజు. మూది అప్పారావు, రేఖా జ్యోతి, రంగాల మంగరాజు, పచ్చి శ్రీనివాసరావు, క్యాటరింగ్ రాజు, ఆదినారాయణ రాజు, చందక లలిత, మంగ, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

సమస్య పరిష్కరించకుండా పలాయనం

» సచివాలయ సిబ్బంది తీరును తప్పుపట్టిన స్థానికులు



సచివాలయ ఉద్యోగులను నిలదీస్తున్న స్థానికులు

మద్దిలపాలెం, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 22వ వార్డు పిఠాపురంకాలనీలోని కాలువలు, కల్వర్టు నిర్మాణం జీవీఎంసీ అధికారులకు తలనొప్పిగా మారుతోంది. కల్వర్టు నిర్మాణం చేయాలని స్థానికులు పీజీఆర్ఎస్‌లో వినతులు.., నిర్మాణం చేస్తే ఊరుకోనని వార్డు కార్పొరేటర్ పీతల మూర్తి బెదిరింపులు.. దీంతో ఏం చేయాలో పాలుపోక అధికారులు తలలు పట్టుకుంటున్నారు.

పిఠాపురం కాలనీ రజకవీధి రహదారిని డ్రైనేజీ, కల్వర్టు నిర్మాణం పేరుతో ఆరు వారాల కింద తవ్వేశారు. డ్రైనేజీ పక్కనే ఓ అరవై ఏళ్ల వృద్ధురాలు నిర్వహిస్తున్న దుకాణం తొలగించి కాలువ నిర్మాణం చేయాలని పీతల మూర్తి యాదవ్, టౌన్‌ప్లానింగ్ సిబ్బంది, కాంట్రాక్టర్‌కు ఆదేశించారు. కార్పొరేటర్ ఆదేశాలతో దుకాణం తొలగించాలని సిబ్బంది వృద్ధురాలిని ఒత్తిడి చేయగా తనక కోర్టు ఆర్డర్ ఉందని ఆమె తెలిపింది. అయితే దుకాణం తీస్తే కాని డ్రైనేజీ, కల్వర్టు పనులు చేయొద్దని పీతల మూర్తి పట్టుబట్టారు. దీంతో కాలువ, కల్వర్టు నిర్మాణ పనులు ఆగిపోయాయి. ఫలితంగా... 45 రోజులుగా స్థానికులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతూ పీజీఆర్ఎస్‌లో జీవీఎంసీ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు.

ఆ ఫిర్యాదుపై వాస్తవాలు తెలుసుకొని పరిష్కారం చేసేందుకు శుక్రవారం వచ్చిన సచివాలయ సిబ్బంది స్థానికులతో మాట్లాడారు. అయితే కాలువ నిర్మాణం కార్పొరేటర్ చేయొద్దన్నారు కనుక మీ ఫిర్యాదు పరిష్కరించినట్టుగా రాసుకుంటామని సిబ్బంది చెప్పడంతో స్థానికులు అవాక్కయ్యారు. కాలువ నిర్మాణం చేయనప్పుడు రోడ్డు ఎందుకు తవ్వారని ప్రశ్నించారు. ఫిర్యాదు పరిష్కరించినట్టు రాస్తే మళ్లీ ఫిర్యాదు చేస్తామని స్పష్టం చేశారు. దీంతో సచివాలయం సిబ్బంది తిరుగుముఖం పట్టారు.

అధ్వానంగా ఆర్టీసీ కాంప్లెక్స్ రహదారి

» తీవ్ర దుర్గంధంతో రాకపోకలకు ఇబ్బందులు



మద్దిలపాలెం ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద నిల్వ ఉన్న మురుగు

మద్దిలపాలెం, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : మద్దిలపాలెం ఆర్టీసీ కాంప్లెక్స్ జాతీయరహదారిపై కంపు కడుతోంది. ప్రయాణికులు వేచి ఉండే ప్రాంతంలో మురుగు నిల్వ ఉండడంతో దుర్గంధం వెదజల్లుతోంది. ప్రతి రోజూ ఈ రహదారిలో వేలాదిమంది రాకపోకలు సాగిస్తుంటారు. బస్సులు దిగి పాదచారులు వెళ్తుంటారు. ఇక్కడ నిల్వ ఉన్న మురుగు నీరు రోజుల తరబడి నిలిచిపోవడంతో తీవ్ర దుర్వాసన వ్యాపించి అటు వైపు రాకపోకలు సాగించే వారు ముక్కులు మూసుకోవాల్సిన పరిస్థితి నెలకొంటోంది.

అయితే ఏర్పాటు చేసిన డస్ట్‌బిన్ నిండిపోయి కొన్ని రోజులు గుస్తున్నా పారిశుధ్య సిబ్బంది చెత్తను తరలించడం లేదు. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో ఆ డస్ట్‌బిన్‌లో చెత్త కుళ్లిపోయి ఆ ప్రాంతమంతా దుర్గంధం వ్యాపిస్తోంది. ఈగలు, దోమలు ముసురుతూ పరిసరాలు అపరిశుభ్రంగా మారిపోయాయి. దీంతో ఆ పక్క నుంచి వెళ్లాలంటేనే ప్రయాణికులు హడలిపోతున్నారు. ఆర్టీసీ, జీవీఎంసీ అధికారులు మాత్రం ఏమీ పట్టనట్టు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఆర్టీసీ కాంప్లెక్స్‌లో నెలకొన్న చెత్త సమస్యను పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.

ఆసియా సైన్స్ క్యాంపునకు కృష్ణా కళాశాల విద్యార్థి ఎంపిక



వర్ధనాయుడుకి అభినందిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ విజయబాబు

మద్దిలపాలెం, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : థాయ్‌లాండ్‌లో నిర్వహించే ఆసియా సైన్స్ క్యాంప్-25కు డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థి ఎంపికయ్యాడు. జూలై 31 నుంచి ఆగస్టు 6 వరకు థాయ్‌లాండ్‌లో జరిగే ఈ క్యాంపునకు న్యూఢిల్లీలోని సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగం భారతదేశం నుంచి 20 మంది విద్యార్థులను నామినేట్ చేసింది. వీరిలో కృష్ణా కళాశాలలో బీఎస్సీ తృతీయ సంవత్సరం చదువుతున్న లెంకానంది వర్ధన నాయుడు ఉన్నాడు. ఈ సందర్భంగా వర్ధన నాయుడుకి కళాశాల ప్రిన్సిపాల్ విజయబాబు, అధ్యాపకులు అభినందించారు.

విశ్రాంత ప్రొఫెసర్ కృష్ణారావుకు వెటరన్ హైడ్రోజియాలజిస్టు అవార్డు

వెంకోజీపాలెం, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : ఏయూ విశ్రాంత ప్రొఫెసర్ జి.కృష్ణారావుకు వెటరన్ హైడ్రోజియాలజిస్టు అవార్డు లభించింది. జైపూర్, అమిటీ విశ్వవిద్యాలయంలో జరిగిన సెమినార్‌లో ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఆఫ్ హైడ్రోజియాలజిస్ట్‌కి చెందిన ఇండియన్ నేషనల్ చాప్టర్ ద్వారా 'వెటరన్ హైడ్రోజియాలజిస్టు అవార్డు' ప్రదానం చేశారు. ఈ సెమినార్‌ను రాజస్థాన్ రాష్ట్ర భూగర్భ జల బోర్డు, అమిటీ విశ్వవిద్యాలయం (జైపూర్), ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఆఫ్ హైడ్రోజియాలజిస్ట్‌కు చెందిన ఇండియన్ నేషనల్ చాప్టర్ సంయుక్తంగా నిర్వహించాయి. ఈ సందర్భంగా దేశంలోని ఐదుగురు అత్యంత సీనియర్ హైడ్రోజియాలజిస్ట్‌లను వారి సేవలు, పనితీరు ఆధారంగా గుర్తించి అవార్డులను ప్రదానం చేశారు. వీరిలో ఏయూ విశ్రాంత ప్రొఫెసర్ జి.కృష్ణారావు స్థానం సాధించారు. అలాగే ప్రచురించబడిన 99 పరిశోధన పత్రాలలో ప్రొఫెసర్ జి.కృష్ణారావు పరిశోధన పత్రానికి మొదటి స్థానం లభించడం విశేషం.

జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరానికి 8 వినతులు

వెంకోజీపాలెం, జూలై 25(ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ ప్రతి శుక్రవారం నిర్వహిస్తున్న టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్‌కు 8 వినతులు వచ్చినట్టు జీవీఎంసీ చీఫ్ సిటీ ప్లానరు ఎ.ప్రభాకరరావు తెలిపారు. శుక్రవారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో ఆయన చాంబర్‌లో సీపీలు, డీసీపీలు, ఏసీపీలుతో కలిసి ప్రత్యేకంగా టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ వినతులు/ ఫిర్యాదులను నిర్ణీత సమయంలో టౌన్ ప్లానింగ్ అధికారులు వెంటనే స్పందించి పరిష్కరించాలని సీసీపీ ఆదేశించారు.

మత్స్యకారులకు రాయితీపై వలలు, బోటు యంత్రాలు అందజేత



మత్స్యకారులకు వలలు, బోటు ఇంజిన్లు అందిస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు

ఎంవీపీ కాలనీ/ పెదవాల్తేరు, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : మత్స్యకారులకు రాయితీపై వలలు, బోటు ఇంజిన్లను ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు శుక్రవారం అందజేశారు. జీవీఎంసీ 18వ వార్డు పరిధిలోని అప్పుఘర్ వద్ద మత్స్యశాఖ ఆధ్వర్యంలో వాసవానిపాలెం, శివగణేష్ నగర్, జాలారి ఎండాడకు చెందిన మత్స్యకారులకు నిర్వహించిన కార్యక్రమంలో వీటిని ఎమ్మెల్యే చేతుల మీదుగా అందజేశారు. ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకంలో భాగంగా రాయితీపై వీటిని అందించారు. లబ్ధిదారులకు నలభై శాతం రాయితీపై సుమారు రూ.18 లక్షల ఆరు వలలు, 16 ఇంజిన్లను అందించారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటరు గొలగాని మంగవేణి, 19వ వార్డు కార్పొరేటరు నొల్లి నూకరత్నం, తెలుగుదేశం నాయకులు రామారావు, మసేను, గురునాథరావు, దాసు, పోలారావు, నూకరాజు, గురుమూర్తి, ఫిషరీస్ డిపార్టుమెంట్ అధికారులు పాల్గొన్నారు.

నివాస ప్రాంతాల్లో వ్యర్థ సామగ్రి నిల్వలేంటి?

» ఓ మహిళ నిర్వాకంతో ఏడు కొళాయిల జంక్షన్ వాసుల ఇబ్బందులు



ఓ గ్రూప్ హౌస్‌లో నిల్వ చేసిన ప్లాస్టిక్ వ్యర్థాలు

మద్దిలపాలెం, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ విశాఖ 22వ వార్డు ఆరు కొళాయిల జంక్షన్‌లోని ఓ నివాసంలో ప్లాస్టిక్ వ్యర్థాలు నిల్వ చేయడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ గ్రూప్ హౌస్‌లో అద్దెకు ఉంటున్న మహిళ ప్లాస్టిక్, చెత్త, వ్యర్థాలు, గాజు సీసాలు ఏరుకుని గోనె సంచుల్లో ఇంటి బయట నిల్వ చేస్తున్నారు. చెత్త కుప్పల నుంచి ఏరుకుని వచ్చిన వ్యర్థాలను నివాసాల మధ్య డంపింగ్ చేయడంతో దుర్వాసన వెదజల్లుతోంది. దోమలు విజృంభిస్తున్నాయి. దీంతో వ్యర్థాలు తొలగించాలని సదరు మహిళకు స్థానికులు కోరినా ఫలితం లేకుండా పోతోంది. దీనిపై జీవీఎంసీ పారిశుధ్య విభాగం అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

హిడెన్ స్ప్రౌట్స్ మానసిక దివ్యాంగుల ప్రత్యేక పాఠశాలలో అన్నదానం



దివ్యాంగులకు భోజనం వడ్డిస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి

పెదవాల్తేరు, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ 19వ వారు అధ్యక్షుడు చిరంజీవి ప్రథమ వర్ధంతి సందర్భంగా వారి కుటుంబసభ్యులు హిడెన్ స్ప్రౌట్స్ మానసిక దివ్యాంగుల ప్రత్యేక పాఠశాలలో 150 మంది పిల్లలకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శాసన సభ్యులు వెలగపూడి రామకృష్ణబాబు పాల్గొని చిరంజీవికి నివాళులు అర్పించారు. అనంతరం పిల్లలకు భోజనం వడ్డించారు. కార్యక్రమంలో ఎం.బాపిరాజు, తెడ్డు రాజు, వైఎంసీఏ శ్రీనివాస్, మానసిక దివ్యాంగుల పాఠశాల నిర్వాహకుడు కండిపిల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ధర్మస్థలి ఘటనల ఆరోపణలపై తక్షణమే ఉన్నతస్థాయి దర్యాప్తు

» ఎన్ఎఫ్ఐడబ్ల్యూ, పీవోడబ్ల్యూ సంఘాల డిమాండ్



నిరసన వ్యక్తంచేస్తున్న ఎన్ఎఫ్ఐడబ్ల్యూ, పీవోడబ్ల్యూ ప్రతినిధులు, మహిళలు

సిరిపురం, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : ధర్మస్థలి నేరాలపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జి పర్యవేక్షణలో తక్షణమే ఉన్నతస్థాయి దర్యాప్తు చేపట్టి, దోషులందరినీ కఠినంగా శిక్షించాలని ఎన్ఎఫ్ఐడబ్ల్యూ, పీవోడబ్ల్యూ ప్రతినిధులు డిమాండ్ చేశారు. శుక్రవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ఎన్ఎఫ్ఐడబ్ల్యూ, పీవోడబ్ల్యూ సంయుక్త ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా పీవోడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షురాలు ఎం.లక్ష్మి, ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ.విమల మాట్లాడుతూ కర్ణాటక ధర్మస్థలి ఆలయంలో 1995 నుంచి 2014 వరకు పని చేసిన విశ్రాంత పారిశుధ్య కార్మికుడు.. అనేక మంది అత్యాచార ఆనవాళ్లు ఉన్న బాలికల శవాల్ని తాను నేత్రావతి నదీ పరివాహక ప్రాంతంలో పూడ్చిపెట్టానని చెప్పారని పేర్కొన్నారు. ఆలయ ట్రస్టీ రాజకీయ, అధికార, డబ్బు పలుకుబడి కలవారని, ఎన్ని ప్రభుత్వాలు మారినా అందరినీ మేనేజ్ చేయగలుగుతున్నారని వెల్లడించారని ఆయన చెప్పారన్నారు. ఈ విషయమై సదరు విశ్రాంత కార్మికుడు.. విశ్రాంత సుప్రీంకోర్టు జడి గోపాల్‌గౌడ్, పత్రికా ప్రతినిధుల సమక్షంలో చెప్పాడని వివరించారు. ఈ నేపథ్యంలో ధర్మస్థలిలో జరిగినట్టు చెబుతున్న నేరాల ఉదంతాలపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జి పర్యవేక్షణలో ఉన్నతస్థాయి దర్యాప్తు చేపట్టాలని డిమాండ్ చేశారు. దోషులకు శిక్ష పడే వరకు తాము పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎన్ఎఫ్ఐడబ్ల్యూ, పీవోడబ్ల్యూ ప్రతినిధులు, మహిళలు పాల్గొన్నారు.

విశాఖ డెయిరీలో తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి

» సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సింగరావు



మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నర్సింగరావు

సిరిపురం, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : విశాఖ డెయిరీలో తొలగించిన కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నర్సింగరావు డిమాండ్ చేశారు. విశాఖ డెయిరీలో ఆకారణంగా తొలగించిన కాంట్రాక్టు కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ శుక్రవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద విశాఖ డెయిరీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సింగరావు మాట్లాడుతూ 305 మందిని అన్యాయంగా, ఎలాంటి ముందస్తు నోటీసులు లేకుండా జూన్ 10న యాజమాన్యం తొలగించిందని, ఇది అన్యాయమన్నారు. దీనిపై కార్మిక శాఖ జాయింట్ కమిషనర్ స్పందిస్తూ అందరినీ విధుల్లోకి తీసుకోవానలి కాంట్రాక్టర్‌ను ఆదేశించారన్నారు. తక్షణమే తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్కేఎస్వీ కుమార్, యూనియన్ గౌరవాధ్యక్షుడు ఎం.రాంబాబు, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు జి.నాయుడుబాబు, పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు రెడ్డి వెంకట్రావు, యూనియన్ నాయకులు ఏ.నూకేశ్వరరావు, ఎ.రమణ, అనసూయ, పద్మజ, మధుబాబు, నాగేశ్వరరావు, కార్మికులు పాల్గొన్నారు.

విద్యుత్ స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించండి

» ఏఐటీయూసీ పిలుపు



కరపత్రాలను పంపిణీ చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

వెంకోజీపాలెం, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్తు స్మార్ట్ మీటర్లను ప్రజలు వ్యతిరేకించాలని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో 15వ వార్డు డాక్టర్స్ కాలనీ అపార్ట్మెంట్ ఏరియాలో శుక్రవారం కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి పడాల గోవింద్ మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యుత్ భారాలు ప్రజలపై వేయాలని ఆలోచన చేస్తోందని, దీనివల్ల ఈ స్మార్ట్ మీటర్ల ఖరీదును వినియోగదారులు భరించాల్సి ఉంటుందన్నారు. సింగిల్ ఫేజ్ మీటర్ ఖరీదు రూ.8927, త్రీఫేస్ మీటరు ఖరీదు రూ.17,286 లు ఈ మొత్తాన్ని 93 నెలలు బిల్లుతో పాటు అదనంగా చెల్లించవలసి వస్తుందన్నారు. ప్రజలు విద్యుత్ ఎక్కువగా వాడే సమయంలో చార్జీలు ఎక్కువ వసూలు చేస్తారని, వేసవికాలంలో ఈ భారం ప్రజలపై మరింత ఎక్కువగా ఉంటుందన్నారు. దీని ప్రభావం బిల్లులపై పడుతుందన్నారు. ప్రస్తుతం వచ్చే బిల్లు రూ.500 అయితే ఈ స్మార్ట్ మీటర్ల వలన రూ.3000 వరకు పెరగవచ్చని ఆందోళన వ్యక్తం చేశారు. స్మార్ట్ మీటర్లన్నీ ప్రీపెయిడ్ మీటర్ అని ప్రజలు గుర్తించవలసిన అవసరం ఉందన్నారు. ఈ స్మార్ట్ మీటర్లను ప్రభుత్వం బిగించడం వలన సెల్‌ఫోన్ మాదిరిగానే రీచార్జ్ చేసుకోవాలన్నారు. ప్రస్తుత మీటర్లను తీసేసి ఈ స్మార్ట్ మీటర్లను బిగిస్తే రీచార్జ్ పూర్తవ్వగానే ఇంటి కరెంటు ఆగిపోతుందని, వాడుకున్న బిల్లు కనుమరుగై ముందుగానే డబ్బులు చెల్లించవలసి వస్తుందని వివరించారు. వీటివల్ల ఖరీదుతో పాటు దాని రిపేరుకు అయ్యే ఖర్చులు కూడా ప్రజలే భరించాలని, ఈ నేపథ్యంలో స్మార్ట్ మీటర్లు అమర్చడాన్ని ప్రజలు ఏకకంఠంతో వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు అవనాపు శ్రీను, బి.హరి, సూరిబాబు, నాయుడు, సోములు తదితరులు పాల్గొన్నారు.

షెడ్డు తొలగింపునకు చర్యలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



తొలగించిన షెడ్డు

ఆరిలోవ, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 10 వార్డులో గల ఆదర్శనగర్ పెట్రోలు బంకు సర్వీసు రోడ్డు నుంచి ఇందిరా గాంధీ నగర్ వైపు వెళ్లే సర్వీసు రోడ్డులో స్థలాన్ని ఆక్రమించి వేసిన షెడ్డును శుక్రవారం జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ సిబ్బంది తొలగించారు. ఈ విషయమై 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి స్పందించిన అధికారులు ఈ చర్యలు తీసుకున్నారు. ప్రభుత్వ స్థలాన్ని ఎవరు ఆక్రమించినా, నిర్మాణాలు చేపట్టినా చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు.

రెవెన్యూ బదిలీల్లో మార్పులు

విశాఖపట్నం, జూలై 25 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ శాఖ బదిలీల్లో మార్పులు చోటుచేసుకున్నాయి. ముగ్గురు ఉద్యోగులకు గతంలో ఇచ్చినచోట కాకుండా మరోచోట పోస్టింగ్ ఇచ్చారు. అలాగే మరో ఆరుగురికి డిప్యూటేషన్‌పై ఇతర శాఖల్లో పోస్టింగ్ ఇస్తూ కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ శుక్రవారం ప్రొసీడింగ్స్ ఇచ్చారు. ఇటీవల చేపట్టిన బదిలీల్లో అనకాపల్లి జిల్లాకు బదిలీ చేసిన ముగ్గురికి విశాఖ జిల్లాలోనే పోస్టింగ్ ఇచ్చారు. విశాఖ జిల్లాలో పలుచోట్ల పనిచేస్తున్న ఆరుగురు ఉద్యోగులను యూఎల్‌సీ, పౌర సరఫరాలు, భూసేకరణ విభాగాలకు డిప్యూటేషన్‌పై పంపుతూ ఆదేశించారు.

క్రికెట్ ఫైనల్స్‌లో సిటీ పోలీసు జట్టు

విశాఖపట్నం స్పోర్ట్స్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): విశాఖ జిల్లా క్రికెట్ అసోసియేషన్ (వీడీసీఏ) నిర్వహిస్తున్న ఇనిస్టిట్యూషనల్ వార్షిక క్రికెట్ లీగ్ టోర్నీలో సిటీ పోలీసు ఫైనల్స్‌కు చేరింది. ఏసీఏ వీడీసీఏ-బీ గ్రౌండ్‌లో శుక్రవారం ఎన్‌టీపీసీతో జరిగిన చివరి లీగ్ మ్యాచ్‌లో సిటీ పోలీసు 16 పరుగుల తేడాతో విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన సిటీ పోలీసు 19.4 ఓవర్లలో 153 పరుగులకు ఆలౌటైంది. కె.శివకేశవ 36 పరుగులు, వి.త్రినాథ్ 34 పరుగులతో రాణించారు. ఎన్‌టీపీసీ బౌలర్లు ప్రిన్స్, ఉమేష్ చెరో మూడు వికెట్లు పడగొట్టారు. 154 పరుగుల విజయలక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన ఎన్‌టీపీసీ నిర్ణీత 20 ఓవర్లలో ఎనిమిది వికెట్లకు 137 పరుగులు మాత్రమే చేయగలిగింది. అవినాష్ (33) మినహా మిగిలినవారు విఫలమయ్యారు. సిటీ పోలీసు బౌలర్లలో టి.రాజు మూడు, అనీష్ రెండు వికెట్లు తీశారు.

ఓఆర్ఎస్ ద్రావణం ఆరోగ్యకరం


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ రవికిరణ్

అక్కయ్యపాలెం, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ఓఆర్ఎస్ శరీరానికి అత్యవసరమైన ఖనిజ లవణాలతో కూడిన ద్రావణమని, దాన్ని ప్రతి ఒక్కరూ తాగాలని డాక్టర్ రవికిరణ్ విద్యార్థులకు సూచించారు. గ్రేటర్ 26వ వార్డు ఎన్జీజీఓస్ కాలనీలోని జీవీఎంసీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు శుక్రవారం ఓఆర్ఎస్ ఉపయోగంపై అవగాహన కల్పించారు. చిన్నారులు నీళ్ల విరోచనాలతో బాధపడినా, మూత్రం సరిగ్గా రాకపోయినా, పెదాలు, నాలుక ఎండిపోయినట్లు అనిపించినా, కళ్లు పొడిబారినా, నీరసంగా కనిపించినా వెంటనే ఓఆర్ఎస్ ద్రావణాన్ని తాగించాలన్నారు. ప్రభుత్వం, ప్రైవేట్ సంస్థలు తయారు చేసిన ఓఆర్ఎస్ ప్యాకెట్లపై ఉన్న సూచనల ప్రకారం వేడి చేసి చల్లార్చిన నీళ్లలో కలిపి ద్రావణం తయారు చేసి తాగించాలని పేర్కొన్నారు. ప్రధానోపాధ్యాయిని జయంతి రాధాకుమారి పాల్గొన్నారు.

ప్రాథమిక పాఠశాలకు ఐడీబీఐ బ్యాంక్ వితరణ


కార్యక్రమంలో పాల్గొన్న దాతలు

అక్కయ్యపాలెం, జూలై 25 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 42వ వార్డు రైల్వే న్యూకాలనీలోని జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలకు రూ.2 లక్షల విలువైన సామగ్రిని ఐడీబీఐ బ్యాంక్ సీతమ్మధార బ్రాంచ్ ప్రతినిధులు శుక్రవారం అందజేశారు. ఫ్యాన్లు, లైట్లు, కుర్చీలు, టేబుళ్లు, కంప్యూటర్, స్పీకర్లు, మైక్ సెట్ అందించినట్లు బ్యాంక్ రీజనల్ హెడ్ కన్వదీప్ దాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ హెడ్ అజయ్, మండల విద్యాశాఖాధికారులు రామారావు, బాలామణి, హెచ్ఎం పి.శంకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


వన్‌టౌన్‌లో ముత్యాల చీర అలంకరణతో వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారు


కన్యకాపరమేశ్వరి ఆలయంలో సామూహిక కుంకుమార్చన, లలిత సహస్రనామ పారాయణంలో పాల్గొన్న మహిళలు


కనకాంబరాలు, జాజు పూలతో ఉమాదేవి అమ్మవారికి అలంకరణ

భక్తిశ్రద్ధలతో శ్రావణ పూజలు

మహారాణిపేట, జూలై 25 (ఆంధ్రజ్యోతి): శ్రావణమాస ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. శుక్రవారంతోనే శ్రావణమాసం ప్రారంభం కావడంతో ఆలయాల్లో అమ్మవార్లను విశేషంగా అలంకరించారు. వన్‌టౌన్‌లోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో వాసవీమాత ముత్యాల చీర అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. తెల్లవారు జామున అమ్మవారి మూలవిరాట్‌కు శుద్ధజలం, పాలు పెరుగు, తేనె, గంధం, పసుపు, కుంకుమ, వివిధ రకాల పండ్ల రసాలు, 108 సుగంధ ద్రవ్యాలతో ప్రత్యేకంగా అభిషేకం నిర్వహించారు. అనంతరం 108 స్వర్ణ పుష్పాలతో నివేదన చేసి, ముత్యాలచీరతో అమ్మవారిని అలంకరించారు. దేవాలయ ప్రాంగణంలో సుమారు 300 మంది మహిళలు సామూహిక లలిత సహస్రనామ పారాయణం, కుంకుమ పూజలు నిర్వహించారు. దేవాలయం నిర్వాహక అధ్యక్షుడు ఆరిశెట్టి దినకర్ పర్యవేక్షణలో భక్తుల పూజలకు ఏర్పాట్లు చేసి, తీర్థప్రసాదాలు అందజేశారు. పెద్ద సంఖ్యలో మహిళలు అమ్మవారిని దర్శించుకున్నారు.

ప్రత్యేక అలంకరణలో ఉమాదేవి అమ్మవారు

డాబాగార్డెన్స్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): డాబాగార్డెన్స్‌లోని శివరామకృష్ణ దేవాలయ ప్రాంగణంలో వేంచేసి ఉన్న ఉమాదేవి అమ్మవారికి శ్రావణమాసం మొదటి శుక్రవారం సందర్భంగా కనకాంబరాలు, జాజు పూల మాలలతో శోభాయమానంగా అలంకరించారు. పూలతో అమ్మవారికి చీరకట్టు అలంకారం ప్రత్యేకతను సంతరించుకుంది. ఆలయ అర్చకులు జి.భార్గవశర్మ సంప్రదాయరీతిలో కుంకుమార్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. సన్నిధిలో మహిళలు సామూహికంగా లలితా సహస్రనామ పారాయణం చేశారు. ఈ కార్యక్రమంలో ఈవో జీవీ రమాభాయి, సిబ్బంది మన్మథరెడ్డి, గోపి, ఆధ్యాత్మికవేత్త ఎం.వి.రాజశేఖర్ పాల్గొన్నారు. అందరికీ తీర్థప్రసాదాలు అందజేశారు.

విశాఖ-నౌపడ సెక్షన్‌లో డీఆర్ఎం ఆకస్మిక తనిఖీలు


నౌపడ స్టేషన్‌లో సిబ్బందికి సూచనలు ఇస్తున్న డీఆర్ఎం లలిత్ బొహ్రా

విశాఖపట్నం, జూలై 25 (ఆంధ్రజ్యోతి): వాల్తేరు డివిజన్ పరిధిలోని విశాఖ-నౌపడ సెక్షన్‌లో డీఆర్ఎం లలిత్ బొహ్రా శుక్రవారం పర్యటించారు. ట్రాక్ పరిస్థితులు, వంతెనలు, పాయింట్లు, క్రాసింగ్‌లు, సిగ్నలింగ్, ఫుట్‌ప్లేట్స్ నిర్వహణలో చేపడుతున్న భద్రతా చర్యలను క్షుణ్ణంగా పరిశీలించారు. సురక్షిత రైల్వే కార్యకలాపాల నిర్వహణలో సిబ్బంది పాటిస్తున్న సమయపాలనపై తనిఖీలు నిర్వహించారు. నౌపడ స్టేషన్‌లో రిజిస్టర్, ఆపరేషన్ మాడ్యూల్స్‌తోపాటు భద్రతకు సంబంధించి డాక్యుమెంట్లను పరిశీలించి వాటిపై సమీక్షించారు. ట్రాలీమెన్ పాటించాల్సిన విధి విధానాలు, నిబంధనల ప్రాముఖ్యతపై సిబ్బందికి వివరిస్తూ రైల్వే బోర్డు మార్గదర్శకాల మేరకు ట్రాలీ కార్యకలాపాలు ప్రారంభించే ముందు బ్రేక్‌లు, టైం టేబుల్ పరికరాలను ఎప్పటికప్పుడు తనిఖీ చేసి భద్రతా నిబంధనలు పాటించాలని ఆపరేటర్లకు సూచించారు.

ఐటీఐల్లో ముగిసిన కౌన్సెలింగ్


అభ్యర్థుల ధ్రువపత్రాలు పరిశీలిస్తున్న అధికారులు

కంచరపాలెం, జూలై 25 (ఆంధ్రజ్యోతి): కంచరపాలెం ప్రభుత్వ పాత ఐటీఐలో మూడు రోజులు చేపట్టిన రెండో విడత కౌన్సెలింగ్ శుక్రవారం ముగిసింది. రెండో విడత ప్రవేశాల్లో భాగంగా జరిగిన కౌన్సెలింగ్‌లో సుమారు 350 మంది అభ్యర్థులకు వివిధ ట్రేడుల్లో సీట్లు కల్పించినట్టు ప్రిన్సిపాల్ జె.శ్రీకాంత్ పేర్కొన్నారు. ఎలక్ట్రికల్, ఫిట్టర్, డీజిల్ మెకానిక్, ఎంఎంటీఎం, కార్పెంటర్, ప్లంబర్, డ్రాఫ్ట్‌మెన్ సివిల్,మెకానికల్ తదితర ట్రేడుల్లో సీట్లు భర్తీచేశామన్నారు. ఈ నెల 26, 27 తేదీల్లో ప్రైవేటు ఐటీఐల్లో ప్రవేశాలకు రెండో విడత కౌన్సెలింగ్ జరుగుతుందన్నారు. సీటు కేటాయింపు ధ్రువపత్రాలు పొందిన అభ్యర్థులు ఆయా ట్రేడుల్లో తక్షణమే రిపోర్టు చేయకపోతే సీటు రద్దయ్యే ప్రమాదం ఉంటుంది. కౌన్సెలింగ్‌లో వైస్ ప్రిన్సిపాల్ డి.వెంకటేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసుల సహకారంతోనే పండుగలు విజయవంతం

ఏసీపీకి మాధవ యువజన సంఘం కృతజ్ఞతలు


వెస్ట్ ఏసీపీ పృథ్వీతేజకు జ్ఞాపిక అందిస్తున్న కమిటీ సభ్యులు

మాధవధార, జూలై 25 (ఆంధ్రజ్యోతి): మాధవధారలో పండుగ సంబరాలు విజయవంతం కావడానికి సహకరించిన విశాఖ వెస్ట్ జోన్ పోలీసు అసిస్టెంట్ కమిషనర్ పృథ్వీతేజను శుక్రవారం మాధవ యువజన సమాజం సభ్యులు అభినందించారు. మూడు మందిరాల పండుగల రోజుల్లో భక్తుల దర్శనాల నుంచి ట్రాఫిక్ విభాగం, నేరాలు జరగకుండా చూసిన పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు. మాధవధార గ్రామదేవత కుంచుమాంబ అమ్మవారు, సీతన్నగార్డెన్స్‌లోని కనకమహాలక్ష్మీ ఆలయం, బిర్లా జంక్షన్ ఆరంభంలో గల కొత్త మహాలక్ష్మి అమ్మవారి పండుగల్ని పోలీసుల సంపూర్ణ సహకారంతో విజయవంతం చేయగలిగామని కమిటీ సభ్యులు పేర్కొన్నారు. తన కార్యాలయంలో ఏసీపీ పృథ్వీరాజ్‌ను కలిసి శాలువాతో సత్కరించి గ్రామ సంఘం తరఫున జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో మాధవ యువజన సమాజం సభ్యులు, 50వ వార్డు టీడీపీ అధ్యక్షుడు ఎస్.వరప్రసాద్, ఇతర గ్రామ పెద్దలు హాజరయ్యారు.

సత్యసాయినగర్‌లో కార్డన్ సెర్చ్

సీతమ్మధార, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ 45వ వార్డు సత్యసాయినగర్‌లో నాలుగో పట్టణ పోలీసులు శుక్రవారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఆ ప్రాంతంలోని ఇళ్లు, వాహనాలను తనిఖీ చేశారు. ద్విచక్ర వాహనాలను తనిఖీ చేసి ఎటువంటి పత్రాలు లేని 12 బైకులు, స్కూటీని సీజ్ చేశారు. కార్డన్ సెర్చ్‌లో 35 మంది పోలీసులు పాల్గొన్నారు.

‘బుద్ధునితో నా ప్రయాణం’ నాటక ప్రదర్శన రేపు


బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న బుద్ధిష్ట్ సంఘం ప్రతినిధులు

సీతమ్మధార, జూలై 25 (ఆంధ్రజ్యోతి): బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా (బీఎస్ఐ) ఆధ్వర్యంలో ‘బుద్ధునితో నా ప్రయాణం’ తెలుగు నాటకాన్ని నగరంలోని బుల్లయ్య కళాశాల సమీపంలోని అంబేడ్కర్ భవన్‌లో ఈ నెల 27న సాయంత్రం ప్రదర్శించనున్నట్లు బీఎస్ఐ జిల్లా అధ్యక్షుడు బత్తుల గౌతంబాబు తెలిపారు. లతా రాజా ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.50 లక్షల ఖర్చుతో రూపొందించిన ఈ నాటకాన్ని విశాఖలో ఉచితంగా ప్రదర్శిస్తున్నామని పేర్కొన్నారు. శుక్రవారం జరిగిన మీడియా సమావేశంలో పోస్టర్‌ను ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ హైదరాబాద్‌కు చెందిన అభ్యుదయ ఆర్ట్స్ అకాడమీ 40 మంది కళాకారులతో ఈ నాటకాన్ని ప్రదర్శిస్తుందన్నారు. బుద్ధుని జీవిత చరిత్రతో పాటు బుద్ధియిజం భారతదేశానికి ఎందుకు అవసరమనే అంబేడ్కర్ ఆలోచనలను ఈ నాటకంలో చక్కగా ప్రదర్శిస్తున్నారని తెలిపారు. సామాజిక న్యాయం లక్ష్య సాధనలో భాగంగా ఈ కార్యక్రమం జరుగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు బొడ్డు కల్యాణరావు, ప్రధాన కార్యదర్శి జేవీ ప్రభాకర్, కె.సత్యనారాయణ, బి.ఉమామహేశ్వరి, కె.వేంకటేశ్వరరావు, పి.తిరుమల కుమార్, వేణుగోపాల్ పాల్గొన్నారు.

హైవే సర్వీసు రోడ్డులో ప్రయాణ ఇబ్బందులు

మాధవధార, జూలై 25 (ఆంధ్రజ్యోతి): నగరంలోని హైవే సర్వీసు రోడ్లలో భారీ వాహనాల పార్కింగ్‌తో వాహనదారులు నిత్యం అవస్థల పాలవుతున్నారు. రోడ్డు సగానికి ఆక్రమిస్తూ వారి వ్యక్తిగత వ్యాపార కార్యకలాపాలు సాగిస్తుండటంతో ఆటోలు, ద్విచక్రవాహనాలు, కార్లు సైతం ఎదురెదురుగా వచ్చినపుడు వాహనాలు దారిపొడవునా నిలిచిపోతున్నాయి. ఉదయం స్కూళ్లు, కాలేజీలు, ఉద్యోగ విధుల్లోకి చేరేవారు ఆదరాబాదరాగా పోయే సమయంలో ఆర్టీఏ కార్యాలయం రోడ్డు, ఆర్అండ్‌బి సర్వీసు రోడ్డు, బిర్లా జంక్షన్ ప్రాంతాల్లో భారీ వాహనాలు ట్రాఫిక్ జామ్ సృష్టిస్తున్నాయి. ఈ ప్రాంతంలో ప్రధానంగా ఎక్కువగా ఉండే కార్ల షోరూమ్స్‌కి వాహనాల్ని తీసుకొచ్చే ఇతర రాష్ట్రాల భారీ ట్రక్కులు, పేరొందిన కంపెనీల షోరూమ్‌ల ఎదుటే హైవే సర్వీసు రోడ్ లో నిలిపేసి అన్‌లోడింగ్ కార్యకలాపాలు సాగిస్తున్నారు. మరో వైపు ఆర్టీఏ కార్యాలయ పనులపై వచ్చే వాహనాలు, ఆర్అండ్‌బి ఆఫీసు ప్రక్కనే ఉన్న ఎయిర్‌పోర్ట్ జోన్ పోలీసు స్టేషన్ వద్ద కేసుల నిమిత్తం నిలిచిపోతున్న వాహనాలు కలగలసి దారికి అడ్డంగా మారుతున్నాయి. వాహనాలు, పాదచారులు తిరిగే హైవే సర్వీసు రోడ్లను కుదించేస్తున్నాయి. ఈ సమస్యను ట్రాఫిక్ పోలీసులు చక్కదిద్దాలని ఈ ప్రాంతాల ప్రయాణికులు, నివాసితులు కోరుతున్నారు.

సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యే, కమిషనర్లకు వినతి


ఎమ్మెల్యే వంశీకృష్ణ, జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్‌లకు వినతిపత్రాలు అందజేస్తున్న జనసేన నాయకులు

మహారాణిపేట, జూలై 25 (ఆంధ్రజ్యోతి): మహారాణిపేటలోని 29వ వార్డులో అభివృద్ధి పనులు చేపట్టాలని జనసేన నాయకులు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం దక్షిణ నియోజకవర్గ శాసనసభ్యుడు వంశీకృష్ణ శ్రీనివాస్‌కు, జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్‌లకు వినతిపత్రాలు అందజేశారు. దండుబజారు, ఆంధోనీనగర్, అంగటిదిబ్బ, రామజోగిపేట తదితర ప్రాంతాలు అభివృద్ధి చేసి స్థానికుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. జనసేన ఇన్‌చార్జి డి.శివప్రసాద్‌రెడ్డి, వార్డు అధ్యక్షుడు అంగటి శ్రావణకుమార్, మాజీ కార్పొరేటర్ బుద్దల అనురాధ ఎమ్మెల్యేను కలిసినవారిలో ఉన్నారు.

ముస్లిం సమాజానికి పూర్తి మద్దతు

డాబాగార్డెన్స్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ముస్లిం సమాజ అభ్యున్నతికి తన పూర్తి మద్దతు ఉంటుందని దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే సీహెచ్ వంశీకృష్ణ శ్రీనివాస్ భరోసా ఇచ్చారు. 31వ వార్డులోని పోలీస్ బ్యారెక్స్‌లో మసీదు నిర్మాణానికి శుక్రవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మసీదు అధ్యక్షుడు మహ్మద్ సలీమ్, ఇమామ్ ముఫ్తీ ఉర్ రెహ్మాన్, మహ్మద్ సాదిక్, జనసేన నాయకులు శివప్రసాద్‌రెడ్డి, 31వ వార్డు నాయకులు రూప, ఎం.శ్రీనివాస్, వెంకటేష్, రాజేష్, సత్తిబాబు, గుణ, విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

పార్కు నిర్వహణ మూన్నాళ్ల ముచ్చటేనా?

» చాకలిపేటలో కళావిహీనంగా పార్కు


పార్కులోపల దుస్తులు ఆరబెట్టుకున్న దృశ్యం


26వ వార్డులోని పార్కు ప్రధాన ద్వారం

అక్కయ్యపాలెం, జూలై 25 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 26వ వార్డు చాకలిపేట, శంకువానిపాలెంలోని పార్కు నిరుపయోగంగా ఉంది. దీనిలో బెంచ్‌లు విరిగిపోయాయి. ఈ పార్కును గత ఏడాది మార్చి 14న రూ.16.3 లక్షలతో నిర్మించి అప్పటి మేయర్ గొలగాని హరి వెంకటకుమారి ప్రారంభించారు. ప్రారంభంలో స్థానికులు ప్రభాత నడకకు వినియోగించేవారు. కానీ ప్రస్తుతం పార్కులో కూర్చొని సేద తీర్చుకునేందుకు బెంచీలు విరిగిపోయి ఉన్నాయి. పార్కును ప్రారంభించడమే తప్ప నిర్వహణ గురించి పట్టించుకోలేదని స్థానికులు వాపోయారు. ఈ పార్కు ఉపయోగం లేకుండాపోయిందని, బెంచీలు విరిగిపోయినా ఎవరూ పట్టించుకోవడం లేదని స్థానికులు మండిపడుతున్నారు. ఈ పార్కులో కొందరు ఉతికిన దుస్తులు ఆరేస్తున్నారు. ఆకతాయిలు వచ్చి మద్యం తాగుతున్నారని స్థానికులు చెబుతున్నారు. ఈ పార్కును పరిరక్షించి నిర్వహణ చేపట్టాల్సిన జీవీఎంసీ అధికారులు పట్టించుకోవడం లేదని అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పార్కు ప్రారంభ సమయంలో విద్యుత్ దీపాలు, బెంచ్‌లు ఆకర్షణీయంగా కనిపించేవి. వాటిని పర్యవేక్షించాల్సిన అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని స్థానికులు పేర్కొంటున్నారు. బెంచ్‌లు విరిగి రోజులు గడిచినా జీవీఎంసీ అధికారులు పట్టించుకోకపోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా పార్కు వినియోగానికి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

2,631 మంది వితంతువులకు పింఛన్లు మంజూరు

» జిల్లాలో పెన్షన్‌దారులు 1,60,778 మంది...

విశాఖపట్నం, జూలై 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అందించే సామాజిక పింఛన్ తీసుకుంటూ మరణించిన వారి భార్యకు కొత్తగా వితంతు పింఛన్ మంజూరుచేశారు. జిల్లాలో 2,631 మందికి పెన్షన్ మంజూరైనట్టు అధికారులు తెలిపారు. 2023 నుంచి భర్త మరణించిన వారికి పింఛన్ల పంపిణీ నిలిపివేశారు. రెండేళ్ల నుంచి పింఛన్లు రాకపోవడంతో వారంతా ప్రభుత్వానికి పలు దఫాలుగా అర్జీలు పెట్టారు. ప్రభుత్వం స్పందించి రెండు నెలల క్రితం సర్వే చేసి జాబితాలు సిద్ధం చేసింది. ఈ నేపథ్యంలో వచ్చే నెల ఒకటో తేదీన వితంతు పింఛన్లు పంపిణీ చేయనున్నారు. దీనికి సంబంధించి సచివాలయాల వారీగా జాబితాలు అందాయి. కాగా ఆగస్టు నెలకు సంబంధించి జిల్లాలో 1,60,778 మందికి పింఛన్లు మంజూరుచేశారు. ఈ నెలాఖరున సచివాలయం వారీగా సొమ్ములు డ్రా చేసి ఆయా వర్గాలకు అందజేస్తారు.

అప్పన్నను దర్శించుకున్న వీఎంఆర్‌డీఏ చైర్మన్


ప్రణవ్‌గోపాల్‌ను సత్కరిస్తున్న తిరుమలేశ్వరరావు

సింహాచలం, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామిని వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్ శుక్రవారం దర్శించుకున్నారు. ఆయనకు ఏఈఓ తిరుమలేశ్వరరావు స్వాగతం పలికారు. కప్ప స్తంభాన్ని ఆలింగనం చేసుకున్న ప్రణవ్ గోత్రనామాలతో అంతరాలయంలో అర్చకులు పూజలు చేశారు. గోదాదేవి దర్శనం తరువాత పండితులు ఆశీర్వచనాలీయగా ఏఈఓ శాలువతో సత్కరించి, స్వామివారి ప్రసాదాలు, ఫొటోను అందజేశారు.

500 కోట్లతో ఆలయాల పునర్నిర్మాణం

... 5వ పేజీ తరువాయి

పదోన్నతులు కల్పిస్తామని, తద్వారా పూర్తిస్థాయి అధికారుల నియామకం జరుగుతుందన్నారు. దేవాలయాల భద్రతలో మార్పులు తీసుకువస్తున్నామని, త్వరలో ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. ప్రధాన ఉత్సవాల వేళ ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకుని, ప్రమాదాలు సంభవించకుండా తగిన వ్యవస్థను రూపొందిస్తున్నట్టు చెప్పారు. ఆయా ఆలయాల స్థితిగతులను అధ్యయనం చేసి భక్తులకు వసతి సౌకర్యాన్ని అభివృద్ధి చేసేందుకు మాస్టర్‌ప్లాన్ రూపొందించి, పనులు చేపడతామన్నారు. ఎన్ఎంఆర్‌ల క్రమబద్ధీకరణ సమస్య రాష్ట్రవ్యాప్తంగా ఉందని, ఏళ్లుగా పనిచేస్తున్న వారిని తొలగించే ప్రసక్తే లేదని, వారికి న్యాయం చేసేందుకు కట్టుబడి ఉన్నామన్నారు. అర్చకులు జీవితకాలం పనిచేసే విధంగా ప్రభుత్వం జారీచేసిన ఆదేశాలను సవరించాలని దేవాలయ స్థానాచార్యులు, ప్రధానార్చకులు మంత్రికి సూచించారు. దీనివల్ల భవిష్యత్తులో వైదిక వృత్తిలోకి యువత ప్రవేశించేందుకు దారులు మూసుకుపోతాయన్నారు. ఈ అంశంపై చర్చిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. చందనోత్సవం సమయంలో గోడ కూలిన ప్రాంతంలోని మెట్లను తక్షణమే పునరుద్ధరించాలని ఈఓను ఆదేశించారు. వరాహలక్ష్మీనృసింహస్వామిని దర్శనానికి వచ్చిన మంత్రి ఆనం రామనారాయణరెడ్డికి పూర్తి అధికార లాంఛనాలతో ఈఓ వేంద్ర త్రినాథరావు ఆహ్వానం పలికారు. మంత్రి గోత్రనామాలతో అంతరాలయంలో అర్చకులు పూజలు చేసి శేషవస్త్రాన్ని పర్యవేట్టంగా చుట్టారు. అనంతరం కప్పస్తంభం ఆలింగనం, గోదాదేవి అమ్మవారి సన్నిధిలో పూజలు తరువాత పండితులు చతుర్వేద స్వస్తి వచనాలతో ఆశీర్వచనాలీయగా, ఈఓ శాలువాతో సత్కరించి స్వామి చిత్రపటాన్ని, ప్రసాదాలను అందజేశారు. మంత్రిని దేవదాయ డిప్యూటీ కమిషనర్ ఎన్.సుజాత, ఏసీ అన్నపూర్ణ, కనకమహాలక్ష్మీ అమ్మవారి దేవస్థానం ఈఓ శోభారాణి మర్యాదపూర్వకంగా కలిశారు.

గంజాయిపై ఉక్కుపాదం

... 5వ పేజీ తరువాయి

వద్ద చెక్‌పోస్టులను ఏర్పాటుచేశారు. ప్రతి చెక్‌పోస్టు వద్ద ముగ్గురు లేదా నలుగురు సిబ్బంది ఉంటూ అన్ని ఆర్టీసీ బస్సులు, ప్రైవేటు బస్సులు, కార్లు, వ్యాన్‌లు, బైక్‌లతోపాటు అన్ని రకాల వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేస్తారు. ఒకవేళ అక్కడ పోలీసులను చూసి ఎవరైనా వాహనం ఆపకుండా ముందుకువెళ్లిపోతే వారిని పట్టుకునేందుకు వీలుగా రెండు ప్రత్యేక లార్కింగ్ (మొబైల్) చెక్‌పోస్టులను ఏర్పాటుచేశారు. ఆయా చెక్‌పోస్టుల వద్ద మూడు షిఫ్టుల్లో నిరంతరం పనిచేసేలా సిబ్బందిని నియమించారు. దీంతో నగరంలోకి గంజాయి రవాణా తగ్గుతుందని ఆశిస్తున్నట్టు సీపీ శంఖబ్రతబాగ్చి వివరించారు. గంజాయి రహిత నగరంగా విశాఖను తీర్చిదిద్దేందుకు మరికొన్ని చెక్‌పోస్టులను కూడా ఏర్పాటుచేసే ఆలోచన ఉందని, సిబ్బంది కొరత వల్ల ప్రస్తుతానికి వేచిచూస్తున్నామన్నారు.

ఉక్కు ఉద్యోగులకు శిథిల క్వార్టర్లు!

... 5వ పేజీ తరువాయి

మూడు నెలల్లో రిటైరయ్యేవారు ఇప్పుడు కుటుంబాన్ని క్వార్టర్‌లోకి మార్చే అవకాశం లేదు. పైగా అక్కడ సదుపాయాలు లేవు. యాజమాన్యం చెప్పినట్టు క్వార్టర్‌లో ఉండలేరు. బయట ఉంటే హెచ్ఆర్ఏ ఇవ్వరు.

స్టీల్ ప్లాంటుకు ఎనిమిది కి.మీ. దాటి ఉన్నవారికే క్వార్టర్లు ఇస్తారు. అంతకంటే తక్కువ దూరంలో ఉన్న వారికి ఇవ్వరు. గతంలో తప్పుడు సమాచారం ఇచ్చి క్వార్టర్‌లో చేరారని ఆరోపిస్తూ చాలామందిని బయటకు పంపించేశారు. ఇప్పుడు అలాంటి వారందరినీ క్వార్టర్లలోకి రమ్మంటున్నారు. కనీసం మరమ్మతులు కూడా చేపట్టకుండా వాటిని కేటాయిస్తున్నారు. టౌన్‌షిప్ నిర్వహణకు కూడా సరిగ్గా నిధులు ఇవ్వడం లేదు. వాస్తవానికి వాటిని కూల్చివేసి కొత్తవి నిర్మించాలి. వాటి పుస్తక విలువ కూడా జీరో అయిపోయి చాలా కాలమైంది. భారీవర్షాలు కురిసి ఏదైనా క్వార్టర్ కూలిపోతే కుటుంబం పరిస్థితి ఏమిటో యాజమాన్యమే చెప్పాలి. ఇటీవల ఓ ఉద్యోగి క్వార్టర్‌లో పాము కరిచి మరణించారు. దీంతో క్వార్టర్లలో ఉండడానికి అంతా భయపడుతున్నారు.

తప్పనిసరై ఆశ్రయించాం

న్యాయం కోరుతూ హైకోర్టులో రిట్ పిటిషన్ వేసిన మాట వాస్తవమే. స్టే ఆర్డర్ ఇవ్వాలని కోరాము. అయితే ఈ విషయం న్యాయస్థానం పరిధిలో ఉన్నందున ఇంతకు మించి మాట్లాడలేము.

- కేవీడీ ప్రసాద్, సెక్రటరీ, స్టీల్ ఎగ్జిక్యూటివ్స్ అసోసియేషన్

రూ.1.29 కోట్ల బంగారం, వజ్రాలతో ఇద్దరి అరెస్టు

... 5వ పేజీ తరువాయి

మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్‌గా చేరాడు. షోరూమ్‌లోని డైమండ్, బంగారు ఆభరణాల మోడల్స్‌ను విశాఖలోని వివిధ గోల్డ్ షోరూమ్‌లలో చూపించేందుకు అదే సంస్థలో పనిచేస్తున్న బొగ్గు వంశీ అనే మరో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్‌తో కలసి ఈ నెల మూడో తేదీన విశాఖపట్నం వచ్చారు. ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదురుగా ఉన్న హోటల్‌లో గది తీసుకొని ఇద్దరూ బస చేశారు. ఆరోజు వివిధ షోరూమ్‌లలో ఆభరణాల మోడల్స్ చూపించి తిరిగి తీసుకువచ్చారు. మరుసటిరోజు తెల్లవారుజామున సుమారు ఐదు గంటల సమయంలో తనతో పాటు వచ్చిన వంశీ నిద్రిస్తున్న సమయంలో ముదపాక జేజి ఆభరణాల బ్యాగ్‌తో పరారయ్యాడు. నిద్ర నుంచి లేచి చూసిన వంశీకి జేజితో పాటు ఆభరణాల బ్యాగ్ కనిపించలేదు. సీసీ ఫుటేజీలు పరిశీలించి బ్యాగ్‌తో పరారైనట్టు గుర్తించి వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు సీఐ ఉమాకాంత్ ఆధ్వర్యంలో దర్యాప్తు చేపట్టారు. శుక్రవారం ఉదయం రైల్వే ట్రాక్ వద్ద అనుమానాస్పదంగా ఇద్దరు బ్యాగ్‌తో కనిపించడంతో వారిని అదుపులోకి తీసుకొని తనిఖీచేశారు. ఆభరణాలు కనిపించడంతో వాటిని స్వాధీనం చేసుకున్నారు. అందులో ఒకరు ముదపాక జేజి కాగా మరొకరి పేరు ఆకుల సత్యనారాయణ. ఇద్దరినీ అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వారి వద్ద నుంచి రూ.1,29,48,154 విలువైన వజ్రాలు, బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్టు కమిషనర్ బాగ్చి పేర్కొన్నారు.

హెల్త్‌సిటీ సమీపాన ఎంఎస్ఎంఈ పార్క్

... 5వ పేజీ తరువాయి

రెండు ఎకరాలు తీసుకుంటున్నామన్నారు. అమెరికా పౌరులకే ఉద్యోగాల్లో ప్రాధాన్యం అంటూ ఆ దేశ అధ్యక్షుడు ట్రంప్ చేసిన వ్యాఖ్యల ప్రభావం ఏపీపై ఎంతవరకు ఉంటుందని ప్రశ్నించగా, దానిని పాజిటివ్‌గా తీసుకోవాలని మంత్రి సూచించారు. అమెరికా ఒక్కటే ఉద్యోగాలు ఇవ్వదని, ప్రపంచంలో అనేక దేశాలు ఉన్నాయని, టెక్నాలజీలో ఏపీ అగ్రస్థానాన ఉందని, ఏఐలో కూడా టాప్‌లో ఉన్నామని, ఆయా దేశాలే ఉద్యోగ అవకాశాలు ఇవ్వడానికి ముందుకు వస్తాయన్నారు. విశాఖ మెట్రో రైలు కారిడార్ తొలి దశ ఇప్పుడు ప్రారంభమవుతుందని, మలి దశలో భోగాపురం విమానాశ్రయం వరకూ వేస్తారన్నారు. అదేవిధంగా విజయనగరం వైపు కూడా కనెక్టివిటీ ఇవ్వాలని సీఎం చంద్రబాబునాయుడును కోరామని, రెండు నగరాలు దాదాపుగా కలిసి పోతున్నందున అది కూడా అవసరమన్నారు.



కార్యాలయంలో ఉద్యోగుల పనితీరును పరిశీలిస్తున్న కమిషనర్ కేతన్ గార్గ్

జోనల్ కార్యాలయంలో జీవీఎంసీ కమిషనర్ తనిఖీలు

గాజువాక, జూలై 25 (ఆంధ్రజ్యోతి): గాజువాక జోనల్ కార్యాలయంలో శుక్రవారం జీవీఎంసీ కమిషనర్ కేతన్ తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మరమ్మతులకు గురైన వాటికి అంచానాలు వేసి ప్రణాళిక రూపొందించాలని ఇంజనీర్లను ఆదేశించారు. కార్పొరేటర్లు రాజాన రామారావు, పులి లక్ష్మీబాయి తమ వార్డుల్లో సమస్యలును వివరించారు. వాటి పరిష్కారానికి కృషి చేస్తానని కమిషనర్ హామీ ఇచ్చారు. రెవెన్యూ వసూళ్లపై దృష్టిసారించాలన్నారు. కార్యాలయంలో అధికారులు పనితీరుపై ఆరా తీశారు. అనంతరం 69వ వార్డు తుంగ్లాంలోని క్రీడా స్థలాన్ని పరిశీలించి, అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

జడ్పీ హైస్కూల్లో నేత్ర వైద్య శిబిరం

అగనంపూడి, జూలై 25 (ఆంధ్రజ్యోతి): నేత్ర సమస్యల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని ఎంఈవో సాయిశైలజ సూచించారు. పినమడక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విజన్ కేర్ ఆధ్వర్యంలో శుక్రవారం నేత్ర వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కంటి చూపులో ఎటువంటి సమస్యలున్నా తక్షణమే వైద్యులను సంప్రతించాలన్నారు. విద్యార్థుల కోసం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. అనంతరం వైద్యులు విద్యార్థులను పరీక్షించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం బ్రహ్మానందం, విజన్‌కేర్ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

భవిత కేంద్రంలో స్పీచ్ థెరపీ

మల్కాపురం, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : మల్కాపురం జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన భవిత కేంద్రంలో శుక్రవారం స్పీచ్ థెరపీ నిర్వహించారు. స్పీచ్ సమస్య ఉన్న 15 మంది విద్యార్థులకు భాష ఉచ్చరణ గురించి ఐఈ ఆర్పీ ఉపాధ్యాయులు వివరించారు.ఈ కార్యక్రమంలో ములగాడ మండల విద్యా శాఖ అధికారులు త్రినాథ్, వెంకట్రావ, పాఠశాల హెచ్ఎం అరుణకుమారి, తదితరులు పాల్గొన్నారు.

మాజీ మంత్రి అప్పలనాయుడుకి నివాళి

పెందుర్తి, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : పెందుర్తిలోని గౌరీ సేవా సంఘం భవనంలో మాజీ మంత్రి ఎస్ఆర్ఏఎస్ అప్పలనాయుడు 29వ వర్ధంతి శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైసీపీ రూరల్ జిల్లా మాజీ అధ్యక్షుడు శరగడం చిన అప్పలనాయుడు, తదితరులు ఎస్ఆర్ఏఎస్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ అప్పలనాయుడు పెందుర్తి అభివృద్ధికి చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో గౌరీ సేవా సంఘం అధ్యక్షుడు వేగి పరమేశ్వరరావు. ఆడారి రమేశ్‌నాయుడు, ,శరగడం శ్రీను,, తదితరులు పాల్గొన్నారు

సినిమా గైడ్

● **హరిహర వీరమల్లు** : జగదాంబ, శారద, రమాదేవి, మెలోడి, వెంకటేశ్వర, శ్రీ వెంకటేశ్వర, లీలామహల్, సంగం, శ్రీరామా, కిన్నెర, కామేశ్వరి, శ్రీకన్య, గోకుల్, శ్రీకాంతి, ఊర్వశి (కంచరపాలెం), సౌజన్య సుకన్య (గోపాలపట్నం), మౌర్య, నరసింహ (గోపాలపట్నం), నటరాజ్ (పెందుర్తి), మోహిని, మినీ మోహిని (గాజువాక), శ్రీకన్య కన్య, శ్రీకన్య హెవెన్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ)

● **జూనియర్** : శరత్, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా),

● **తమ్ముడు** : లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 21, టమాటా 42, వంకాయలు (తెలుపు) 28, వంకాయలు (నలుపు) 32, బెండకాయలు 30, పచ్చిమిర్చి 76, కాకరకాయలు 28, బీరకాయలు 32, ఆనపకాయ 14,కాలీఫ్లవర్ 34, క్యాబేజి 24, క్యారెట్ 46, దొండకాయలు 26, బంగాళ దుంపలు 16, అరటికాయ (పె)10, మునక్కాడలు (కిలో) 42, అల్లం (పాతది) 62, బరబాటి 30, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 50, బద్దచిక్కుడు 50, దోస కాయలు 14, వెల్లుల్లి (పెద్దవి) 80, కొబ్బరికాయ (పెద్దది) 30, బీన్స్ (పెన్సిల్) 62, కీరదోస 30, కాప్సికమ్ 80, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 36, చిలగడదుంపలు 44, కంద 42, గోరు చిక్కుడు 42, కూర పెండలం 30, బ్రకోలి 45, పనసపొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, పాల కూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 20, బూడిదగుమ్మడికాయ 20, కర్రపెండలం 24, మామిడి అల్లం56, బొప్పాయి 36, జామకాయలు 80.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)	
విశాఖపట్నం	540
విజయనగరం	544
శ్రీకాకుళం	544

చికెన్ ధరలు బ్యాగ్	
రైతు ధర	85
లైవ్ ధర	105
విత్ స్కిన్	180
స్కిన్‌లెస్	190

భక్తి శ్రద్ధలతో శ్రావణ మాసం పూజలు

కూర్మన్నపాలెం, జూలై 25 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 86, 87, 88 వార్డుల్లో శ్రావణమాస తొలి శుక్రవారాన్ని పురస్కరించుకుని కాశీ అన్నపూర్ణా దేవి, మహాలక్ష్మి, దుర్గాలమ్మ, నూకాలమ్మ, పోలిపిల్లమ్మ కనకగుర్గమ్మ అమ్మవార్లను ఆలయ అర్చకలు ప్రత్యేక అలంకరణ చేశారు. ఈ సందర్భంగా అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. పరిసర ప్రాంతాల నుంచి భక్తులు వచ్చి అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. 86 వార్డులో ఆలయ ధర్మకర్త దామా సుబ్బారావు, దమయంతి అమ్మవారికి పూజలు చేశారు. 87వ వార్డులో కర్పొరేటర్ బొండా జగన్ ప్రత్యేక పూజలు చేశారు. ఈ పూజా కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.



ప్రత్యేక అలంకరణలో కనక దుర్గమ్మ



ప్రత్యేక అలంకరణలో మంగాదేవి మ్మవారు



నాగేంద్రకాలనీలోని సంతోషిమాత ఆలయంలో కలశ పూజ

ఆటోనగర్‌లో...

జీవీఎంసీ 70వ వార్డు డ్రైవర్స్ కాలనీలో కనక దుర్గమ్మవారికి ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మహిళలు లలితా సహస్ర నామ పారాయణం చేశారు. అలాగే ఎల్‌వీ నగర్‌లో దు ర్గమ్మ ఆలయంలో అమ్మవారిని స్వర్ణాభరణాలతో అ లంకరించి ప్రత్యేపూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నా రు.

ఆలయాల్లో సందడి..

ఉక్కుటౌన్‌షిప్ : శ్రావణమాస తొలి శుక్రవారం సదర్భంగా స్టీల్‌ప్లాంట్ త్రిశక్తి ఆలయంలో అమ్మవార్లకు ఘనంగా పూజలు చేశారు. ఈ సంద ర్భంగా వేకువజామునే ఆలయంలో మహాదుర్గ, మహాలక్ష్మి, మహా సరస్వతి అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాలకు పరిసర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. శ్రావణమాసంలో రోజూ ప్రత్యేక పూజలు చేస్తామని ఆలయ అర్చకులు తెలిపారు.

దుర్గమాంబ ఆలయంలో పూజలు..

అగనంపూడి : జీవీఎంసీ 85వ వార్డులో అగనంపూడి ఉక్కు నిర్వాసిత గ్రామాల ఆరా. ధ్య దేవత దుర్గమాంబ ఆలయంలో శ్రావణ శుక్రవా రాన్ని పురస్కరించుకుని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక అలంకరించారు. పరిసర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మహిళలు లలితా పారాయణం, విష్ణుసహస్ర నామ పారాయణాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పెందుర్తిలో..

పెందుర్తి : చినముషిడివాడ సప్తగిరినగర్‌లో కొలువైన అలివేలు మంగాదేవి ఆలయంలో శ్రావణ శుక్రవారం పూజలు ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి, సహస్రనామ అర్చనలు జరిపారు. మధ్యాహ్నం ఆలయ ఆవరణలో భక్తులకు అన్న సమారాధన ఏర్పాటు చేశారు. అలాగే వెంకటాద్రి శిఖరం దిగువన ఉన్న మహాకామేశ్వరీ జ్యోతిర్లింగాలయంలో మహాకామేశ్వరి అమ్మవారికి విశేష పూజలు జరిపారు. ఎస్ఆర్‌పురంలో కొలువైనదుర్గాదేవి ఆలయంలోనూ ప్రత్యేక పూజలు నిర్వహించారు.

గోపాలపట్నంలో..

గోపాలపట్నం : గోపాలపట్నం పరిసర ప్రాంతాల్లోని అమ్మవార్ల ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. నాగేంద్ర కాలనీలోని సంతోషిమాత ఆలయంలో జరిగిన సాముహిక కలశ పూజల్లో పదుల సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. అనంతరం ఆలయ ఆవరణలో జరిగిన అన్నసమారాధనలో వెయ్యి మంది భక్తులు అమ్మవారి ప్రసాదాన్ని స్వీకరించారు. సాయంత్రం కలశాలతో ఊరేగింపు చేపట్టారు.

కల్యాణ వెంకన్న ఆలయంలో..

వేపగుంట : నాయుడుతోటలోని రవినగర్ శేషాద్రి కొండపై కొలువైన కల్యాణ వేంకటేశ్వర ఆలయంలో సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు. నిర్వాహకులు భక్తులకు పూజ సామగ్రితో పాటు అమ్మవారి ప్రతిమ అందజేశారు. శేష వాహనంపై శ్రావణ మహాలక్ష్మిగా గోదాదేవి అలంకరణ ఆకట్టుకుంది. భక్తులకు ఇబ్బందులు లేకుండా కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

‘ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కూటమి పాలన’

కూర్మన్నపాలెం, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ పాలనలో ధ్వంసమైన రాష్ట్రాన్ని కూటమి ప్రభుత్వం అభివృద్ధి చేస్తోందని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్ అన్నారు. రాష్ట్రాన్ని స్వర్ణాంధ్రగా తీర్చిదిద్దే దిశగా కూటమి ముందుకు సాగుతోందని అన్నారు. జీవీఎంసీ 87వ వార్డులో శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డులో పర్యటించి ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కూటమి అడుగులు వేస్తోం దని తెలిపారు.

దశల వారీగా పథకాలు అమలు

పెదగంట్యాడ : ప్రజలకు ఇచ్చిన హామీలను దశలవారీగా అమలు చేస్తున్నారని 75వ వార్డు టీడీపీ కమిటీ నాయకులు పేర్కొన్నారు. శుక్రవారం వార్డులో నిర్వహించిన తొలి అడుగు కార్యక్రమంలో స్థానిక నాయకులు ఇంటింటికి వెళ్లి ఏడాదిలో కూటమి ప్రభుత్వం అమలు చేసిన పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుని, కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు నమ్మి అప్పారావు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

కూటమితోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యం

అగనంపూడి : కూటమితోనే రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం సాధ్యపడుతుందని 85వ వార్డు టీడీపీ శ్రేణులు తెలి పారు. ఈ సందర్భంగా వార్డులో శుక్రవా రం నిర్వహించిన‘తొలిఅడుగు’ కార్యక్రమంలో స్థానిక నాయకులు ఇంటింటికి వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలు సుకున్నారు. ఏడాదిలో కూటమి అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి ప్రజలకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

పెందుర్తి : జీవీఎంసీ 97వ వార్డు పరిధిలోని చిన ముషిడివాడలో టీడీపీ నాయకులు శుక్రవారం సుపరిపాలనకు తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ సేనాపతి వసంత శంకరరావు, టీడీపీ యువ నాయకుడు గండి వంశీదీప్ ఇంటింటికి వెళ్లి ఏడాదిలో ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు.



75వ వార్డులో కరపత్రాలు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు

పనిచేయని అధికారులపై చర్యలు

ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు

పెందుర్తి, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల అమలులో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు హెచ్చరించారు. శుక్రవారం ఆయన సుజాతనగర్‌లో పెందుర్తి, సబ్బవరం, పరవాడ మండలాలకు చెందిన పలు శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేయడంలో కొంత మేర నిర్లక్ష్యం గోచరిస్తుందన్నారు. గ్రామాల్లో జాబ్ కార్డు ఉన్న ప్రతిఒక్కరికి ఉపాధి పని కల్పించాలని చెప్పారు పెందుర్తి, సబ్బవరంలో ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురవుతున్నా రెవెన్యూ సిబ్బంది పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వానికి చెందిన గజం స్థలం ఆక్రమణకు గురైనా సహించేది లేదని హెచ్చరించారు. జల జీవన్ మిషన్ పథకం ద్వారా ఇంటింటికి తాగునీటి కుళాయిల పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. పంచాయతీరాజ్ నిధులతో సీసీ రోడ్లు, కాలువల నిర్మాణానికి ప్రతిపాదనలు తయారు చేసి, పనులు చేపట్టాలని ఆదేశించారు. అధికారుల సహకారంతోనే అభివృద్ధి సాధ్యమని చెప్పారు. అనంతరం సీఎం సహాయ నిధి కింద ఆరుగురికి రూ. 8. 50 లక్షలు చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గణబాబు

యువతకు ఉపాధి కల్పనే లక్ష్యం

» పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు

» 57వ వార్డులో మెగా జాబ్‌మేళా

ఆర్పీపేట (కంచరపాలెం). జూలై 25 (ఆంధ్రజ్యోతి) : యువతకు ఉపాధి కల్పించడమే కూటమి ప్రభుత్వం ప్రధాన లక్ష్యమని పశ్చిమ ఎమ్మెల్యే పి. గణబాబు అన్నారు. ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం 57వ వార్డు ఐటీఐ జంక్షన్ కల్యాణ మండపంలో మెగా జాబ్‌మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతకు ఉపాధి కల్పించడమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నేతృత్వంలో విశాఖకు మరిన్ని ప్రఖ్యాత కంపెనీలు వచ్చాయన్నారు. భవిష్యత్‌లో మరిన్ని ప్రముఖ సంస్థలు విశాఖలో ఏర్పాటై ఉద్యోగాలు పుష్కలంగా లభిస్తాయని చెప్పారు. యువత ఆత్మస్థైర్యంతో నైపుణ్యాలను, నాయకత్వ లక్షణాలను అభివృద్ధి చేసుకుని ముందుకు సాగాలని సూచించారు. ఉద్యోగాన్వేషణ నుంచి ఉద్యోగాలు కల్పించే స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. కాగా జాబ్‌మేళాలో సుమారు 11 కంపెనీల ప్రతినిధులు పాల్గొని యువతకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధి కల్పనాధికారులు శరగడం రాజశేఖర్, పెంటకోట అజయ్‌బాబు, కుట్టా కార్తీక్, బండారు అప్పలరాజు, ముద్రువాణి, టాస్ హరి, జిల్లా నైపుణ్య సంస్థ అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా ఫ్రెషర్స్ డే

మల్కాపురం, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : మహిళలు అన్ని రంగాల్లో రాణించేందుకు టెక్నాలిజీని ఉపయోగించాలని జేఎన్‌టీయూ విజయనగరం రిజిస్ట్రార్ ఆచార్య జయసుమ అన్నారు. స్థానిక సెయింట్ ఆన్స్ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన ఫ్రెషర్స్ డే,సెయింట్ ఆన్స్ ఫీస్ట్ సాంస్కృతికోత్సవంలో ఆమె మాట్లాడారు. కృత్రిమ మేధస్సును మహిళలు తమ రక్షణకు, సాధికారతకు వినియోగించుకోవాలని చెప్పారు. విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ జనరల్ మేనేజర్ (హెచ్ఆర్) కె. సంజీవరావు మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఏర్పాటు చేసుకుని, వాటి సాకారం కోసం నిరంతరం శ్రమించాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ ప్రేమకుమారి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కరస్పాండెంట్ సిస్టర్ గెసిల్లా,జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సిస్టర్ కెస్లిన్, అధ్యాపకులు, పాల్గొన్నారు.

అప్పన్న నిత్య కల్యాణం

సింహాచలం, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి ఆర్జిత నిత్య కల్యాణం శుక్రవారం నేత్రపర్వంగా సాగింది. వేకువజామున సుప్రభాత సేవ, ప్రభాతారాధనల తరువాత ఉత్సవమూర్తి గోవిందరాజ స్వామిని, ఉభయ దేవేరులను శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక వేదికపై అధిష్టింపజేశారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి కల్యాణ క్రతువు జరిపారు.

రైతుల రికార్డుల పరిశీలన

వేపగుంట, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : వేపగుంటలో వీఎంఆర్‌డీఏ (ఉడా) భూముల వివాదానికి సంబంధించి రైతులు రికార్డుల పరిశీలన శుక్రవారం కూడా కొనసాగింది. భూములకు సంబంధించిన రికార్డులను రైతులు తీసుకురాగా అధికారులు తమ రికార్డుల్లో ఉన్న పేర్లు, ఇతర వివరాలు చూసి నోట్ చేసుకున్నారు. ప్రస్తుతం కొనుగోలుదారుల వివరాలను కూడా నమోదు చేసుకున్నారు. రికార్డుల పరిశీలన శనివారం కూడా ఉంటుందని అధికారులు తెలిపారు.ఈ కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ బల్ల శ్రీనివాసరావు, ఉడా డీటీ భారతి, ఎస్టేట్ ఆఫీసర్ దయానంద్, తదితరులు పాల్గొన్నారు.

కూరగాయల నారు పంపిణీ



నారు మొక్కలు పంపిణీ చేస్తున్న ఎన్జీవో సంస్థల ప్రతినిధులు

గోపాలపట్నం, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : మిద్దె తోటల పెంపకానికి ప్రతిఒక్కరూ ముందుకు రావాలని గ్రీన్ క్లైమేట్ వ్యవస్థాపక కార్యదర్శి జేవీ రత్నం పిలుపునిచ్చారు. వనమాలి, సిటిజి, మన కూరల తోట సంస్థలకు చెందిన ప్రతినిధులు మిద్దె తోటలు పెంచే సభ్యులకు వంగ, మిర్చి, టమాటా, బంతి మొక్కల నారును శుక్రవారం పంపిణీ చేశారు. దేశీ విత్తనాలతో మిద్దె తోటల్లో కూరగాయల పెంపకం చేపట్టి విశాఖను మిద్దె తోటల నగరంగా తీర్చిదిద్దాలని సంస్థ ప్రతినిధులు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధి నాదెళ్ల జ్యోతి, ఎన్‌జీవో సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

గోపాలపట్నం, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : ప్రతిఒక్కరూ వారంలో ఒక రోజు డ్రై డే పాటించి వ్యాధులకు దూరంగా ఉండాలని 89వ వార్డు కార్పొరేటర్ దాడి వెంకటరమేశ్ పిలుపునిచ్చారు. వార్డు పరిధిలోని ఎల్లపువాని పాలెం గ్రామంలో సాంఘిక సంక్షేమ శాఖ బాలుర వసతి గృహంలో శుక్రవారం డ్రై డే-డ్రై డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వీధులను పరిశుభ్రంగా ఉంచడంలో ప్రజారోగ్య విభాగం సిబ్బందికి ప్రజలు సహరించాలని కోరారు. అలాగే దోమల నివారణకు ప్రజారోగ్య సిబ్బంది అందించే సూచనలు పాటించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో మలేరియా విభాగం సిబ్బంది, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

హెచ్‌పీసీఎల్ కో -ఆపరేటివ్ సొసైటీ ఆపద్ధర్మ అధ్యక్షుడిగా శ్రీనివాస్

మల్కాపురం, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : హెచ్‌పీసీఎల్ కో-ఆపరేటివ్ సొసైటీ పాలక వర్గంపై శుక్రవారం అవిశ్వాస తీర్మానం ప్రకటించారు. ఇప్పటివరకు అధ్యక్ష, కార్యదర్శులుగా ఉన్న నూనెల వెంకటరమణ, పైడిరాజును తొలగించగా, వారి స్థానంలో ఆపద్ధర్మ అధ్యక్షుడిగా సర్వసిద్ది శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా ధనంజయను ఎన్నుకున్నారు. సోమవారం నూతన కమిటీ ఎన్నిక జరగనుంది.

అభివృద్ధి పనులు ప్రారంభించాలని వినతి

అక్కిరెడ్డిపాలెం, జూలై 25(ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 69 వార్డులో 2024-25 సంవత్సరంలో మంజూరైన మంజూరైన అభివృద్ధి పనులు వెంటనే ప్రారంభించాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్‌ను కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి విన్నవించారు. ఈ సందర్భంగా శుక్రవారం కమిషనర్‌ను కార్యాలయంలో కలిసి గత ఆర్థిక సంవత్సరంలో 30కి పైగా అభివృద్ధి పనులకు అనుమతులు వచ్చాయని, వాటిల్లో ఒక్కదానికి కూడా శంకుస్థాపన జరకపోవడం బాధాకరమన్నారు. అధికారులు తక్షణమే స్పందించి వార్డు అభివృద్ధికి సహకరించాలని కోరారు.

‘అట్రాసిటీ చట్టాన్ని రక్షించుకోవాలి ’

సింధియా, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : అట్రాసిటీ చట్టాన్ని రక్షించుకోవాలని, ప్రతి దళిత కుటుంబానికి మూడు ఎకరాలు భూములు కల్పించాలని దళిత హక్కుల పోరాట సమితి (డీహెచ్‌పీఎస్) ప్రధాన కార్యదర్శి గుడాల రాంబాబు అన్నారు. జీవీఎంసీ 63వ వార్డు కాకరలోవ గ్రామం భగత్‌సింగ్ జంక్షన్‌లో శుక్రవారం జిల్లా సమితి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు అమలు చేయాలని కోరారు. అంబేడ్కర్ భవన్‌లో జరగనున్న 5వ జిల్లా మహాసభలకు పారిశ్రా మిక ప్రాంతంలో ఉన్న బలహీన వర్గాల ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డీహెచ్‌పీఎస్ సభ్యులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడి మృతికి ఎవరు బాధ్యత వహిస్తారు?

ఉక్కుటౌన్‌షిప్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దుర్మార్గానికి విశాఖ విమల విద్యాలయం ఉపాధ్యాయుడు బలైపోయారని, దీనికి ఎవరు బాధ్యత వహిస్తారని 78వ వార్డు కార్పొరేటర్ బి.గంగారావు ప్రశ్నించారు. 28 ఏళ్లగా ఇంగ్లీష్ ఉపాధ్యాయుడుగా పనిచేసిన మల్లాది రవికుమార్ అనారోగ్యంతో కేజీహెచ్‌లో మృతిచెందారని, ఆరు నెలలుగా జీతాలు చెల్లించకపోవడంతో వైద్యానికి డబ్బులు లేక మృతి చెందారని పేర్కొన్నారు. పెండిగ్ జీతాలను వెంటనే చెల్లించాలని, మృతి చెందిన ఉపాధ్యాయుడి కుటుంబానికి రూ.1 కోటి నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి

» సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సింగరావు



మాట్లాడుతున్న సీహెచ్ నర్సింగరావు

సిరిపురం, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : విశాఖ డెయిరీలో తొలగించిన కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నర్సింగరావు డిమాండ్ చేశారు. విశాఖ డెయిరీలో ఆకారణంగా తొలగించిన కాంట్రాక్టు కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ శుక్రవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద విశాఖ డెయిరీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సింగరావు మాట్లాడుతూ 305 మందిని అన్యాయంగా, ఎలాంటి ముందస్తు నోటీసులు లేకుండా జూన్ 10న యాజమాన్యం తొలగించిందని, ఇది అన్యాయమన్నారు. దీనిపై కార్మిక శాఖ జాయింట్ కమిషనర్ స్పందిస్తూ అందరినీ విధుల్లోకి తీసుకోవాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారన్నారు. తక్షణమే తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్కేఎస్వీ కుమార్, యూనియన్ గౌరవాధ్యక్షుడు ఎం.రాంబాబు, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు జి.నాయుడుబాబు, పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు రెడ్డి వెంకట్రావు, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

సీసీ రోడ్లు, కాలువలు ప్రారంభం

పెందుర్తి, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 96వ వార్డులోని అయ్యప్ప ఆలయం ప్రాంతం, ప్రగతినగర్, లక్ష్మీనగర్, రాజుచెరువు, దాడి అప్పారావు కాలనీలో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్లు, కాలువలను మేయర్ పీలా శ్రీనివాసరావు శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గవర కార్పొరేషన్ డైరెక్టర్ వేగి పరమేశ్వరరావు. టీడీపీ వార్డు అధ్య క్షుడు పెంటకోట రాజేంద్ర ప్రసాద్, పీలా జితేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

ఏడుగురు పేకాటరాయుళ్ల అరెస్టు

పెందుర్తి, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : పెందుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలోని సుజాతనగర్‌లో పేకాట ఆడుతున్న ఏడుగురిని శుక్రవారం అదుపులోకి తీసుకున్నట్టు సీఐ కేవీ సతీష్‌కుమార్ తెలిపారు. ముందుగా వచ్చిన సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ సిబ్బందితో కలిసి దాడి చేశామన్నారు. వారి వద్ద నుంచి రూ. 20 వేల స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు.

భద్రతలో స్టీల్‌ప్లాంట్‌కు అవార్డులు



అవార్డు అందుకుంటున్న ప్లాంట్ అధికారులు, గుర్తింపు సంఘం నాయకులు

ఉక్కుటౌన్‌షిప్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ఉక్కుకర్మాగారం ‘నో ఫేతల్ జోన్‌లలో’ (2023, 2024 సంవత్సరాలకు) కాంట్రాక్టు కార్మికుల కేటగిరిలో కోక్‌ఓవేన్, రోలింగ్ మిల్స్, ప్రాజెక్టు విభాగాలకు అవార్డులను సొంతం చేసుకుంది. ఈ అవార్డులను తీసుకునేందుకు శుక్రవరం రాంచీలో జరిగిన జాయింట్ కమిటీ ఆన్ సేఫ్టీ, ఎన్విరాల్‌మెంట్ ఇన్‌ద స్టీల్ ఇండస్రీ (జేసీఎస్ఎస్ఐ)-2025 సమావేశానికి ప్లాంట్ అధికారులు, గుర్తింపు యూనియన్ అధ్యక్షుడు కేఎస్ఎన్.రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా జేసీఎస్ఎస్ఐ వైస్‌చైర్మన్ అనుప్‌కుమార్ ఈ అవార్డులను అందించారు. ఈ సమావేశానికి ప్లాంట్ హెచ్‌వోడిలు జి.ఫణికుమార్ (సేఫ్టీ), కేవీ.దినకర్ (డబ్ల్యూఆర్ఎం-2), డీజీఎం (ఆపరేషన్స్) బి.రమేశ్‌బాబు, గుర్తింపు యూనియన్ అధ్యక్షుడు కేఎస్ఎన్.రావు, హెచ్ఎంఎస్, బీఎంఎస్ నాయకులు హాజరయ్యారు.

వాహనాలు భద్రపరిచేందుకు స్థలం కేటాయింపు

గాజువాక, జూలై 25 (ఆంధ్రజ్యోతి): వివిధ కేసుల్లో పట్టుబడి ఏళ్ల తరబడి పోలీస్ స్టేషన్‌లో ఉన్న వాహనాలను డంప్ చేసేందుకు ప్రత్యేకంగా స్థలం కేటాయించడంతో వాటికి మోక్షం కలగనుంది. గాజువాక డాక్ యార్డ్ కాలనీకి సమీపంలో సుమారు మూడెకరాల ప్రభుత్వ స్థలాన్ని రెవెన్యూ శాఖ కేటాయించింది. దీంతో ఎన్నో సంవత్సరాల నుంచి పోలీస్ స్టేషన్‌లో ఉండిపోయిన వాహనాలను ఈ స్థలానికి తరలించనున్నారు. 20 ఏళ్లగా వివిధ కేసుల్లో స్వాధీనం చేసుకున్న వాహనాలను వేరే ప్రాంతాల్లో భద్రపరిచే అవకాశం లేక, స్థానిక పోలీస్ స్టేషన్లకు తరలించారు. అలా పోలీస్ స్టేషన్లు డంపింగ్ యార్డులను తలపించే విధంగా ఉన్నాయి. కొన్న సందర్భాల్లో కోర్టు అనుమతితో కొన్ని వాహనాలు వేలం వేయడం, కొన్నింటిని యజమానులకు అప్పగించారు. ఇంకా మిగిలిన వాహనాలను కొత్తగా కేటాయించిన స్థలానికి తరలించనున్నారు.

మడ అడవులతోనే మనుగడ

వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత మనదే

- తీరం కోత నివారణ, మత్స్య సంపద రక్షణలో కీలకం
- తమిళనాడు, ఒడిశాలో పెంపకం
- జిల్లాలో కేవలం 220 హెక్టార్లకే పరిమితం
- అభివృద్ధి పేరిట కనుమరుగవుతున్న వైనం

నేడు అంతర్జాతీయ మడ అడవుల దినోత్సవం

విశాఖపట్నం, జూలై 25 (ఆంధ్రజ్యోతి):

సముద్రం కోత, తుఫాన్‌ల తీవ్రత నుంచి రక్షణ, జీవ వైవిధ్యం కాపాడేందుకు మడ అడవులు ఎంతో కీలకం. ప్రకృతి ప్రసాదిత మడ అడవులను పరిరక్షిస్తేనే మానవ మనుగడ సాధ్యమవుతుంది. అయితే దురదృష్టవశాత్తు జిల్లాలోని మడ అడవులను అభివృద్ధి పేరిట నిర్లక్ష్యంగా కొట్టివేయడంతో పర్యావరణ సమతుల్యత దెబ్బతింటోందని ఆ రంగంలోని నిపుణులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నగరంలోని డాక్‌యార్డు నుంచి షీలానగర్ వరకు మేహాద్రిగెడ్డ పరీవాహక ప్రాంతంలో అభివృద్ధి పేరిట ప్రకృతి ప్రసాదిత మడ అడవులను కొట్టేశారు. ఇంకా నగరంలో వివిధ ప్రాంతాల నుంచి నిర్మాణ వ్యర్థాలను మడఅడవులు ఉండే ప్రాంతంలో డంప్ చేస్తున్నారు. విదేశీ పక్షుల విడిది కేంద్రంగా నిలిచే ఈ ప్రాంతం, ఉప్పునీరు చొచ్చుకుని రాకుండా అడ్డుకునేది. మడఅడవుల్లో రొయ్యలు, పీతలు, ఇతర చేపలు, ఉప్పునీటిలో జీవించే పలు రకాల జీవులు ఉండేవి. మేహాద్రిగెడ్డ నుంచి వచ్చే వరద తీవ్రతను తగ్గించి డాక్‌యార్డు, తూర్పునావికాదళం, పోర్టు గోదాములకు రక్షణ కవచంలా నిలిచేది. అటువంటి మడ అడవుల్లో ఎక్కువ భాగం తొలగించేశారు. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ ఫారెస్టు రీసెర్చి అండ్ ఎడ్యుకేషన్‌కు చెందిన కోస్టల్ ఎకో సిస్టమ్ సెంటర్ నివేదిక మేరకు విశాఖ జిల్లాలో 220 హెక్టార్లలో మాత్రమే మడ అడవులున్నాయి. అయితే ఫారెస్టు సర్వే ఆఫ్ ఇండియా నివేదికలో ఈ వివరాలు పొందుపర్చలేదు.

భీమిలి, మేహాద్రిగెడ్డ పరిధిలో...

మడ అడవులు అనగానే గుర్తుకు వచ్చేవి కాకినాడ దరి కోరంగా అటవీప్రాంతం. తూర్పు తీరంలో సుందర్‌బాన్స్ కూడా మడ అడవులే. జిల్లాలోని భీమునిపట్నం వద్ద గోస్తనీ నది ముఖద్వారం, మేహాద్రిగెడ్డ రిజర్వాయర్ కింద చిన్న ప్రాంతంలో మడ అడవులున్నాయి. విశాఖకు తుఫాన్‌ల ముప్పు, కోత నివారణ, ఉప్పు నీరు సముద్రం నుంచి ముందుకు రాకుండా కాపాడేవి ఈ మడ అడవులే. నాలుగున్నర దశాబ్దాల క్రితం మేహాద్రిగెడ్డ రిజర్వాయర్ నుంచి డాక్‌యార్డు వరకు, పోర్టు నుంచి సముద్రంలో నీటి ప్రవాహం ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో దట్టంగా మడ అడవులు ఉండేవని జీవవైవిధ్య నిపుణుడు డాక్టరు ఎస్.ముకుందరావు తెలిపారు. పోర్టు పరిసరాల్లో మడ అడవులు తగ్గడంతో విదేశీ వలస పక్షుల రాక గణనీయంగా తగ్గిపోయిందన్నారు.

ఇతర రాష్ట్రాల్లో రక్షణ

తమిళనాడు, ఒడిశాలోని తీర ప్రాంతాల్లో ప్రధానంగా నదీ ముఖద్వారాలవద్ద మడ అడవుల సంరక్షణకు అనేక ప్రణాళికలు రూపొందించి అమలుచేస్తున్నారు. ఇందుకు ప్రత్యేకించి ఒక కార్యక్రమం రూపొందించారు.గడచిన రెండుమూడు దశాబ్దాలలో ఈ రెండు రాష్ట్రాల పరిధిలో మడ అడవుల పెంపకం, రక్షణకు సంబంధించి మంచి ఫలితాలు సాధించారు. ఇటీవల తమిళనాడులో మడ అడవుల రక్షణకు వీలుగా మరిన్ని మొక్కలు నాటే కార్యక్రమం ఉధృతంగా సాగుతోందని ముకుందరావు అన్నారు.



అడవులపై అవగాహన

భీమిలి దరి గోస్తనీ ప్రాంతంలో అడవుల పెంపకానికి కేంద్ర అటవీశాఖ పరిశోధనా సంస్థ ప్రణాళిక రూపొందించింది. కార్బన్ మార్కెట్ ఇనీషియేటివ్-2024 పేరిట కార్బన్ క్రెడిట్ నిధుల ద్వారా మడ అడవుల పెంపకం, రక్షణకు రాష్ట్ర అటవీశాఖ ప్రణాళిక రూపొందించింది. గోస్తనీ నది ముఖ ద్వారం వద్ద రెండేళ్ల క్రితం కేంద్ర అటవీ పరిశోధనా సంస్థ మడ అడవుల పెంపకానికి ముందుకు వచ్చింది. ప్రతి ఏటా ప్రపంచ మడ అడవుల దినోత్సవం సందర్భంగా భీమిలి పరిసరాల్లో ప్రజలకు అవగాహన చేపడుతోంది. దీనిలో భాగంగా శనివారం గోస్తనీ నది ముఖ ద్వారం వద్ద మాంగ్రోస్ వాక్ నిర్వహిస్తున్నారు. వైజాగ్ బర్డ్‌వాచ్ ప్రతినిధి వివేక్ రాథోడ్, ధ్యాన్‌ఫౌండేషన్ ప్రతినిధి సాయి కృష్ణ తదితరులు ఈ వాక్ ప్రాధాన్యతను వివరించనున్నారు. ఇంకా గోస్తనీ నది వద్ద మూడు చోట్ల, అన్నవరం గ్రామంలో ఒక చోట మడ అడవుల పెంపకానికి వీఎంఆర్‌డీఏ కొంత భూమి కేటాయించింది. సుమారు రెండు వేల మొక్కలు పెంచాలని లక్ష్యమని ధ్యాన్ ఫౌండేషన్ ప్రతినిధి సాయికృష్ణ తెలిపారు. మడ అడవులు పెంపకానికి నర్సరీలు ఏర్పాటుచేసి మొక్కలను అందజేయడం, ఉన్నవి కాపాడేందుకు ప్రభుత్వం కార్యాచరణ రూపొందించి అమలుచేయాలని జీవ వైవిధ్య నిపుణుడు డాక్టరు ఎస్.ముకుందరావు సూచించారు. వాతావరణ మార్పులతో తుఫాన్‌ల తీవ్రత పెరిగిందని, తీరప్రాంతాల్లో పెనుగాలుల నుంచి రక్షణ, తీరం కోత నుంచి నివారణకు మడ అడవులే కీలకమన్నారు. రసాయన కంపెనీలు, నగరాలు, పట్టణాల నుంచి విడిచిపెట్టే మురుగునీటితో తీర ప్రాంతాల్లో జీవ వైవిధ్యానికి ముప్పు వాటిల్లిందని ఆయా ప్రాంతాల్లో మడ అడవులు పెంచాలన్నారు.

ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌తో ఉజ్వల భవిష్యత్తు

ప్రతి ఇన్నోవేషన్‌కు గుర్తింపు...ప్రతిభతోనే పరిష్కారాలు

ఫ్యూజన్ ఏఐ సదస్సులో మంత్రి కొండపల్లి శ్రీనివాస్

విశాఖపట్నం, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ జీవితంలో భాగంగా మారిపోయిందని, అనేక సమస్యలకు పరిష్కారం చూపిస్తోందని ఎంఎస్ఎంఈ శాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్ ఎరీనాలో డీప్‌టెక్ నైపుణ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటైన 'ఫ్యూజన్ ఏఐ సదస్సు'ను మంత్రి శుక్రవారం జ్యోతి వెలిగించి ప్రారంభించి మాట్లాడుతూ ఏఐ వినియోగం వల్ల ఉత్పత్తి వ్యయం, మానవ వనరుల అవసరం తగ్గుతున్నదన్నారు. దీని వల్ల భవిష్యత్తులో ఉద్యోగావకాశాలు పోతాయని ప్రచారం జరుగుతోందని, అంతకు మించిన అవకాశాలు వస్తాయన్నారు. సమాజంలో అనేక సమస్యలు ఉన్నాయని, వాటికి సాంకేతికత సాయంతో పరిష్కారాలు కనుగొనేందుకు ఆలోచించాలన్నారు. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు వచ్చే సందేహాలను వెబ్‌సైట్‌లో ఏఐ, చాట్ జీపీటీ ద్వారా నివృత్తి చేస్తోందన్నారు. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అభివృద్ధి చేయడానికి విశాఖ అనుకూల నగరమని ఎన్‌విడియా దక్షిణ ఆసియా ఎండీ విశాల్ ధూపర్ అన్నారు. పరిశ్రమలను మరో స్థాయికి తీసుకువెళ్లడానికి ఏపీ చక్కటి అవకాశమని ఏపీఎస్ఆర్‌టీ అధ్యక్షులు వేమూరి రవి అన్నారు. సదస్సు నిర్వాహకులు, డీప్‌టెక్ నైపుణ్య ఫౌండేషన్ వ్యవస్థాపకులు శ్రీధర్ కొసరాజు మాట్లాడుతూ ఏఐ విప్లవాన్ని ప్రారంభించడానికి మనదేశం వేదికగా మారిందని, విశాఖ అందులో కీలకంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎస్‌టీపీఐ డైరెక్టర్ సురేశ్ బాతా తదితరులు ప్రసంగించారు. సదస్సుకు వేయి మంది ఐటీ రంగానికి చెందిన ప్రతినిధులు హాజరయ్యారు.



సదస్సులో మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాస్. చిత్రంలో వేమూరు రవి, సురేశ్ బాతా, కొసరాజు శ్రీధర్, విశాల్ ధూపర్ ఉన్నారు

కనకమహాలక్ష్మి ఆలయంలో శ్రావణ పూజలు ప్రారంభం

మహారాణిపేట, జూలై 25 (ఆంధ్రజ్యోతి): శ్రావణమాసం ప్రారంభం సందర్భంగా బురుజుపేటలోని కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో శుక్రవారం శ్రావణ మహాలక్ష్మి పూజలను ఘనంగా ప్రారంభించారు. మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొన్న ఈ పూజలను దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈవో శోభారాణి, అర్చకులు, వేద పండితుల సమక్షంలో ఉభయదాతలు పూజలు చేశారు. పూజలు, అలంకరణ అనంతరం భక్తులు పెద్దసంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు.



పూజలు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

డిసెంబరు 26 నుంచి విశాఖ ఉత్సవ్

- నవంబరు 30న భీమిలి ఉత్సవ్
- పర్యాటకంపై విస్తృత ప్రచారం చేయండి
- సోషల్ మీడియా ఆర్గనైజర్ల సమావేశంలో కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్

మహారాణిపేట, జూలై 25 (ఆంధ్రజ్యోతి): పర్యాటక శాఖ ఆధ్వర్యంలో సెప్టెంబరు 17 నుంచి 19 వరకు ట్రావెల్ మార్టు, నవంబరు 30 నుంచి భీమిలి ఉత్సవ్, డిసెంబరు 26 నుంచి 28 వరకు విశాఖ ఉత్సవ్, వచ్చే ఏడాది మార్చి 19న ఉగాది ఉత్సవాలు నిర్వహిస్తామని జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ వెల్లడించారు. విశాఖ పర్యాటక ప్రాముఖ్యాన్ని డిజిటల్ మీడియా ద్వారా దేశ, విదేశాలకు వ్యాప్తి చేయాలని సోషల్‌మీడియా ఆర్గనైజర్లను కోరారు. శుక్రవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ ఇతర రాష్ట్రాలు, విదేశీయులు ఇక్కడ విశేషాలు తెలుసుకొని సందర్శించే విధంగా విశాఖ పర్యాటకానికి విస్తృత ప్రచారం కల్పించాలన్నారు. పర్యాటకానికి ఊతమిచ్చేలా ప్రణాళిక రూపొందిస్తున్నామని, సోషల్ మీడియా సహకారం కావాలని కోరారు. అక్టోబరు నుంచి విశాఖలో పర్యాటక సీజన్ ప్రారంభమవుతుందని, అందువల్ల పర్యాటక, సాంస్కృతిక ప్రాంతాలను హైలైట్ చేయాలని సూచించారు. రానున్న మూడు, నాలుగు వారాల్లో ఫొటో, వీడియో పోటీలు నిర్వహించి నగదు బహుమతులు అందిస్తామన్నారు. సమావేశంలో జిల్లా టూరిజం అధికారిణి మాధవి, ఈవెంట్ మేనేజర్లు, సోషల్ మీడియా ఆర్గనైజర్లు పాల్గొన్నారు.



సోషల్ మీడియా ఆర్గనైజర్లతో కలెక్టర్ హరేంధిర ప్రసాద్

ఎస్‌పీఆర్‌ఈఈని వినియోగించుకోవాలి

- ఈఎస్ఐ డిప్యూటీ డైరెక్టర్ సాహు

విశాఖపట్నం, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు సంస్థలు/ కంపెనీల్లో పనిచేసే ఉద్యోగులు, యజమానులకు సంబంధించి కేంద్రం అమలు చేసిన కొత్త పథకం ఎస్‌పీఆర్‌ఈఈ (ఉద్యోగుల రిజిస్ట్రేషన్ ప్రమోషన్ కోసం పథకం)ను వినియోగించుకోవాలని ఈఎస్ఐసీ డిప్యూటీ డైరెక్టర్ ఎస్‌కే సాహు కోరారు. నగరంలో శుక్రవారం జరిగిన సమావేశంలో మాట్లాడుతూ ఈఎస్ఐసీలో స్వీయ నమోదుకు డిసెంబరు వరకు గడువిచ్చారన్నారు. ఎటువంటి రికార్డుల తనిఖీలు, ప్రాసిక్యూషన్ ఉండవన్నారు. సమావేశంలో అసిస్టెంట్ డైరెక్టర్ శ్యాంప్రసాద్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

సీఐఎస్ఎఫ్ జవాన్లకు శిక్షణ



కశ్మీర్‌లో శిక్షణ తీసుకుంటున్న సీఐఎస్ఎఫ్ జవాన్లు

విశాఖపట్నం, జూలై 25 (ఆంధ్రజ్యోతి): కేంద్ర కర్మాగార భద్రతా దళం (సీఐఎస్ఎఫ్) జవాన్లు భారత సైన్యంతో కలిసి ఇంటెన్సివ్ శిక్షణ పొందుతున్నట్టు విశాఖ పోర్టు సీఐఎస్ఎఫ్ సీనియర్ కమాండెంట్ సతీష్‌కుమార్ బాజ్‌పాయ్ తెలిపారు. రాత్రి ఆపరేషన్లు, జంగిల్ వార్ ఫెయిర్, క్లోజ్‌కంబాట్ వంటి అంశాల్లో శిక్షణ అందిస్తున్నారని ఆయన వివరించారు.

విశాఖలో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయాలి

- న్యాయవాదుల మహాధర్నా

విశాఖపట్నం, జూలై 25 (ఆంధ్రజ్యోతి): విశాఖలో హైకోర్టు బెంచ్ తక్షణమే ఏర్పాటు చేయాలని ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ రాష్ట్ర అధ్యక్షుడు కె.సురేష్‌కుమార్ డిమాండ్ చేశారు. జిల్లా కోర్టుల సముదాయం ఆవరణలో శుక్రవారం మహాధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యాయవాదుల రక్షణ చట్టంలో మార్పులు, నూతన న్యాయస్థానాల నిర్మాణం, ఖాళీగా ఉన్న న్యాయమూర్తుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా రెవెన్యూ అధికారి సురేష్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో భగవతి, అజయ్‌కుమార్, ఇందిర, శైలజ తదితరులు పాల్గొన్నారు.



మహాధర్నాలో పాల్గొన్న న్యాయవాదులు

క్రైం... crime news

బాలికపై అత్యాచారం చేసిన ముద్దాయికి జైలు

విశాఖపట్నం, జూలై 25 (ఆంధ్రజ్యోతి): బాలికపై అత్యాచారానికి పాల్పడిన ముద్దాయికి 20 ఏళ్ల జైలు శిక్ష, రూ.75వేల జరిమానా విధిస్తూ పోక్సో ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి పి.మంగాకుమారి శుక్రవారం తీర్పు చెప్పారు. బాధితురాలికి ప్రభుత్వం రూ.5 లక్షల పరిహారం చెల్లించాలని తీర్పులో పేర్కొన్నారు. ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ బత్తి రాజశేఖర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పెదబయలు మండలం చిన్నవీధి గ్రామానికి చెందిన కుర్ర రంజిత్‌కుమార్ 2020 అక్టోబరు 13న బాలికను అపహరించి అత్యాచారం చేశాడు. బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు పాడేరు పోలీసులు కేసునమోదు చేసి, చార్జిషీట్ దాఖలు చేశారు. వాదోపవాదాల అనంతరం నేరం రుజువుకావడంతో న్యాయమూర్తి శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని ఇద్దరికి గాయాలు

ఎంవీపీ కాలనీ, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : వెంకోజీపాలెం జాతీయ రహదారి వద్ద పట్టపగలే ఓ కారు ద్విచక్ర వాహనాన్ని ఢీకొని, వేగంగా వెళ్లిపోయింది. ఈ సంఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. ఎంవీపీ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఓ ప్రైవేటు సంస్థలో పనిచేస్తున్న అరిగిల నాగేశ్వరరావు, సహోద్యోగి గురాన రమేష్‌తో కలసి ద్విచక్ర వాహనంపై తగరపువలస వెళ్లేందుకు శుక్రవారం ఉదయం బయలు దేరారు. వెంకోజీపాలెం సీఎమ్మార్ ఫంక్షన్ హాలు వద్ద వెనుక నుంచి అతి వేగంగా వచ్చిన కారు వీరి వాహనాన్ని ఢీకొని ఆగకుండా వెళ్లిపోయింది. నాగేశ్వరరావు తలకు తీవ్ర గాయమై అపస్మారక స్థితిలోకి వెళ్లిపోగా, రమేష్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ఐదుగురు పేకాట రాయుళ్ల అరెస్టు

ఎంవీపీ కాలనీ, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ఓ లాడ్జిలో జూదమాడుతున్న ఐదుగురిపై కేసు నమోదు చేసి, అరెస్టు చేసినట్టు పోలీసులు తెలిపారు. ఎంవీపీ కాలనీ మూడో సెక్టరులోని లాడ్జిలో పేకాట ఆడుతున్న సమాచారం అందుకుని దాడి చేసి, వారి నుంచి రూ.49,300 స్వాధీనం చేసుకున్నారు. ఆట కోసం గదిని బుక్ చేసిన వ్యక్తి పారిపోయినట్టు పోలీసులు గుర్తించారు.

9 కేజీల గంజాయితో ముగ్గురి అరెస్టు

భీమునిపట్నం (రూరల్) జూలై 25 (ఆంధ్రజ్యోతి): గంజాయి రవాణా చేస్తున్న వారిని పట్టుకుని 9 కేజీలను స్వాధీనం చేసుకున్నట్టు పోలీసులు తెలిపారు. ఒడిశా నుంచి విశాఖ వస్తున్న బస్సులో గంజాయి రవాణా అవుతున్నట్టు సమాచారం రావడంతో శుక్రవారం బోడమిట్టపాలెం వద్ద తనిఖీ చేశారు. సీటు కింద ఉంచిన బ్యాగులో 9 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని ముగ్గురిని అదుపులోకి తీసుకున్నట్టు సీఐ బి.తిరుమలరావు తెలిపారు.

మూడు కేజీల గంజాయితో నలుగురు...

ఆరిలోవ, జూలై 25 (ఆంధ్రజ్యోతి): గంజాయి తరలిస్తున్న నలుగురిని విశాఖ వేలీ స్కూలు సమీపంలో పట్టుకొన్నట్టు ఆరిలోవ సీఐ మల్లేశ్వరరావు తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం నీలిగిరి తోటలో సంచుల్లో దాచి పెట్టిన గంజాయిని తరలించేందుకు సిద్ధమవుతుండగా ఎస్ఐ రామదాసు సిబ్బందితో వెళ్లి పట్టుకున్నారన్నారు. నిందితులు దాడిశెట్టి గరిధర్, పాండవ ప్రేమ్‌కుమార్, బూసి నరేష్, దేగల సన్నిబాబుల నుంచి మూడు కేజీల గంజాయి స్వాధీనం చేసుకొని, కోర్టులో హాజరు పరిచామన్నారు.

అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఇద్దరి అరెస్టు

ఆనందపురం, జూలై 25 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు సీఐ చింతా వాసునాయుడు తెలిపారు. సమాచారం మేరకు గురువారం రాత్రి సిటీ టాస్క్‌ఫోర్స్ ఎస్ఐ, స్థానికఎస్ఐ శివ శిర్లపాలెంలో తనిఖీ చేయగా కెల్ల గౌరి, బల్లంకి బంగారాజు అక్రమంగా మద్యం విక్రయిస్తుండగా వారిని అదుపులోకి తీసుకుని 162 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను శుక్రవారం భీమిలి 15వ అదనపు కోర్టులో హాజరుపరచగా, రిమాండ్ విధించారన్నారు.

ఆర్టీసీలో అప్రెంటిస్‌షిప్‌నకు దరఖాస్తుల ఆహ్వానం

ద్వారకాబస్‌స్టేషన్, జూలై 25(ఆంధ్రజ్యోతి): వివిధ ట్రేడులలో ఐటీఐ పూర్తిచేసిన విద్యార్థులకు ఆర్టీసీలో అప్రెంటిస్‌షిప్ చేసేందుకు ఆర్టీసీ విజయనగరం జోనల్ స్టాఫ్ ట్రైనింగ్ కళాశాల యాజమాన్యం నిర్ణయించింది. ఈ మేరకు అర్హుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. apprinticshipindia.gov.in వెబ్‌సైట్‌లో ఆగస్టు 9లోగా పేర్లను నమోదుచేసుకోవాలని ట్రైనింగ్ కళాశాల అధికారులు కోరారు.

జిల్లాల వారీగా ఖాళీలు

విశాఖ జిల్లాలో డీజిల్, మోటారు మెకానిక్, ఎలక్ట్రీషియన్, వెల్డర్ పెయింటర్, ఫిట్టర్, డ్రాఫ్ట్‌మెన్ సివిల్ ట్రేడులలో ఖాళీలున్నాయి. అనకాపల్లి జిల్లాలో డీజిల్, మోటారు మెకానిక్, ఎలక్ట్రీషియన్, ఏఎస్ఆర్ జిల్లాలో డీజిల్ మెకానిక్, ఎలక్ట్రీషియన్, విజయనగరం జిల్లాలో డీజిల్, మోటారుమెకానిక్, ఎలక్ట్రీషియన్, వెల్డర్, పెయింటర్, ఫిట్టర్, డ్రాఫ్ట్‌మెన్ సివిల్, షీట్ మెటల్ వర్కర్, పెయింటర్, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో డీజిల్, మోటారు మెకానిక్, ఎలక్ట్రీషియన్, వెల్డర్, డ్రాఫ్ట్‌మెన్ సివిల్ ట్రేడులలో ఖాళీలున్నాయి.

11 నుంచి ధ్రువపత్రాల పరిశీలన

ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న విజయ నగరం, పార్వతీపురం మన్యం జిల్లాల అభ్యర్థులకు ఆగస్టు 11న, డాక్టర్ బీఆర్‌అంబేడ్కర్ కోనసీమ, కాకినాడ, తూర్పుగోదావరి జిల్లాల అభ్యర్థులకు12, విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల అభ్యర్థులకు 13న, శ్రీకాకుళం జిల్లా అభ్యర్థులకు 14న ధ్రువపత్రాల పరిశీలన చేపడతారు. ఇందుకోసం రిజిస్ట్రేషన్ ఫారం, ఎస్ఎస్‌సీ, ఐటీఐ మార్కుల జాబితా, కుల ధ్రువీకరణ పత్రం (ఎస్సీ, ఎస్టీ, బీసీలు), మండల కార్యాలయం నుంచి పొందిన నివాస ధ్రువీకరణపత్రం, ఆధార్‌కార్డు, బయోడేటా ఫారం, స్పోర్ట్స్, పీహెచ్‌సీ, ఒరిజనల్స్‌తో పాటు ఒక సెట్ జెరాక్స్ కాపీలు తీసుకురావాల్సి ఉంటుందన్నారు.

కేకే లైన్‌లో రైళ్ల గమ్యాల కుదింపు

విశాఖపట్నం, జూలై 25 (ఆంధ్రజ్యోతి): కేకే లైనులో రైళ్ల పాక్షిక రద్దు, గమ్యాల కుదింపు నిర్ణయం కొనసాగుతోంది. ఈ నెల 29 వరకు కిరండూల్ రైళ్లతోపాటు హిరాకుడ్, సమలేశ్వర్, ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ రైళ్లను పాక్షికంగా రద్దు చేయడంతోపాటు గమ్యాలను కుదించి కొరాపుట్ వరకే నడిపిస్తామని సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు.

విశాఖ-కిరండూల్ రాత్రి ఎక్స్‌ప్రెస్ ఈ నెల 26, 27 తేదీల్లో విశాఖలో, తిరుగు ప్రయాణంలో ఈ నెల 27, 28లలో కొరాపుట్‌లో బయలుదేరుతాయి. విశాఖ-కిరండూల్ పాసింజర్ ఈనెల 27, 28 తేదీల్లో విశాఖలో, తిరుగు ప్రయాణంలో ఈ నెల 27, 28 తేదీల్లో కొరాపుట్‌లో బయలుదేరుతాయి.

హౌరా-జగదల్‌పూర్ సమలేశ్వర్‌ఈ నెల 26, 27 తేదీల్లో హౌరాలో, తిరుగు ప్రయాణంలో ఈ నెల 28, 29 తేదీల్లో కొరాపుట్‌లో బయలుదేరుతాయి. ఈ సర్వీసులను కొరాపుట్-జగదల్‌పూర్ మధ్య రద్దుచేశారు.

రూర్కెలా-జగదల్‌పూర్ ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 26, 27 తేదీల్లో రూర్కెలా నుంచి కొరాపుట్ వరకు, 27, 28 తేదీల్లో కొరాపుట్ నుంచి రూర్కెలా వరకు నడుస్తుంది. భువనేశ్వర్-జగదల్‌పూర్ హిరాకుడ్ 26, 27 తేదీల్లో భువనేశ్వర్‌లో బయలుదేరి కొరాపుట్ వరకు, తిరుగు ప్రయాణంలో ఈ నెల 27, 28 తేదీల్లో కొరాపుట్‌లో బయలుదేరి భువనేశ్వర్ చేరుతాయి. ఈ సర్వీసులను కొరాపుట్-జగదల్‌పూర్ మధ్య రద్దు చేసినట్లు డీసీఎం తెలిపారు.

నవోదయ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కొమ్మాది, జూలై 25 (ఆంధ్రజ్యోతి): కొమ్మాది నవోదయావిద్యాలయంలో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ చంద్రశేఖర్ తెలిపారు. ఆరో తరగతి ప్రవేశపరీక్షకు ఈనెల 29లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. విద్యార్థులు జిల్లాకు చెందిన వారై ఉండాలని నవోదయ విద్యాలయ వెబ్‌సైట్‌లో దరఖాస్తులను అప్‌లోడ్ చేయాలన్నారు. పాస్‌పోర్టు సైజు ఫొటో, సంతకం, 3, 4, 5 తరగతులు చదువుతున్న పాఠశాల వివరాలతో సంబంధిత ఫారం నింపి పాఠశాల ప్రధానోపాధ్యాయులతో ధ్రువీకరణ చేసి, ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు.

విశాఖ ఎక్స్‌ప్రెస్‌కు ఆధునిక ఎల్‌హెచ్‌బీ కోచ్‌లు

విశాఖపట్నం, జూలై 25 (ఆంధ్రజ్యోతి): విశాఖ మీదుగా సికింద్రాబాద్, భువనేశ్వర్ మధ్య రాకపోకలు సాగిస్తున్న విశాఖ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు ఆధునిక ఎల్‌హెచ్‌బీ కోచ్‌లు అందుబాటులోకి రానున్నాయని సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. సికింద్రాబాద్ నుంచి భువనేశ్వర్ వచ్చే 17016 నంబరు గల న్యూ విశాఖ ఎక్స్‌ప్రెస్ రైలుకు సెప్టెంబరు 9 నుంచి, భువనేశ్వర్ నుంచి సికింద్రాబాద్ వెళ్లే 17015 నంబరు గల ఎక్స్‌ప్రెస్ రైలు సెప్టెంబరు 25 నుంచి అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు.